జూన్
2016

122

సంపుటి : 11 సంచిక : 2 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

కార్పొరేట్లకు లాభం ప్రజలకు త్యాగం : విజన్ 2029
ఆధునిక ప్రజాస్వామ్యం - మతతత్వం
శాస్త్రీయ దృక్పథం
అభివృద్ధిలో ఎఫ్‌డిఐల పాత్ర నామమాత్రమే
ఉన్నత విద్యలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు
చరిత్రకారులపై ఎందుకీ దాడి !
సోషలిజానికి మార్గం కష్టమే కాని అసాధ్యం కాదు
బానిస వ్యాపారం రద్దు రాజకీయాలు
ఐరిష్ విప్లవ యోధుడు జేమ్స్ కానొల్లి

**శత వార్షిక నివాళి**

# ఐరిష్ విప్లవ యోధుడు జేమ్స్ కానొల్లి

**ప్రకాష్ కరత్**

**1916**లో జరిగిన చారిత్రాత్మకమైన ఈస్టర్ తిరుగుబాటు శతవార్షికోత్సవాన్ని ఐరిష్ రిపబ్లిక్ ప్రజలు జరుపుకుంటున్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం ఐరిష్ ప్రజలు చేస్తున్న పోరాటంలో ఈ తిరుగుబాటు ముఖ్యమైన గుర్తుగా మిగిలిపోయింది. బ్రిటిష్ సామ్రాజ్యంలో స్వతంత్ర దేశంగా 1921లో అధినివేశ ప్రతిపత్తిని సాధించటానికి దారితీసిన సాయుధ పోరాటం ప్రారంభం కావటానికి ఈ తిరుగుబాటు ప్రోత్సాహకంగా పనిచేసింది. డబ్లిన్ కేంద్రంలోని జనరల్ పోస్ట్ ఆఫీస్‌ను, ఇతర ముఖ్య భవనాలను ఆక్రమించుకున్న 1500 మంది సాయుధ వలంటీర్లు ఐర్లాండ్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించారు. ఊహించకుండా జరిగిన ఈ ఘటనతో బ్రిటిష్ అధికారులు సైన్యాన్ని సమీకరించారు. ఐదు రోజులు పోరాటం జరిగింది. తిరుగుబాటుదారులు లొంగిపోవటానికి ముందు 450 మంది తిరుగుబాటుదారులు, పౌరులు మరణించారు. వేలాది మంది గాయపడ్డారు.

పాట్రిక్ పియర్స్, టామ్ క్లార్క్, జేమ్స్ కానొల్లి, సీన్ మెక్ డోర్మాట్ తదితరులు తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. వారు దేశభక్తిని అణువణువునా నింపుకున్నారు. పియర్స్ కవి, రచయిత, జాతీయవాది. వారిలో చెప్పుకోదగిన, అత్యంత ప్రముఖమైన వ్యక్తి జేమ్స్ కానొల్లి. ఆయన ఐరిష్ సోషలిస్టు, కార్మికసంఘ నాయకుడు, మార్క్సిస్టు. కార్మికోద్యమంలో ఆయన నిర్వహించిన పాత్ర, ఐరిష్ జాతి సమస్యను మార్క్సిస్టు దృక్పథంతో అవగాహన చేసుకోవటానికి ఆయన తోడ్పాటు ప్రధానమైనవి. అయినప్పటికీ 1917లో రష్యా విప్లవానికి ముందే జరిగిన తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ వారు ఆయనను ఉరితీయటంతో భారత్ లాంటి దేశాలలో ఆయన పాత్ర గురించి అంతగా తెలియదు. కానొల్లి స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బర్గ్‌లో ఒక పేద ఐరిష్ కుటుంబంలో జన్మించాడు. యువకుడుగా ఉండగానే ఆయన కార్మికుడుగా పనిచేస్తూ,



కార్మికులను సంఘటితం చేయటం ప్రారంభించాడు. మార్క్స్, ఎంగెల్స్ రచనలను అధ్యయనం చేయటం ద్వారా మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథాన్ని ఏర్పరచుకున్నాడు.

ఆయన ఇండిపెండెంట్ లేబర్ పార్టీలో చేరాడు. తర్వాత స్కాటిష్ సోషలిస్టు ఫెడరేషన్‌కు నాయకుడయ్యాడు. ఆయన అమెరికాకు వెళ్ళి, అక్కడ అమెరికన్ సోషలిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకడయ్యాడు. సిండికలిస్టు దృక్పథంతో ఉన్న ఇండస్ట్రియల్ వర్కర్స్ ఆఫ్ ది వరల్డ్ కార్యకర్తగా పనిచేశాడు.

1910లో ఐర్లాండ్‌కు తిరిగి వచ్చిన తర్వాత ఐరిష్ సోషలిస్టు రిపబ్లికన్ పార్టీ కార్యదర్శి అయ్యాడు. ఐరిష్ ట్రాన్స్‌పోర్ట్ ఆండ్ జనరల్ వర్కర్స్ యూనియన్‌కు ప్రధాన కార్యదర్శి కూడా అయ్యాడు. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు సంవత్సరాలలో జరిగిన వర్గ పోరాటాల వెల్లువకు ఈ సంఘం నాయకత్వం వహించింది.

కానొల్లి కేవలం కార్మికసంఘ నాయకుడు మాత్రమే కాదు. ఆయన స్వతంత్రంగా మార్క్సిస్టు దృక్పథాన్ని అభివృద్ధి చేసుకున్నాడు. ఆయన 1910లో ఈ విధంగా రాశాడు. "పెట్టుబడిదారీ విధానానికి మరమ్మత్తులు చేసే రోజులు గడిచిపోయాయి. దాన్ని తప్పని సరిగా అంతం చేయాలి". బ్రిటిష్ సామ్రాజ్యంలోని యూరోపియన్ వలస దేశంలో మిలిటెంట్ కార్మికవర్గ నాయకుడు కావటంతో జాతుల సమస్యపై కానొల్లి తన దృక్పథాన్ని అభివృద్ధి చేసుకున్నాడు. అది లెనిన్ అవగాహనకు అనుగుణంగా ఉంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ఐరిష్ ప్రజల జాతీయ స్వయం నిర్ణయాధికారం కోసం జరుగుతున్న పోరాటం సోషలిజం కోసం జరుగుతున్న వర్గ పోరాటంలో అంతర్భాగమని ఆయన అర్థం చేసుకున్నాడు. బ్రిటిష్ సామ్రాజ్యం నుండి ఐరిష్ ప్రజలు స్వాతంత్ర్యం పొందటాన్ని నీరుగార్చే " అంతర్జాతీయవాదం"పై పట్టుపట్టే సోషలిస్టుల నుండి ఆయన విడగొట్టుకున్నాడు. కానొల్లికి లెనిన్, బోల్షివిక్కులతో ప్రత్యక్ష సంబంధాలు లేవు. మొదటి ప్రపంచ యుద్ధంలో అనేక దేశాలలోని సోషల్ డెమోక్రాట్లు తమ దేశాల బూర్జువా వర్గానికి మద్దత్తు ఇవ్వటానికి బారులు తీరగా, ఆయన వివిధ దేశాల సామ్రాజ్యవాద పెట్టుబడిదారులు చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకించాడు. లెనిన్ నాయకత్వంలోని రష్యన్ సోషల్ డెమోక్రాట్లతో ఈ విషయంలో ఆయన సన్నిహితంగా ఉన్నాడు.

మహిళా సమస్యలకు సంబంధించి మొదటగా గళమెత్తిన వారిలో కానొల్లి ఒకరు. మహిళల సమానత్వం, విముక్తి కోసం జరగాల్సిన పోరాటాలను గురించి ఆయన రాతలు స్పష్టంగా, భవిష్యదవగాహనను తెలియజేసేలా ఉన్నాయి. మహిళా సమస్యలపై రాసిన ఒక వ్యాసంలో ఆయన ఈ విధంగా చెప్పాడు "పెట్టుబడిదారి సమాజానికి కార్మికుడు బానిస, మహిళా కార్మికురాలు బానిసకు బానిస".

పెట్టుబడిదారుల, బ్రిటిష్ అధికారుల హింసాత్మక దాడుల నుండి కార్మికులను కాపాడటానికి కానొల్లి ఏర్పాటు చేసిన కార్మిక దళాలను (మిలిషియా) –ఐరిష్ సిటిజెన్స్ ఆర్మీని– ఈస్టర్ తిరుగుబాటు జరపటానికి ఐరిష్ బ్రదర్ హుడ్‌లోని కొన్ని తరగతుల జాతీయవాదులతో కలిపినప్పటికీ, పోరాటం అప్పుడే ప్రారంభం అయిందని, పెట్టుబడిదారీ విధానాన్ని కూలద్రోసినపుడే ఐరిష్ స్వాతంత్రానికి అర్థం ఉంటుందని ఆయనకు స్పష్టంగా తెలుసు. ఆయన ఈ విధంగా హెచ్చరించాడు. " మీరు రేపు బ్రిటిష్ సైన్యాన్ని తొలగించి, డబ్లిన్ భవనంపై ఆకుపచ్చ జండాను ఎగురవేసినప్పటికీ, సోషలిస్టు రిపబ్లిక్‌ను స్థాపించకపోతే మీ ప్రయత్నాలన్నీ నిరర్థకంగా మారతాయి. ఇంగ్లండ్ నిన్ను పరిపాలిస్తూనే ఉంటుంది. ఇంగ్లండ్ ఈ దేశంలో నెలకొల్పి మన తల్లుల కన్నీళ్ళతో, మన అమరుల రక్తంతో పెంచి పోషించిన తన పెట్టుబడిదారుల ద్వారా, తన

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. ఐరిష్ విప్లవ యోధుడు జేమ్స్ కానొల్లి
   – ప్రకాష్ కరత్ 2

2. కార్పొరేట్లకు లాభం
   ప్రజలకు త్యాగం : విజన్ 2029
   – బివి రాఘవులు 4

3. ఆధునిక ప్రజాస్వామ్యం - మతతత్వం
   – ఎంవిఎస్ శర్మ 9

4. శాస్త్రీయ దృక్పథం
   – ఎస్ వెంకట్రావు 12

5. అభివృద్ధిలో ఎఫ్‌డిఐల పాత్ర నామమాత్రమే
   – అమానుల్లా ఖాన్ 17

6. ఉన్నత విద్యలో ప్రైవేటు రంగాన్ని
   ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు
   – నరేందర్ ఠాకూర్ 20

7. చరిత్రకారులపై ఎందుకీ దాడి !
   – టికె రాజాలక్ష్మి 22

8. సోషలిజానికి మార్గం కష్టమే
   కాని అసాధ్యం కాదు
   – మార్తా హర్నేకర్ 26

9. బానిస వ్యాపారం రద్దు రాజకీయాలు
   – జేమ్స్ వాల్విన్ 31



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్–20
**ఫోన్: ఎడిటోరియల్ 0866–2573822**
**మేనేజర్: 040–27673787**
EMail: svenkatarao_1958@yahoo.com
visit cpi(m) site at : cpim.org


# సంపద పెంపకం, పంపకం

సంపద పంచడం కాదు పెంచాలి అని కేంద్ర మంత్రి వెంకయ్యానాయుడు గారు ఇటీవల ఒక సభలో పేర్కొన్నారు. వాస్తవానికి ఇది వెంకయ్యానాయుడుగారి మాటకాదు, నయా–ఉదారవాదుల మాట. నాటి అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్, బ్రిటిష్ ప్రధాని మార్గరెట్ థాచర్‌నుండి నేటి అరుణ్ జైట్లీ, వెంకయ్యానాయుడు వరకు నయా–ఉదారవాద మార్గం పట్టిన నాయకులంతా ఇదే రొద పెడుతున్నారు. కమ్యూనిస్టులు సంపదను పంచమంటారు దాని వల్ల పేదరికం పెరుగుతుంది, సంపద పెంచితే అందరూ ధనవంతులవుతారు అనేది వీరి వాదన. దీనికి గతంలో అమెరికా, ఐరోపాలను ఉదాహరణగా చూపించేవారు, కొంతకాలం నుండి చైనాను ఉదాహరణగా చూపిస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితం వరకు ఏటా10 శాతం అభివృద్ధి సాధించిన చైనా ఎలా పేదరికం పోగొట్టిందో చూడమని వీళ్లు చెబుతున్నారు.

కానీ వాస్తవం ఏమంటే ఇప్పుడు చైనా సంపద పెంపకాన్ని తగ్గించి పంపకానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఈ విషయాన్ని మాత్రం నయా–ఉదారవాద సిద్ధాంత వేత్తలు చెప్పరు. చైనా ఆర్థికంగా సమస్యల్లో ఉన్నది కనుక దాని అభివృద్ధి 7 శాతానికి తగ్గిపోయిందంటారు వారు. చైనా ఇబ్బందులెదుర్కొంటున్న మాట వాస్తవమే. అయితే అది ఇబ్బందులనుండి తప్పుకోడానికి జిడిపి పెరుగుదల రేటును నియంత్రించుకుని ప్రజల ఆదాయాలు పెంచే పనిలో పడిందన్న విషయాన్ని వీరు కావాలని దాస్తున్నారు. గత రెండున్నర దశాబ్దాలుగా చైనా సంపద పెంపుదలకు ప్రాధాన్యత ఇచ్చింది. దేశంలో పేదరికం పోగొట్టడానికి అది దోహద పడింది. దానికి కారణం, అమర్త్యసేన్ చెప్పినట్లు విప్లవ చైనాలో అమలయిన సోషలిస్టు ఆర్థిక విధానాలు. విప్లవానంతరం చైనాలో దున్నేవానికి భూమి పంపకం జరగడం. చైనాలో కీలక పరిశ్రమలు, వనరులు, ప్రాథమిక సదుపాయాలు ప్రభుత్వ రంగంలోనే ఉన్నాయి. అందువల్ల దేశంలో ఆర్థిక సమానత్వం ఉండింది. ఈ సమయంలో అంతర్జాతీయంగా వచ్చిన మార్పులకు అనుగుణంగా సంపద పెంపు నినాదాన్ని చైనా చేపట్టింది. పశ్చిమ దేశాల్లోని టెక్నాలజీ, పెట్టుబడులు ఉపయోగించుకుని ఆ దేశాలకే ఎగుమతులు చేసి లాభపడింది. 10 శాతం అభివృద్ధి వల్ల దేశంలో పేదరికం నిర్మూలించబడింది. ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. అదే సమయంలో ఆర్థిక అసమానతలు కూడా గణనీయంగా పెరిగాయి. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం తరువాత వచ్చిన మార్పులకనుగుణంగా చైనా సంపద పెంపకంపైన కన్నా పంపకం మీద కేంద్రీకరణ పెట్టింది. ఆర్థికాభివృద్ధిని 7 శాతానికి తగ్గించుకుంది. అయిదేళ్లలో ప్రజల ఆదాయాలు మూడు రెట్లు పెంచే విధానాలు చేపట్టింది. దాని వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరిగి అంతర్గత మార్కెట్ విస్తరించి దేశాభివృద్ధి స్థిరంగా సాగే అవకాశం ఏర్పడుతుంది. అయితే చైనాకు ఆర్థిక ఇబ్బందులు లేవని కాదు. ప్రపంచ ఆర్థిక ఒడిదుడుకులు దాన్నీ తాకుతున్నాయి. కానీ ప్రజల కొనుగోలు శక్తి పెంచేవిధంగా అది ఆర్థిక విధానాలు కొనసాగిస్తోంది.

మరి మన వెంకయ్యానాయుడు గారు చెబుతున్న సంపద పెంపు మన దేశంలో ఎవరికోసం? గత పదేళ్లలో దేశం 8 నుండి 10 శాతం అభివృద్ధి సాధించింది. ఈ కాలంలో దేశంలో డాలరు శతకోటీశ్వరుల (రూ. 6000 కోట్లకు పైన ధనవంతుల) సంఖ్య 2 తో ప్రారంభమై ఇప్పుడు 100 దాటింది. దేశంలో సగం సంపద కొద్దిమంది శతకోటీశ్వరుల వద్ద కేంద్రకృతమైంది. 80 శాతం పైగా ప్రజలు రోజుకు రూ. 20 ఆదాయంతో బతుకుతున్నారని ప్రభుత్వం నియమించిన సర్వే రిపోర్టులే చెబుతున్నాయి. ఇంకా సంపద పెంచమని వెంకయ్యగారు, ఆయన ప్రభుత్వం చెబుతోంది. ఎవరి కోసం? మరింత సంపద పెరిగితే మరింత మంది కోటీశ్వరులు శతకోటీశ్వర్లు కావడానికేగా?

పెరిగిన సంపద కొద్దిమంది దగ్గర పోగుపడి విస్తారమైన ప్రజల వద్ద కొనుగోలు శక్తి పెరగకపోవడం వల్ల దేశంలో ఉత్పత్తి అయిన సంపద కొనేవాడు లేక పరిశ్రమలు సంక్షోభంలో పడుతున్నాయి. దాని వల్ల నిరుద్యోగం పెరుగుతోంది. ఉత్పత్తిని విదేశాల్లో అమ్ముకుందామంటే అక్కడా అదే సంక్షోభం. అందువల్ల ఇప్పుడు వెంకయ్యగారు చెప్పినట్లు మనం సంపద పెంచుకోవాలన్నా కూడా ముందు ప్రజల ఆదాయాలు పెంచడం ముఖ్యం.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

ఈ మాసం ముఖ్యాంశం

# కార్పొరేట్లకు లాభం ప్రజలకు త్యాగం

# విజన్ 2029

**బివి రాఘవులు**



రచయిత సిపిఐ (ఎం)
పొలిట్‌బ్యూరో సభ్యులు

సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా మార్చేందుకు విజన్ 2029 పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను మరోసారి కలల ప్రపంచంలోకి మళ్ళించే ప్రయత్నం చేస్తున్నాడు. స్వర్ణాంధ్రప్రదేశ్ పాతమాటే. విజన్ 2029 పాతపాటే. '9' అంకె తప్ప. విదేశీ పెట్టుబడులకు, స్వదేశీ సంపన్ను లకు లాభాలు అర్జించి పెట్టడానికి ఉద్దేశించిన ప్రణాళికే విజన్ 2029. ఉన్నత స్థాయి ప్రమాణాలతో, ఆనందంతో ప్రజలు జీవించేటట్లుగా చేయడమే లక్ష్యం అని ప్రకటించి నప్పటికి ఈ పదాడంబరం అంతా విజన్ 2029 అసలు స్వభావాన్ని దాచిపెట్టుకునేందుకే.

విజన్ 2029 ప్రకారం రాష్ట్రాన్ని 2022 నాటికి దేశంలోని మూడు అగ్రస్థాయి రాష్ట్రాల్లో ఒకటిగా చెయ్యాలి. 2029 నాటికి దేశంలో అభివృద్ధి చెందిన మొదటి రాష్ట్రంగా మార్చాలి. 2050 నాటికి ప్రపంచ పెట్టుబడు లన్నింటికి రాష్ట్రమే గమ్యస్థానమయ్యేట్లుగా తీర్చిదిద్దాలి. ఈ లక్ష్యాలను సాధించడానికి కింది విధంగా అభివృద్ధిని సాధించాలని ప్రతిపాదించారు. (టేబుల్-1) చూడండి...

వచ్చే 15 సంవత్సరాలలో ఇటువంటి అభివృద్ధి సాధించాలంటే ఒక్క మౌలిక సదుపాయాల కల్పనకే 12.4 లక్షల కోట్ల పెట్టుబడులు కావాలని విజన్ పేర్కొంది. మిగిలిన ఇతర రంగాల అవసరాలన్నింటిని కలుపుకుంటే ఇంకా అనేక రెట్లు ఎక్కువ పెట్టుబడి అవసరం అవుతుంది. ఈ పెట్టుబడు లను కేవలం రాష్ట్ర బడ్జెట్టు ద్వారా కేంద్ర సహాయం ద్వారా సమకూర్చుకోవడం సాధ్యం కాదు. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ల నుండి, జాతీయ అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థల నుండి సేకరిం చాలి. లాభం కోసం నడిచే ఈ సంస్థలు దయాదాక్షిణ్యంతో రాష్ట్రానికి రావు. వాటికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాలి. ఖచ్చితమైన లాభాలను గ్యారంటీ చేయాలి. ఇవన్నీ జరుగుతాయని విశ్వాసం కల్గించే పత్రమే విజన్ 2029.

ఇప్పటికే విజన్‌లోని మార్గ నిర్దేశాలకను గుణంగా నిర్దిష్ట ప్రణాళికల రూపకల్పన ప్రారంభమయింది.

లక్ష్యసాధన కోసం 5 గ్రిడ్లు, 7 మిషన్లు 5 క్యాంపెయిన్స్ అన్న నినాదాలను రూపకల్పన జేశారు.

<u>గ్రిడ్లు:</u> నీరు, గ్యాస్, రోడ్లు, విద్యుత్, ఫైబర్-ఆప్టిక్ గ్రిడ్లను ఏర్పాటు చేస్తారు.

<u>మిషన్లు :</u> 1. మౌలిక సదుపాయాలు, (2) ప్రాథమిక రంగం (వ్యవసాయం), 3. సామాజిక సాధికారత, (4) పరిశ్రమలు (5) పట్టణాభివృద్ధి, (6) సేవారంగం, (7) విజ్ఞా నం, నైపుణ్యం అభివృద్ధి అని ఏడు మిషన్లను ఏర్పాటు చేశారు.

<u>ప్రచారాలు :</u> ప్రజలందరి భాగస్వామ్యం సాధించేందుకు అయిదు ప్రచారాలను ప్రభుత్వం ప్రారంభించింది (1) బడి పిలుస్తోంది. (2) పేద రికం పై విజయం, (3) పొలం పిలుస్తోంది, (4) నీరు - చెట్టు, (5) ఆరోగ్యం - పరిశుభ్రత.

జన్మభూమి, స్మార్ట్ వార్డు/గ్రామం కార్యక్రమాల ద్వారా ఈ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

ఈ ఏడు మిషన్లు సాధించాల్సిన విష యాలను వివరిస్తూ ఇప్పటికే పత్రాలు తయారయ్యాయి. అందుకు అవసరమైన నిర్వహణా సంస్థలు ఏర్పాటు అయ్యాయి.

గ్రిడ్ల ఏర్పాటు, మిషన్ల కార్యక్రమం అమలు, క్యాంపెయిన్స్ నిర్వహణకు అవసరమైన యాజమాన్య ఏర్పాట్లను ప్రభుత్వం చేసింది. ఇప్పటికే అనేక విధాన పత్రాలను ప్రకటించింది. మరికొన్ని త్వరలోనే రానున్నాయి. కొన్ని చట్టా లను జేసింది. ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్టం, కార్మిక చట్టాల సవరణలు ఇప్పటికే వచ్చా యి. ఇంకా అనేక చట్టాలు సిద్ధం అవుతున్నాయి.

ఎర్నెస్టు & యంగ్, మైక్రోసాఫ్ట్, టిస్, మెకెన్సి వంటి విదేశీ, స్వదేశీ సంస్థలను సలహాదార్లుగా నియమించారు. ఇంకా అనేక మందిని నియమించనున్నారు. మలేషియా ప్రభుత్వ సంస్థ అయిన పెమాండు (పెర్‌ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ డెలివరి యూనిట్)తో

**<u>టేబుల్-1</u>**

| సంవత్సరము | స్థూల ఉత్పత్తి రేటు | తలసరి ఆదాయం | స్థూల ఉత్పత్తిలో నిష్పత్తి వ్యవసాయం | పరిశ్రమలు | సేవలు | జనాభా |
|---|---|---|---|---|---|---|
| 2012-13 | 5.8 | 84,000 | 23.1% | 21.5% | 55.3 | 4.9 కోట్లు |
| 2022 | - | - | 15% | 30.0% | 55.0 | - |
| 2029 | 10.03 | 7,64,000 | 10% | 30.0% | 60.0 | 5.68కోట్లు |

(ఒక ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చెందినదిగా భావించాలంటే సగటు తలసరి ఆదాయం 12,746 డాలర్ల స్థాయికి చేరాలని ప్రతిపాదించబడింది.. అంటే డాలరుకు రూ. 60. అనుకుంటే 7,64,760 రూపాయలు తలసరి ఆదాయం కావాలి. అంటే ప్రస్తుత ఆదాయ స్థాయికి పదిరెట్లు పెరగాలి.)

ఒప్పందం చేసుకున్నది. దాని ఆధ్వర్యంలో ఇప్పటికే కొన్ని లాబ్‌లు నిర్వహించబడ్డాయి. యు.ఎస్.టి.డి.ఎ.తో స్మార్ట్ సిటీ కోసం ఒప్పందం చేసుకున్నది.

ప్రైవేటు పెట్టుబడును ఆకర్షించే మార్గాలను సూచించడం, వాటిని రప్పించేందుకు అత్యధిక భాగం సలహాదార్లు పని జేస్తారు.


విజన్ 2029 సాధనలో ప్రైవేటు రంగానికి పెద్దపీట వేయబడింది. ఆఖరుకు ప్రజాసేవల రంగాలలోనూ ప్రైవేటు మంత్రమే. ప్రభుత్వం బాధ్యత ప్రైవేటు పెట్టుబడికి సానుకూల వాతావరణం సృష్టించడమే.

కారుచౌకగా లేక ఉచితంగా ప్రైవేటు కంపెనీలకు కావలసినంత భూమినివ్వడానికి భూములను స్వాధీనం చేసుకుని, భూబ్యాంకును ఏర్పాటు చేస్తున్నది. ఇప్పటికి 4 లక్షల ఎకరాలు బ్యాంకులో ఉందని చెప్తున్నది. ప్రైవేటు పెట్టుబడులకు అవసరమైన మౌలిక సదుపాయాలైన నీరు, విద్యుత్, రోడ్లు, గ్యాస్, ఫైబర్ నెట్‌వర్క్‌లను నిరంతరాయంగా, రెడీమేడ్‌గా అందించేందుకుగాను వేలకోట్ల రూపాయల ప్రభుత్వ పెట్టుబడులతో ఏర్పాటు చేస్తున్నది. పెట్టుబడులను రాబట్టేందుకు ఆకర్షణీయమైన రాయితీలను, ప్రోత్సహకాలను ప్రకటిస్తున్నది. ఈజీయాఫ్ బిజినెస్‌లో ప్రథమస్థాయిలో ఉండేందుకు అనువైన విధానాలను, వ్యవస్థలను, పద్ధతులను రూపొందిస్తున్నది. పెట్టుబడికి స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించేందుకు చట్టాలకు సవరణలు జేస్తున్నారు. కొత్త చట్టాలను తెస్తున్నారు. పౌరహక్కులను, మానవ హక్కులను, ప్రజాస్వామిక హక్కులను కుదిస్తున్నారు. పర్యావరణ అనుమతులను నామమాత్రం చేశారు. కంపెనీలకు నష్టాలొస్తే ప్రభుత్వం భరించేందుకు కొత్త విధానాన్ని రూపొందిస్తున్నారు.

ప్రజల ఆనందం గురించి, సమానత్వం గురించి ఎన్ని మాటలు చెప్పినా 2029 అభివృద్ధి నమూనా విదేశీ స్వదేశీ పెట్టుబడికి ఉపయోగపడుతుంది. భూస్వాములకు లాభం చేస్తుంది. ఉన్నత మధ్యతరగతి లబ్ది పొందుతున్నందున ప్రధాన మీడియా విజన్ 2029 కొమ్ముకాస్తున్నది. స్థానిక మేధావి వర్గాన్ని పూర్తిగా ఉపేక్షిస్తున్నా కొంతమందికి పరిశోధకులుగా, సమాచార సేకరణ సహాయకులుగా అవకాశం వస్తున్నందున, సరళీకరణ విధానాల మోజులో ఉన్నందున తాత్కాలికంగానైనా విజన్ 2029 మాయలో పడే అవకాశం ఉన్నది.

విజన్ పేరుతో అనేక అంశాలు, రంగాల గురించి హడావిడి జరిగినా, అభివృద్ధి

❝ ప్రజలకుపయోగపడే అంశాలన్నీ ప్రచా రాంశాలకే పరిమితం అయ్యాయి. రైతులు భూ ములు కోల్పోతారు. గిరిజనులు నిర్వాసితులవు తారు. కార్మికులు హక్కులు కోల్పోతారు. బల హీన వర్గాల జీవన ప్రమాణాలు దెబ్బ తింటాయి. అభివృద్ధి జరిగినా అది ప్రజలకు అందు తుందనే గ్యారంటీ లేదు. అదనంగా వచ్చిన ఉత్పాదకతనంతా ఇప్పటివరకు పెట్టుబడే కొట్టే సింది. ట్రికిల్‌డౌన్ సిద్ధాంతం బూటకమని తేలింది.❞



'ఫోకస్' అంతా రాజధాని పైనే ఉన్నదని అనేక సందర్భాల్లో స్పష్టం చేయబడింది. జరిగిన మేరకు రాజధాని అమరావతి, దానిచుట్టూ అభివృద్ధి కేంద్రీకృతం అవుతుంది. కార్పొరేట్ల ఆసక్తి, వారికి వచ్చే రాయితీలు, ఇక్కడే కేంద్రీకృ తం అవుతాయి. అభివృద్ధి వికేంద్రీకరణ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి అనే మాటలన్ని కళ్ళుగప్పే వాగ్దానాలే!

ప్రజలకుపయోగపడే అంశాలన్నీ ప్రచారాంశాలకే పరిమితం అయ్యాయి. రైతులు భూములు కోల్పోతారు. గిరిజనులు నిర్వాసితులవుతారు. కార్మికులు హక్కులు కోల్పోతారు. బలహీన వర్గాల జీవన ప్రమాణాలు దెబ్బ తింటాయి. అభివృద్ధి జరిగినా అది ప్రజలకు అందుతుందనే గ్యారంటి లేదు. అదనంగా వచ్చిన ఉత్పాదకతనంతా ఇప్పటివరకు పెట్టుబడే కొట్టేసింది. ట్రికిల్‌డౌన్ సిద్ధాంతం బూటకమని తేలింది.

ప్రజలకు మేలు జరగకపోయినా సంపన్నులు కోరుకున్నట్లుగా వారికలలైనా నిజమవుతాయా అంటే సందేహమే! ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక పరిస్థితి మాంద్యంలో కొట్టుమిట్టాడుతుంటే ఎగుమతి ఆధారిత విజన్ 2029 సఫలం కావడానికి అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. ఒకవేళ ఏ ఆటంకం లేకపోయినా విద్యావంతమైన, ఆరోగ్యవంతమైన, శ్రమను గౌరవించే సమాజం లేకుండా యంత్రాలు, కంపూటర్లు, గ్రిడ్లు, మిషన్లు, క్యాంపెయిన్లు అభివృద్ధి సాధించలేవు. గతంలో విజన్ 2020 హడావిడి చూశాం. జన్మభూమి పరిశుభ్రత–పచ్చదనం, బడికి పదండి, ఇంకుడు గుంతలు, వంటి ప్రచారాలు చూశాం. అన్నిటి అనుభవం ఒకటే. మాటలు ఎక్కువ, చేతలు తక్కువ.

**ప్రాంతీయ అసమానతలు**

రాష్ట్రంలోని కొన్ని ముఖ్యమైన విషయాలను పరిష్కరించని అభివృద్ధి ప్రజల అభివృద్ధి అవదు. అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందవు.

**1. సగటు తలసరి ఆదాయం:**

2014–15 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సగటు తలసరి ఆదాయం రూ. 79,442. దీనికి ఎగువన విశాఖపట్టణం, కృష్ణ, ప.గోదావరి, నెల్లూరు, గుంటూరు, ప్రకాశం–6 జిల్లాలున్నాయి. దిగువన 7 జిల్లాలు – తూ.గోదావరి, చిత్తూరు అనంతరం, కడప, కర్నూలు, విజయనగరం, శ్రీకాకుళం – ఉన్నాయి. అంటే రాయలసీమ, ఉత్తరాంధ్రలు వెనుకబడి ఉన్నాయని విదితం అవుతున్నది. విశాఖ, కృష్ణా జిల్లాలో తలసరి సగటు ఆదాయం లక్షకు పైగా ఉంటుంటే శ్రీకాకుళంలో దానిలో సగం మాత్రమే ఉన్నది.

**టేబుల్–2**

**జిల్లా వారీ సగటు తలసరి ఆదాయం**

**(2014–15)**

| వ.నెం. | జిల్లా | తలసరి ఆదాయం (రూ॥లలో) |
|---|---|---|
| 1. | విశాఖపట్టణం | 105174 |
| 2. | కృష్ణ | 101003 |
| 3. | ప.గోదావరి | 86981 |
| 4. | నెల్లూరు | 84650 |
| 5. | గుంటూరు | 83692 |

❝ రాష్ట్రంలో అక్షరాస్యత 67.35 శాతం (2011). దేశ అక్షరాస్యత 74.04 శాతం కన్నా 6.69 శాతం తక్కువ. వివిధ రాష్ట్రాల అక్షరాస్యతలతో పోల్చి చూస్తే మనం 32వ స్థానంలో ఉన్నాం. తెలంగాణా మినహాయిస్తే మన చుట్టు ప్రక్కల రాష్ట్రాలన్ని పైస్థాయిలో ఉన్నాయి. ❞

| | | |
|---|---|---|
| 6. | ప్రకాశం | 80516 |
| | **ఆంధ్రప్రదేశ్** | **79448** |
| 7. | తూ.గోదావరి | 78826 |
| 8. | చిత్తూరు | 72797 |
| 9. | అనంతపురం | 67491 |
| 10. | కడప | 67283 |
| 11. | కర్నూలు | 66080 |
| 12. | విజయనగరం | 62194 |
| 13. | శ్రీకాకుళం | 54139 |

**2. జిల్లాల వారీ అక్షరాస్యతలో వ్యత్యాసాలు (2011 సెన్సెస్)**

2011 సెన్సెస్ ప్రకారం రాష్ట్రంలో అక్షరాస్యత 67.35 శాతం. 74.63 శాతంతో పశ్చిమగోదావరి అగ్రస్థానంలో ఉంటే 58.89 శాతంలో విజయనగరం జిల్లా అధమ స్థానంలో ఉంది. పశ్చిమగోదావరి, కృష్ణ, చిత్తూరు, తూ.గో, నెల్లూరు, గుంటూరు జిల్లాలు రాష్ట్ర సగటు కన్నా పైనే ఉన్నాయి. కడప, విశాఖ, అనంతపురం, ప్రకాశం, శ్రీకాకుళం, కర్నూలు, విజయనగరం జిల్లాలు రాష్ట్ర సగటు కన్నా దిగువన ఉన్నాయి. అక్షరాస్యతలో వెనుకబడిన జిల్లాలు ప్రధానంగా ఉత్తరాంధ్ర, రాయలసీమలలో ఉన్నాయి.

**టేబుల్-3**

| వ.నెం. | జిల్లా | అక్షరాస్యత (శాతం) |
|---|---|---|
| 1. | ప.గోదావరి | 74.63 |
| 2. | కృష్ణ | 73.74 |
| 3. | చిత్తూరు | 71.53 |
| 4. | తూ.గోదావరి | 70.99 |
| 5. | నెల్లూరు | 68.90 |
| 6. | గుంటూరు | 67.40 |
| | **ఆంధ్రప్రదేశ్** | **67.35** |
| 7. | కడప | 67.30 |
| 8. | విశాఖపట్నం | 66.91 |
| 9. | అనంతపురం | 63.57 |
| 10. | ప్రకాశం | 63.08 |
| 11. | శ్రీకాకుళం | 61.74 |
| 12. | కర్నూలు | 59.97 |
| 13. | విజయనగరం | 58.89 |

**3. జిల్లా వారీ శిశుమరణాల సంఖ్య:**

2001 వివరాల ప్రకారం రాష్ట్రంలో శిశుమరణాల సంఖ్య 43. (ప్రతి వెయ్యి జననాలకు). కృష్ణ, గుంటూరు, తూ.గో, ప.గో, నెల్లూరు, కడప, చిత్తూరు, ప్రకాశం జిల్లాలలో శిశు మరణాల సంఖ్య రాష్ట్ర సగటుకన్నా తక్కువగా ఉండగా కర్నూలు, విశాఖ, శ్రీకాకుళం, అనంతపురం, విజయనగరం, జిల్లాలో రాష్ట్ర సగటు కన్నా ఎక్కువగా ఉన్నది. ఈ జిల్లాలన్ని ఉత్తరాంధ్ర, రాయలసీమల్లోనే ఉన్నాయి.

**టేబుల్-4**

**శిశు మరణాలు ప్రతి వెయ్యి జననాలకు (2001)**

| వ.నెం. | జిల్లా | సంఖ్య |
|---|---|---|
| 1. | గుంటూరు | 27 |
| 2. | కృష్ణ | 28 |
| 3. | తూ.గోదావరి | 37 |
| 4. | ప.గోదావరి | 38 |
| 5. | నెల్లూరు | 39 |
| 6. | కడప | 39 |
| 7. | చిత్తూరు | 40 |
| 8. | ప్రకాశం | 40 |
| | **ఆంధ్రప్రదేశ్** | **43** |
| 9. | కర్నూలు | 47 |
| 10. | విశాఖ | 50 |
| 11. | శ్రీకాకుళం | 53 |
| 12. | అనంతపురం | 54 |
| 13. | విజయనగరం | 68 |

**4. జిల్లా వారీ మాగాణి వివరాలు:**

2008-09 సంవత్సరం వివరాల ప్రకారం మొత్తం సాగు భూమిలో మాగాణి నిష్పత్తి జిల్లా వారీగా క్రింది విధంగా ఉంది.

**టేబుల్-5**

| వ.నెం. | జిల్లా | సాగుభూమిలో మాగాణి శాతం |
|---|---|---|
| 1. | అనంతపురం | 12.46 |
| 2. | కర్నూలు | 16.86 |
| 3. | ప్రకాశం | 29.20 |
| 4. | విశాఖపట్నం | 30.32 |
| 5. | కడప | 33.99 |
| 6. | చిత్తూరు | 42.47 |
| 7. | గుంటూరు | 56.60 |
| 8. | తూ.గోదావరి | 57.89 |
| 9. | శ్రీకాకుళం | 63.59 |
| 10. | కృష్ణ | 68.15 |
| 11. | నెల్లూరు | 80.33 |
| 12. | ప.గోదావరి | 86.03 |

రాయలసీమ జిల్లాలలో నీటి పారుదల సౌకర్యాలు కల్గిన భూమి అతి తక్కువగా ఉన్నది. ఉన్న సౌకర్యం కూడా ప్రధానంగా గొట్టపు బావుల మీద ఆధారపడి ఉన్నది. అందువలన ఈ మాగాణి సేద్యం కూడా ఖర్చుతో కూడుకుని, అనిశ్చితంగా ఉంటున్నది. ఉత్తరాంధ్రలో (ముఖ్యంగా శ్రీకాకుళంలో) ఈ మధ్య నీటి పారుదల సౌకర్యాలు కొంతమెరుగైనా ఈ జిల్లాలో మాగాణి పంటల ఉత్పాదకత చాలా తక్కువగా ఉంటున్నది.

**అక్షరాస్యతలో రాష్ట్రం వెనుకబాటు**

రాష్ట్రంలో అక్షరాస్యత 67.35 శాతం (2011). దేశ అక్షరాస్యత 74.04 శాతం కన్నా 6.69 శాతం తక్కువ. వివిధ రాష్ట్రాల అక్షరాస్యతలతో పోల్చి చూస్తే మనం 32వ స్థానంలో ఉన్నాం. తెలంగాణా మినహాయిస్తే మన చుట్టు ప్రక్కల రాష్ట్రాలన్ని పై స్థాయిలో ఉన్నాయి. ఒడిస్సా - 73.45 శాతం, ఛత్తీస్ ఘడ్-71.0 శాతం, తమిళనాడు- 80.33 శాతం, కర్నాటక-75.60 శాతంతో మన కన్నా ఎక్కువ అక్షరాస్యత సాధించాయి. కేరళ 93.91శాతం, మహారాష్ట్ర - 80.33 శాతంలతో అగ్రభాగాన ఉన్నాయి. త్రిపుర ఇప్పుడు ఆ రాష్ట్రాల సరసన చేరింది. పశ్చిమ బెంగాల్ 77.08 శాతంతో మనకన్నా పైన ఉన్నది.

ఇతర దేశాలను అనుకరించడం మన పాలకులకు బాగా ఆనవాయితి అయినందున కొన్ని దేశాల వివరాలను పరిశీలిస్తే మనం ఎంత వెనుకబడి ఉన్నామో తెలుస్తుంది. సింగపూర్ - 96.8 శాతం, చైనా - 96.41శాతం, దక్షిణ కొరియా 100 శాతం, ఇండోనేషియా - 93.9 శాతం, థాయిలాండ్-

96.7 శాతం, తైవాన్–98.5 శాతం, మలేషియా – 94.6 శాతం అక్షరాస్యతను సాధించాయి. ఈ వివరాలను పరిశీలిస్తే ఈ దేశాల అభివృద్ధిలో సార్వత్రిక విద్య యొక్క ప్రాముఖ్యత స్పష్టంగా అర్థం అవుతుంది.

ఉమ్మడి రాష్ట్రం నుండి పాలకులు అక్షరాస్యత, విద్య, ప్రాధాన్యతలను గుర్తించడం లేదు. ఈ రంగాలను తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. మొత్తం ప్రభుత్వ ఖర్చులో విద్యారంగం వాటా క్రమేణా తగ్గి పోతూ వస్తున్నది. 1975–76లో, 23 శాతంగా ఉన్న వాటా 80వ దశకంలో 19.8 శాతానికి, 2006–07 నాటికి – 15.7 శాతానికి పడిపోయింది. కొఠారి కమిషన్ సిఫార్సు ప్రకారం విద్యకు స్థూల ఉత్పత్తిలో 6 శాతం కేటాయించాలి. కాని రాష్ట్రంలో 80వ దశకంలో – 3.4 శాతం, 90వ దశకంలో 2.5 శాతం మాత్రమే కేటాయించారు.

పాలకులు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో పాటు ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించారు. విద్యను ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు వ్యాపార సరుకుగా మార్చివేశారు. 2005వ సంవత్సరంలో ప్రాథమిక, మాధ్యమిక విద్యా సంస్థల్లో 15 శాతం ప్రైవేటు రంగానివి. మొత్తం విద్యార్థుల్లో 30 శాతం ఈ సంస్థల్లో ఉన్నారు. ఆ తర్వాత కాలంలో ప్రైవేటు రంగం విశృంఖలంగా పెరిగింది. ఇంటర్మీడియట్, ఉన్నత విద్యలో అత్యధిక భాగాన్ని ఇప్పటికే ప్రైవేటు రంగం ఆక్రమించింది.

విద్యా రంగంలో లింగ వ్యత్యాసం, సామాజిక వ్యత్యాసం, ప్రాంతీయ వ్యతాసం, నాణ్యతా వ్యత్యాసాలు తీవ్రంగా కొనసాగుతున్నాయి. పురుషుల అక్షరాస్యత కన్నా స్త్రీల అక్షరాస్యత బాగా వెనుకబడి ఉంది. పురుషుల అక్షరాస్యత 75.5 శాతం ఉంటే స్త్రీల అక్షరాస్యత 59.7 శాతం మాత్రమే ఉంది. సాధారణ అక్షరాస్యత 67.35 ఉంటే దళితుల అక్షరాస్యత 64.47 శాతం, గిరిజనుల అక్షరాస్యత 48.83 శాతం మాత్రమే ఉంది. ఈ తరగతుల అక్షరాస్యతలు వెనుకబడిన జిల్లాలలో మండలాలలో మరింత అధ్వాన్నంగా ఉంది. రాష్ట్రంలో డ్రాపవుట్ శాతం ఎక్కువగా ఉన్నది. బలహీన వర్గాలలో ఇంకా ఎక్కువగా ఉన్నది.

బడి పిలుస్తోంది వగైరా నినాదాలు, ఆర్భాటం తప్ప ఫలితం సాధించేందుకు పాలకులు చిత్తశుద్ధితో చేసింది తక్కువ అనేది ఈ వివరాలు స్పష్టం జేస్తున్నాయి.

విద్య అనేది విజ్ఞానమే కాదు. అది ఒక ఆస్థి (అసెట్) బహుముఖ ప్రయోజనాలను ఇస్తుంది. రాష్ట్రాన్ని వేధిస్తున్న అనేక సమస్యల పరిష్కారానికి విద్యాభివృది మార్గం సుగమం చేస్తుంది. బలహీన వర్గాల అభివృద్ధికి, సామాజిక అణచివేతను ప్రశ్నించేందుకు, శ్రామికుల ఉత్పాదక మెరుగుపడేందుకు, పంటల ఉత్పాదకత పెరిగేందుకు – ఇంకా అనేక విధాల ఉపయోగపడుతుంది. అభివృద్ధి చెందిన అన్ని దేశాలు విద్యారంగానికి ప్రాధాన్యతనివ్వడం అభివృద్ధి మార్గంలో తొలిమెట్టుగా భావించాయి.

“పాలకులు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో పాటు ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించారు. విద్యను ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు వ్యాపార సరుకుగా మార్చివేశారు. 2005వ సంవత్సరంలో ప్రాథమిక, మాధ్యమిక విద్యా సంస్థల్లో 15 శాతం ప్రైవేటు రంగానివి. మొత్తం విద్యార్థుల్లో 30 శాతం ఈ సంస్థల్లో ఉన్నారు. ఆ తర్వాత కాలంలో ప్రైవేటు రంగం విశృంఖలంగా పెరిగింది.”



కార్పొరేట్లు కబ్జా చేసిన చిత్తూరు ప్రభుత్వాసుపత్రి

గిరిజనుల్లో అక్షరాస్యత కేవలం 48.33 శాతం, అందులో స్త్రీలు 39.4 శాతంతో మరింత వెనుకబడి ఉన్నారు. దళితుల అక్షరాస్యత 64.47 శాతంగా ఉంది. కర్నూలు, జిల్లాలో ఈ తరగతి అక్షరాస్యత కేవలం 55.26 శాతం మాత్రమే. రాష్ట్రంలో సాధారణ డ్రాప్అవుట్ 33.44 శాతం ఉంటే దళితుల డ్రాప్ అవుట్ 39.44 శాతంగా ఉంది.

### ఆరోగ్యంలో వెనుకబాటు

ఆరోగ్యరంగ విషయంలో రాష్ట్రం వెనుకబడి ఉంది. ప్రజలందరి ఆరోగ్యం బాగుంటే ఆర్థికాభివృద్ధికి, శ్రామికుల ఉత్పాదకతకు తోడ్పడుతుందన్న స్పృహ పాలకులలో తక్కువగా ఉంది. ఇతర రాష్ట్రాలలో పోల్చితే రాష్ట్రంలో శిశుమరణాల రేటు ఎక్కువగా ఉంది.

ప్రతి 30,000ల జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి.హెచ్.సి) ఉండాల్సి ఉంటే రాష్ట్రంలో ఇందుకనుగుణంగా ఏర్పాటు చేయలేదు.

ఆరోగ్య రంగానికి బడ్జెట్టు కేటాయింపు కూడా సక్రమంగా లేదు. 2004లో తలసరి సగటు ప్రభుత్వ ఖర్చు రూ. 188 మాత్రమే. ప్రతి కుటుంబ సగటు తలసరి ఖర్చు రూ. 518 ఉంది. బడ్జెటులో ఆరోగ్య రంగంపై పెట్టే ఖర్చు 5 శాతం దాటడం లేదు. 2006– 2007లో ఇందులో 45 శాతంగా మాత్రమే ఉంది. ఆ తర్వాత ఇది మరింత దిగజారింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 7వ పంచ ప్రణాళికా కాలంలో 1.29 శాతం, 8వ ప్రణాళికా కాలంలో 0.96 శాతం, 2005–06లో 0.76 శాతం ప్రభుత్వాలు ఆరోగ్యానికి ఖర్చు చేశా యి. ఆ తర్వాత ఇది మరింత తగ్గి పోయింది.

ఒక వైపు ప్రభుత్వ వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ మరో వైపు ప్రైవేటు రంగాన్ని ప్రభుత్వాలు బాగా ప్రోత్సహించాయి. 1994 నాటికి రాష్ట్రంలోని ఆసుపత్రి పడకలలో 30

**“ ప్రభుత్వ భూ బ్యాంకంతా పేదల భూములను స్వాధీనం జేసుకోవడంతో పెరుగుతున్నది. కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధ సౌకర్యాలు నిరాకరించబడుతున్నాయి. కాంట్రాక్టీకరణ వ్యాపిస్తున్నది. నిజ వేతనాలు పడిపోతున్నాయి. పెట్టుబడికి స్నేహపూర్వక వాతావరణం కల్పించడం పేరుతో పౌరహక్కులు, మానవ హక్కులు కుదించబడుతున్నాయి. ”**

శాతం ప్రైవేటు రంగంలో ఉన్నాయి. ఇప్పుడు సుమారుగా 60 శాతానికి ప్రైవేటు రంగ భాగం చేరింది. రాష్ట్రంలో వైద్యం కూడా ఒక లాభసాటి వ్యాపారంగా మారింది. పేద, సామాన్య కుటుంబాల ఖర్చులో పెద్దవాటా ఆరోగ్యానికి ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. అనా రోగ్యం సామాన్యులకు పెద్దశాపంగా మారింది.

2011 వివరాల ప్రకారం అఖిల భారతస్థాయిలో శిశు మరణాల రేటు 44 ఉంది. రాష్ట్రం కూడా 43తో దాదాపు అదే స్థాయిలో ఉన్నది. మన సమీప రాష్ట్రాలలో ఒడిస్సా మినహా అన్ని రాష్ట్రాలు మనకన్నా మెరుగైన స్థాయిని సాధించారు. తమిళనాడు 22, మహారాష్ట్ర 25, కేరళ, 12, కర్నాటక–35తో మనకన్నా మెరుగిన స్థాయిలో ఉన్నాయి.

**మౌలిక సదుపాయాలలో వ్యత్యాసం**

రాష్ట్రలో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు మిగిలిన ప్రాంతానికి మౌలిక సదుపాయాల కల్పనలో వ్యత్యాసం ఉంది. జిల్లాల వారీ కూడా వ్యత్యాసాలు గణనీయంగా ఉన్నాయి. జిల్లాలో మాగాణి ప్రాంతం కరవు ప్రాంతాలకు వ్యత్యాసం ఉంది. ముఖ్యంగా కొండలపై కలసి కట్టుగా ఉన్న షెడ్యూల్డు ఏరియా గిరిజన ప్రాంతం అన్ని రకాలుగా వెనుకబడి ఉంది. ఆయా ప్రాంతాల, జిల్లాల ప్రత్యేకతలను దృష్టిలో పెట్టుకుని మౌలిక సదుపాయాల కల్పనలో సమానత్వం సాధించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయి.

**ఉత్పత్తి సామాజిక సంబంధాలలో వెనుకబాటు:**

పాలకులు అభివృద్ధిని కేవలం సాంకేతిక ప్రక్రియగానే చూస్తున్నారు. అభివృద్ధిని ఆటంక పరుస్తున్న ఉత్పత్తి సంబంధాలను, సామాజిక కట్టుబాట్లను చూడటం లేదు. చూడలేదనం కన్నా, ఆధిపత్య కులాలకు, సంపన్న తరగతులకు ఉపయోగపడుతున్నందున అభివృద్ధి నిరోధక సంబంధాలను కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ భూ కేంద్రీకరణ తీవ్రంగా ఉంది. వ్యవసాయ కార్మికుల సంఖ్య వేగంగా పెరుగుతూనే ఉంది. వ్యవసాయం చెయ్యని భూకామందుల సంఖ్య పెరుగుతున్నది. ఎటువంటి హక్కులు లేని కౌలుదార్ల సంఖ్య పెరుగుతున్నది. కౌలుదార్లు తీవ్ర దోపిడీకి గురవుతున్నారు. ఈ పరిణామం ఉత్పాదకతకు, భూ సార పరిరక్షణకు నష్టకరంగా పరిణమిస్తున్నది. పరపతి రంగంలో ప్రైవేటు శక్తుల ప్రమేయం వేగంగా పెరిగింది. వడ్డీ వ్యాపారుల పీడనకు రైతాంగం బలి అవుతున్నది. గ్రామసీమల్లో కుల వివక్ష అంటరాని తనం ఇప్పటికీ బలంగా ఉంది. శ్రమ గౌరవాన్ని ఇవ్వని సామాజిక వ్యవస్థ అభివృద్ధిని ప్రోత్సహించలేదు. మాగాణి ప్రాంతం పెరిగేకొలది పని నుండి స్త్రీలను ఉపసంహరించడం ఎక్కువ అవుతున్నది. భ్రూణ హత్యలు పెరుగుతున్నాయి. వరకట్నం వ్యాపిస్తున్నది. ఈ అంశాలన్ని స్త్రీలు అభివృద్ధిలో నిర్వహించగల్గిన పాత్రను కుదిస్తున్నాయి. పై అంశాలకు విజన్ 2029లో ప్రాధాన్యత లేదు. ఎక్కడన్నా ప్రస్తావించినా నిర్దిష్టమైన ప్రణాళికలు, ఆర్థిక వనరుల కేటాయింపుల గురించి చర్చలేదు.

భూ సంస్కరణల అమలు అటుంచి భూమిని గుంజుకోవడం ఎక్కువయింది. ప్రభుత్వ భూ బ్యాంకంతా పేదల భూములను స్వాధీనం జేసుకోవడంతో పెరుగుతున్నది. కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధ సౌకర్యాలు నిరాకరించబడుతున్నాయి. కాంట్రాక్టీకరణ వ్యాపిస్తున్నది. నిజ వేతనాలు పడిపోతున్నాయి. పెట్టుబడికి స్నేహపూర్వక వాతావరణం కల్పించడం పేరుతో పౌరహక్కులు, మానవ హక్కులు కుదించబడుతున్నాయి.

ప్రజల కొనుగోలు శక్తి పెరగకుండా ఆర్థికాభివృద్ధి ముందుకు పోదు. సామాన్య ప్రజలకు చదువు, ఉపాధి, భూమి ముఖ్యమైన ఎసెట్స్ అవుతాయి. ఈ మూడింటిని రాష్ట్రంలో పాలకులు ఇవ్వటం లేదు. ఇవి ఇవ్వకుండా అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధి అవదు. సంపన్నుల, కార్పొరేట్ల అభివృద్ధి అవుతుంది. దీర్ఘకాలంలో అటువంటి అభివృద్ధి కూడా సాధ్యంకాదు.

స్థూల ఉత్పత్తి పెరుగుదలను, పారిశ్రామికీకరణను అభివృద్ధికి మారుపేరుగా పాలకులు చూపిస్తున్నారు. ఉపాధి రహిత పారిశ్రామికీకరణ రాష్ట్ర వనరులను పెట్టుబడిదార్లకు సమర్పిస్తుంది తప్ప ప్రజలకు ఉపయోగం లేదు. ఉపాధిని సృష్టించే పారిశ్రామికీకరణ జరిగితేనే ప్రయోజనం జరుగుతుంది. వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేటీకరణ, యాంత్రీకరణ చేయాలని పాలకులు భావిస్తున్నారు. వ్యవసాయంలో పని దొరకకుండా పోయే అదనపు శ్రామికులను పట్టణ, పారిశ్రామిక రంగాలు ఇముడ్చుకోకపోతే వచ్చే అనర్థాలను పాలకులు పట్టించుకోవడం లేదు.

ఆర్థికాభివృద్ధి కోసం ప్రజలు సహకరించాలని, అందరి అభివృద్ధి కోసం, కొందరు త్యాగాలు చేయాలని భూములు కోల్పోయే రైతులకు, ఉపాధి కోల్పోయే కూలీలకు, వృత్తిదార్లకు, నిర్వాసితులయ్యే గిరిజనులకు, హక్కులను కోల్పోయే కార్మికులకు పాలకులు ఉద్బోధిస్తున్నారు. తమకు వాటా దక్కని, లాభం చెయ్యని అభివృద్ధికి, విదేశీ, స్వదేశీ పెట్టుబడిదార్లకు, వారి అడుగులకు మడుగులొత్తే పాలక పార్టీ నాయకులకు మాత్రమే లబ్ది చేకూర్చే అభివృద్ధికి ఎందుకు సంతోషపడాలి? ఎందుకు త్యాగం చెయ్యాలి? ఎందుక సహకరించాలి?

పాలకులు తమ పత్రాలలో ఉపన్యాసాలలో సమానత్వంతో కూడిన, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే (ఈక్విటబుల్, సస్టెయినబుల్ డెవలప్‌మెంట్) అభివృద్ధి అని తియ్యటి కబుర్లు ఎన్ని చెప్పినా ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ‘విజన్ 2029’ అన్ని రకాల అసమానతలను పెంచే కార్పొరేట్ విజన్. ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో కార్పొరేట్ సంస్థల స్వర్గధామంగా మార్చడానికుద్దేశించింది. పరిపాలనంతా కేంద్రీకరణ అవుతుంది. అంతిమంగా ముఖ్యమంత్రి సలహా దార్లదే పెత్తనమవుతుంది. ప్రజా ప్రతినిధులు, సంస్థల పాలక వర్గాలు, ముఖ్యంగా స్థానిక సంస్థలు నామమాత్రమవు తాయి. కాంట్రాక్టులు, కబ్జాలు, భాగస్వామ్యాలు, ముడుపులకు ముందుండే ప్రజా ప్రతినిధులకు ప్రజాసేవ లేకపోయినా ధనార్జన బాగానే ఉంటుంది కాబట్టి పరిపాల నలో భాగం లేకపోవడాన్ని పెద్దగా పట్టించుకోరు.

❋

# ఆధునిక ప్రజాస్వామ్యం మతతత్వం



రచయిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యులు

**ఎంవిఎస్ శర్మ**

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) – ఇది ఈ రోజు కేంద్రంలో నడుస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని రిమోట్ కంట్రోల్ ద్వారా నడిపిస్తున్న సంస్థ. ప్రభుత్వ నిర్వహణ విషయంలో మాత్రమే కాక, అన్ని రంగాల్లోనూ తన విధానాన్ని, తన సిద్ధాంతాన్ని జొప్పిస్తూ క్యాన్సర్ వ్యాధి మాదిరిగా విస్తరిస్తున్నది ఆరెస్సెస్. ఇప్పటికీ కొంతమంది ఆరెస్సెస్‌ను ఒక సేవా సంస్థగా, రాజకీయాలకు సంబంధంలేని సంస్థగా పరిగణించేవారున్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి, చేద్దాం, చేస్తున్నాం అనేవారు ఈ మధ్య పెరిగారు. రాజకీయ పార్టీకి అనుబంధంగా లేకుండా స్వతంత్రంగా వ్యవహరించాలని అనుకోవడం వేరు. అసలు రాజకీయాలకే అతీతంగా ఉండాలనుకోవడం వేరు. మొదటిది సాధ్యమే కాని రెండోది అసాధ్యం. ఎందుకంటే మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నాం. ప్రజాస్వామ్యం అంటేనే ప్రజలు తమకు నచ్చిన పార్టీని ఎన్నుకోవడం, మెజారిటీ సాధించిన పార్టీ అధికారంలోకి రావడం, అందుచేత నేను రాజకీయాలకు అతీతంగా ఉంటాను అనేవాళ్ళు అమాయకులు.

ఈ రోజు దేశ ప్రధాని, చాలామంది బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు తమకు ఆరెస్సెస్‌తో ఉన్న అనుబంధాన్ని బహిరంగంగానే ఒప్పుకుంటున్నారు. ఆరెస్సెస్ అగ్రనేతలు బిజెపి నాయకులుగా వ్యవహరిస్తున్నారు. బిజెపి ప్రభుత్వ పనితీరును ఆరెస్సెస్ సమీక్షించడమే కాక, మార్గనిర్దేశం కూడా చేస్తోంది. ఈ జోక్యం రోజువారీ ప్రభుత్వ నిర్వహణకు మాత్రమే పరిమితం అవ్వడం లేదు. రాజ్యాంగాన్ని పునర్నిర్వచించడం దాకా పోయింది. విద్యారంగాన్ని, పరిశోధనా రంగాన్ని, చరిత్రను, సాంస్కృతిక రంగాన్ని శాసించే ప్రయత్నం జరుగుతోంది. ప్రజల వ్యక్తిగత అంశాలైన మత విశ్వాసాలను, ఆహారపు అలవాట్లను, వేషధారణను, పండుగలను, కళారూపాలను సైతం శాసించాలనే ప్రయత్నం సాగుతోంది. ఈ ప్రయత్నాలను ప్రశ్నించే వారినందరినీ దేశద్రోహులుగా చిత్రీకరించే దుస్సాహసానికి ఆరెస్సెస్ పూనుకుంటున్నది. భిన్నాభిప్రాయాలు ఉండటం సహజం. అది ప్రజాస్వామ్యంలో ప్రజలకున్న హక్కు. తమ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా ప్రకటించుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది. కానీ ఆరెస్సెస్–బిజెపి కూటమి బహిరంగంగానే ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాస్తున్నది. కేంద్రం ఆధీనంలో నడిచే ఉన్నత విద్యాసంస్థల్లో మొన్న మద్రాసు ఐఐటి, నిన్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ, నేడు ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ – బిజెపి, ఆరెస్సెస్ ప్రత్యక్ష జోక్యం, అధికార దుర్వినియోగం మన ముందున్న ప్రత్యక్ష దృష్టాంతాలు. "ఎక్కడో ఏదో జరిగిందిలే, మనకెందుకు పోనిద్దూ" అనే నిర్లిప్త ధోరణికి ఇక ఎంత మాత్రమూ ఆస్కారం లేదు. ప్రజాస్వామ్యం ఉండాలని కోరుకునే ప్రతి ఒక్కరూ స్పందించాల్సిన సమయం ఇది. ఈ దేశం సమైక్యంగా ముందుకు సాగాలని వాంఛించే ప్రతి దేశభక్తుడూ మౌనం వీడి గొంతు కలపాల్సిన పరిస్థితి నేడు ఉంది.

ఈ 'దేశభక్తి', 'ప్రజాస్వామ్యం' అన్న పదాలను ఆరెస్సెస్ అపభ్రంశం పట్టించింది. దేశాన్ని ప్రేమించడం, దేశంకోసం త్యాగం చేయడానికి సంసిద్ధంగా ఉండడం, దేశాభివృద్ధిని కాంక్షించడం, దేశ సమైక్యతకు, దేశ రక్షణకు నిలబడడం సాధారణంగా ప్రజలందరూ దేశభక్తిని అర్థం చేసుకున్న తీరు ఇది. కానీ, ఆరెస్సెస్ తీరు వేరు. తాను చెప్పే 'హిందూత్వ' భావాన్ని అంగీకరించి, ఆచరించడమే దేశభక్తి అని ఆరెస్సెస్ ప్రకటిస్తోంది. భిన్న మత విశ్వాసాలు పాటించేవారున్న దేశం మనది. వ్యక్తికి తన మతం, పరాయి మతం అన్న తేడా ఉండొచ్చు. ఎందుకంటే అది తన వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించిన విషయం. కాని ఒక దేశానికి ఒక మతం, పరాయి మతం అని ఉండదు. ఉండకూడదు. ఎందుకంటే దేశ పౌరులందరికీ రాజ్యాంగం మత స్వేచ్ఛ ప్రసాదించింది. అటువంటప్పుడు మత విశ్వాసాల ప్రాతిపదికన దేశభక్తిని ఎలా శాసిస్తారు? మతానికి దేశాల ఎల్లలు లేవు. స్వామి వివేకానంద ఇదే విషయం చెప్పారు. కానీ భారతదేశంలో ఉండాలంటే 'హిందూత్వ' విధానాన్ని అంగీకరించాలి లేదా దాని ఆధిపత్యాన్ని అంగీకరించి దానికి లోబడి ఉండాలి అని ఆరెస్సెస్ ముఠా వాదిస్తున్నది. అదే దేశభక్తి అంటున్నది. భిన్న మతాల ప్రజల మధ్య తరతరాలుగా నెలకొని ఉన్న సామరస్యానికి విఘాతం కలిగిస్తోంది. విద్వేషాలు రగుల్కొలుపుతోంది. వేర్వేరు మతాలను అనుసరించే వారు, అసలు మత విశ్వాసాలనే ఆమోదించనివారు తమ సొంత దేశంలోనే పరాయివారైపోతున్నారు. వారి దేశభక్తిని ఆరెస్సెస్ సవాలు చేస్తోంది. తమను విమర్శించే వారందరిపైనా కుహనా లౌకికవాదులు అనే ముద్రవేసి తప్పించుకోజూస్తున్నది ఆరెస్సెస్. లౌకికవాదం అసలు మన దేశ సంప్రదాయమే కాదని, అది విదేశీ భావన అని, మన దేశ వారసత్వం హిందూ మత రాజ్యమేనని చరిత్రను మసిబూసి మారేడుకాయ చేస్తోంది. క్రీస్తుపూర్వం 6వ శతాబ్దం నుంచి మన దేశంలో వైదిక మతంతో బాటు బౌద్ధ, జైన మతాలు విలసిల్లాయి. ఈ దేశానికి వచ్చి స్థిరపడి పాలన సైతం చేపట్టిన మొగలాయిలు కూడా ఈ భిన్నత్వాన్ని గౌరవించారు. 12వ శతాబ్దం నుంచి సిక్కు మతం వచ్చింది. 1500 సంవత్సరాల క్రితమే క్రైస్తవం, 1300 సంవత్సరాల క్రితమే ఇస్లాం మతాలు వచ్చాయి. ఇక్కడి బౌద్ధం ఇతర దేశాలకు వ్యాపించినట్టే ఈ మతాలు ఇక్కడికి వచ్చాయి. వైదిక మతం సైతం ఒక మతంగా, ఒక దేవుడు, ఒక ఆరాధనా విధానం అన్నట్టుగా లేదు. శతకోటి దేవతలు, ఆరాధనా విధానాలు

> **“మతతత్వం దేశ వ్యతిరేకమే కాదు, అది హిందు మతతత్వమైతే హిందూ మత వ్యతిరేకం, ముస్లిం మతతత్వమైతే ముస్లిం మత వ్యతిరేకం” అని కూడా ఆయన ప్రకటించారు. “ఈ దేశంలో ఇతర మైనారిటీలు ఉన్నాయన్న విషయాన్ని మరచిపోకూడదు.”**

ఇందులో ఉన్నాయి. అటువంటప్పుడు రాజ్యాన్ని ఎవరు పాలించినా వారు ఇన్ని వందల, వేల సంవత్సరాలుగా అనుసరించిన విధానం ఒక్కటే. అదే రాజ్యపాలన, నిర్వహణ నుంచి మతాన్ని ఎడంగా ఉంచడం. ప్రజల మత స్వేచ్ఛను గౌరవించడం. ఇదే మన చారిత్రక వారసత్వం. మన నిజమైన భారతీయత. కానీ ఆరెస్సెస్ దీనినే కుహనా లౌకికవాదం అంటూ నిందిస్తోంది.

“ఇతర ప్రజలనూ, వారి సాంస్కృతిక సాఫల్యాలనూ తమలో అంతర్భాగంగా ఇముడ్చుకోగలగటం, వాటిని సమన్వయ పరచుకోగలగడం, ఒక విభిన్నమైన సమ్మిళిత సంస్కృతిని అభివృద్ధి చేసుకోగలగటం భారతీయుల పూర్వీకులు సాధించిన మహోన్నత కృత్యాలు” అని నెహ్రూ వ్యాఖ్యానించారు. “రెవెన్యూ, పారిశుధ్యం, పోలీసు, న్యాయం లేదా ప్రజా ప్రయోజనాల వినియోగం విషయాలలో హిందూ, ముస్లింల నడుమ ఏం వైరుధ్యం ఉంటుంది? తేడా అంతా మతావలంబనలో, ఆచారాలలో ఉంటుంది. వాటితో లౌకిక రాజ్యానికి సంబంధమే లేదు” అని కూడా గాంధీజీ ప్రకటించారు. “మతతత్వం దేశ వ్యతిరేకమే కాదు, అది హిందు మతతత్వమైతే హిందూ మత వ్యతిరేకం, ముస్లిం మతతత్వమైతే ముస్లిం మత వ్యతిరేకం” అని కూడా ఆయన ప్రకటించారు. “ఈ దేశంలో ఇతర మైనారిటీలు ఉన్నాయన్న విషయాన్ని మరచిపోకూడదు. వారి పరిరక్షణ మన ప్రాథమిక బాధ్యత. కులం లేక మత విశ్వాసాలతో సంబంధం లేకుండా రాజ్యం అందరిదీ అయి ఉండాలి” అని సర్దార్ పటేల్ 1947 జూన్‌లో స్పష్టం చేశారు. “ఇక్కడ ప్రతి ముస్లిమూ తానొక భారతీయ పౌరుడినని, భారతీయుడిగా తనకు సమాన హక్కులు ఉన్నాయని భావించి తీరాలి. ఆ విధంగా భావించేలా అతణ్ణి చేయలేకపోతే మన వారసత్వానికి మనం తగినవాళ్ళ కాలేము” అని పటేల్ 1950లో ప్రకటించారు. “మత తత్వాన్ని మట్టుపెట్టడమనే పని ముస్లిములు, సిక్కులు, హిందువులు, క్రైస్తవులు, తదితరులందరిదీ-భారతీయులందరిదీ. దీనికోసం వారంతా మతతత్వ దృక్పధాన్ని అధిగమించి నిజమైన జాతీయతావాద మనస్తత్వాన్ని అలవరచుకోవాలి” అని సుభాష్ చంద్రబోస్ చెప్పారు. మరి గాంధీ, నెహ్రూ, పటేల్, బోస్-వీరంతా కుహనా లౌకిక వాదులేనా?



మనుస్మృతి దగ్ధం సందర్భంగా ప్రసంగిస్తున్న అంబేద్కర్

ప్రజాస్వామ్యంలో ప్రజలకు వేర్వేరు అభిప్రాయాలు, విశ్వాసాలు కలిగి ఉండే హక్కు ఉంటుంది. కానీ, ఆరెస్సెస్ వాదన ప్రకారం ఈ దేశంలో హిందువులు మెజారిటీ గనుక వారు నమ్మినదే అందరూ నమ్మాలి లేదా ఆ నమ్మకానికి లోబడి జీవించాలి. ఇదే ఆరెస్సెస్ హక్కు ప్రజాస్వామ్యం. ఇందులో ప్రజాస్వామ్యం లేదు. వ్యక్తిగత స్వేచ్ఛకు, భిన్నాభిప్రాయాలు కలిగి ఉండటానికి అవకాశమే లేదు. ఇది నిరంకుశత్వం. “మా నమ్మకాలను నువ్వు గౌరవించు” అనటం వేరు. “మానమ్మకాలను నువ్వు అంగీకరించి, వాటికి లోబడి ఉండు. లేదా ఈ దేశం విడిచిపెట్టి పో” అనే ఆదేశం ఇవ్వడం వేరు. ఈ దేశంలో పుట్టిన ప్రతి వాడికీ ఈ దేశంలో ఉండే హక్కు ఉంది. “బైటికి పో” అని చెప్పడం ఎంత దుర్మార్గం! “నా నమ్మకాన్ని నువ్వు గౌరవించు” అని అడిగేవాడికి “నీ నమ్మకాన్ని కూడా నేను గౌరవిస్తాను” అని చెప్పే సంస్కారం ఉండాలి గదా! ఇంతకూ హిందువులందరికీ ప్రాతినిధ్యం వహించే అధికారం ఆరెస్సెస్‌కు ఎవరిచ్చారు. తనకు తానే ఆపాదించుకొని కర్రపెత్తనం చేస్తానంటే హిందువులు సైతం ఊరుకోరు.

“హిందూత్వ” అంటే ఏమిటి? హిందూ మతం విశిష్టతను, సారాంశాన్ని చాటి చెప్పడమూ, దానిని ఆచరించడమూ “హిందూత్వ” నినాదం అర్థం అని అనుకునే వారు చాలామంది ఉన్నారు. హిందూ మత విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పిన వివేకానందుడు, ఇతర మతాలను గౌరవించడం, ఇతరుల నమ్మకాలను గౌరవించడం గురించి కూడా నొక్కి చెప్పాడు. ఇతర మతాలను గౌరవించలేని వాడికి తన మతం గురించి చెప్పుకునే హక్కు లేదన్నాడు. అంతేకాదు, హిందూమతంలో వేళ్ళూనుకున్న దురాచారాలను కూకటివేళ్ళతో పెళ్ళగించి పారెయ్యాలని కూడా ఉద్యమించాడు. కానీ, ఆరెస్సెస్ ఏమి చేస్తోంది? ఇతర మతస్తుల మీద ద్వేషాన్ని రెచ్చగొడుతోంది. అంతేగాదు, హిందూ మతంలోని అనాచారాలను, అనాగరికపు సంప్రదాయాలను తొలగించి సంస్కరించే బదులు, వాటిని పూర్తిగా సమర్థిస్తోంది. హిందూ మతం మీద నిజంగా అభిమానం ఉంటే ఆ మతంలోని వరకట్నం, బాల్య వివాహాలు, కుల వివక్షత, పురుషాధిక్యత, మూఢ విశ్వాసాలు-వీటికి వ్యతిరేకంగా సంస్కరణోద్యం చేయాలి. ఈ రోజు దేశంలో పలు దేవాలయాల్లోకి దళితులకు, స్త్రీలకు ప్రవేశం నిషిద్ధం. ఈ విషయమై ఆరెస్సెస్ నోరు విప్పదు. పైగా ఆ అనాచారాన్ని సంప్రదాయం పేర నిసిగ్గుగా సమర్థిస్తుంది. ఉమ్మడి పౌరస్మృతి కావాలని వాదించే ఆరెస్సెస్ హిందూమతంలో స్త్రీలకు వారసత్వ హక్కులు లేవనే విషయాన్ని పట్టించుకోదు. వేరే మతంలోకి మారితే గగ్గోలు పెట్టే ఆరెస్సెస్ హిందూమతంలో వ్యవస్థీకృతం అయిపోయి ఉన్న కుల వివక్షను, కుల విద్వేషాన్ని పట్టించుకోదు. కులాంతర వివాహాలు చేసుకున్న వారిని 'గౌరవ' హత్యలు చేస్తున్న ఖాఫ్ పంచాయతీలను (కుల పెద్దల పంచాయతీలు) నిసిగ్గుగా సమర్థిస్తుంది. అగ్రవర్ణ ఆధిక్యతకు, పురుషాహంకారానికి మనుధర్మ శాస్త్రం సంకేతం. మతం ముసుగులో అది అణగారిన కులాల ప్రజలపై, మహిళలపై పెత్తనం చెలాయించింది. అది అనాగరికమైనది. ఆధునిక ప్రజాస్వామ్యంలో దానికి స్థానం లేదు. రాజ్యాంగం చాటిచెప్పే విలువలకు అది భిన్నమైంది. కానీ ఆ దుర్మా

ర్గానికి ప్రాణప్రతిష్ట చేసి తిరిగి అమలు చేసే పనిలో ఆరెస్సెస్ ఉంది. 'మనకు ఘనమైన గత చరిత్ర ఉంది. దానిని మరచిపోవడం వల్లే మన దేశం ఇలా వెనుకబడిపోయింది' అని ఆరెస్సెస్ చెప్తుంది. నిజమే. మన గతంలో ఘనమైన చరిత్రా ఉంది. అదే సమయంలో చాలా అప్రతిష్టాత్మకమైన పార్శ్వమూ ఉంది. అభ్యుదకరమైన పార్శ్వాన్ని స్వీకరించి దానిని మరింత పెంపొందించడం విజ్ఞులు చేసే పని కానీ గత వారసత్వం పేరుతో అభివృద్ధి నిరోధకమైన అంశాలను బలపరచడం సరైంది కాదు. కానీ ఆరెస్సెస్ సరిగ్గా అదే చేస్తున్నది.

మన దేశం వెనుకబడిపోవడానికి ఒక ప్రధాన కారణం కులవివక్ష. అత్యధిక ప్రజలను కులం పేరుతో చదువుకు, అభివృద్ధికి దూరంగా ఉంచి పెత్తనం చెలాయించిన కులాధిక్య ధోరణి దేశం పురోగమించకుండా కాళ్ళకు అడ్డం పడింది. ఇంకా పడుతోంది. అయితే రెండు వందల సంవత్సరాల పాటు ఈ దేశాన్ని అడ్డగోలుగా దోచుకున్న బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలన దేశాన్ని పీల్చి పిప్పి చేసింది. ఈనాటికీ సామ్రాజ్యవాదుల పెత్తనం అనేక రూపాల్లో మన దేశాన్ని బలహీనపరుస్తోంది. ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్, ప్రపంచ వాణిజ్య సంస్థ–ఈ త్రిమూర్తుల ద్వారా మన దేశంపై అన్యాయమైన షరతులు విధిస్తున్నారు. అమెరికాతో కుదుర్చుకున్న అణు ఒప్పందం సామ్రాజ్యవాదుల దోపిడీకి ఒక మచ్చుతునక. భారతదేశాన్ని బలోపేతం చేయాలంటే సామ్రాజ్యవాదాన్ని, దాని ఆధిపత్యాన్ని ఎదిరించాల్సిందే. కానీ ముట్టుకుంటే దేశభక్తి కారిపోయే ఆరెస్సెస్‌కు సామ్రాజ్యవాదులే అత్యంత ఆప్తమిత్రులు! స్వతంత్ర్యానికి ముందు బ్రిటీస్ పాలకులకు పలు విధాల సహకరించిన చరిత్ర, ఇప్పుడు అమెరికన్ సామ్రాజ్యవాదుల పల్లకీ మోస్తున్న చరిత్ర ఆరెస్సెస్‌ది. కానీ ఇతరుల దేశభక్తిని మాత్రం ప్రశ్నిస్తూ ఉంటారు వీరు! అమెరికాకు, బ్రిటన్‌కు, లేదా జపాన్‌కు అనుకూలంగా వ్యవహరించడం, వాళ్ళ ఎడల లొంగుబాటు ధోరణి ప్రదర్శించడం దేశభక్తి! కానీ, తక్కిన వారిని రష్యా ఏజెంట్లనో, పాకిస్తాన్ ఏజెంట్లనో ముద్రవేసి అదే దేశద్రోహం అని గగ్గోలు పెడతారు! ఈ రెండు నాల్కల ధోరణి ఆరెస్సెస్–బిజెపిల ప్రత్యేకత. ఈ మధ్యకాలంలో అది మరీ ప్రస్ఫుటంగా కనబడుతోంది. గాంధీ మహాత్ముడి జన్మదినాన మోడీ స్వచ్ఛ భారత్ అని అట్టహాసం చేశారు. అదే గాంధీ మహాత్ముణ్ణి పొట్టన పెట్టుకున్న గాడ్సే చిత్రపటాన్ని పార్లమెంటులో ఆవిష్కరించాలని బిజెపి నేతలు డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యకాలంలో కాశ్మీర్‌ను భారతదేశంలో కలపకూడదని మొరాయించిన రాజా హరిసింగ్ ఆరెస్సెస్ వారికి ఆప్తుడు. కాశ్మీర్ భారతదేశంలో ఉండాలని గట్టిగా నిలబడ్డ షేక్ అబ్దుల్లా వీరి దృష్టిలో దుర్మార్గుడు. మనుధర్మ శాస్త్రాన్ని ఆకాశానికెత్తుతారు. అదే సమయంలో దాన్ని జీవితాంతం ఎదిరించి పోరాడిన బాబాసాహెబ్ అంబేద్కర్‌నూ పొగుడుతున్నారు. వివేకానందుడి పేరు చెప్పుకొని ఉపన్యాసాలు చేశారు. ఆ స్వామి చెప్పిన సర్వమత సమానత్వాన్ని గౌరవించరు. భారతదేశపు చరిత్ర చూస్తే ఆర్యులు మొదలుకొని పారశీకులు, మంగోలులు, తురుష్కులు–ఇలా పలు ప్రాంతాల వారు ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. అనేక జాతుల, భాషల, మతాల సంగమం మన దేశం. భిన్నత్వంలో ఏకత్వం మన సాంస్కృతిక వారసత్వం. సంప్రదాయం పేరుతో మన దేశం ఎన్నడూ ముడుచుకుపోయి వ్యవహరించలేదు. అభ్యుదయకరమైన ప్రతి కొత్త సంప్రదాయాన్నీ స్వాగతించాం మనం. మన సంగీతం, శిల్పం, నృత్యం, చిత్రలేఖనం, వీటన్నింటిలో ఎన్నెన్నో రీతులు ఇతర ప్రాంతాలనుంచి మనం స్వీకరించి సమ్మిళితం చేసిన కారణంగానే వృద్ధి చెందాయి. మతం పేరుతో విద్వేషం రెచ్చగొట్టాలనుకునే ఆరెస్సెస్ వ్యూహానికి ఈ వాస్తవ చరిత్ర పెద్ద ఆటంకంగా ఉంది. అందుకే చరిత్రనే వక్రీకరించి అవాస్తవాలను చరిత్ర పేరుతో ఈ ప్రజలమీద రుద్దేందుకు ఆరెస్సెస్ పూనుకుంది. బాబరీ మసీదు విధ్వంసం సందర్భంలో పురా వస్తు పరిశోధనా పత్రాలను ఎలా వక్రీకరించారో మనం చూశాం. చరిత్రనే కాదు, సైన్స్‌ను కూడా అపభ్రంశం పట్టిస్తున్నది ఆరెస్సెస్. పురాణ గాథల్నే చారిత్రిక ఆధారాలుగా చూపించి శాస్త్రీయమైన చారిత్రక పరిశోధనా క్రమాన్నే అపహాస్యం చేశారు ఈ దేశ ప్రధానిగా ఉన్న మోడీ! పాఠ్యపుస్తకాల సిలబస్‌ను అశాస్త్రీయ విషయాలతో కలగలిపి మార్చివేస్తున్నందున భావితరాల వారు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం సైతం పెరుగుతోంది. ఈ తప్పుడు విధానాలను ప్రశ్నించే వారిపైన, ఎదిరించే వారిపైన ఆరెస్సెస్ దాడులకు దిగుతోంది. రచయితలు, చరిత్ర పరిశోధకులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు–అందరూ ఈ దాడుల బారిన పడుతున్నారు. మేధావుల అభ్యంతరాలు కొరగాకుండా పోతున్నాయి. భావ ప్రకటనా స్వేచ్ఛపై పాశవికంగా తెగబడుతున్న ఆరెస్సెస్ ఆటవిక సంస్కృతి నేడు దేశ ప్రజాస్వామ్యం, మనుగడకే పెను సవాలుగా మారింది.

చివరగా ఒక్కమాట. మతతత్వం అంటే ఇతర మతస్తులపై విద్వేషాన్ని రెచ్చగొట్టడం. ఇది ఒక్క మతానికే పరిమితమైన అంశం కాదు. ఇస్లామిక్ ఉగ్రవాదుల ప్రపంచంలో, కొన్ని సందర్భాలలో మన దేశంలో సైతం సృష్టిస్తున్న విధ్వంసం చూస్తే దాని ప్రమాదాన్నీ ఏ మాత్రమూ విస్మరించలేమని గుర్తుంచుకోవాలి. మతాలను వ్యతిరేకించడం కాదు మనం చేయాల్సింది. మత విద్వేషాలని రెచ్చగొట్టి దేశ సమైక్యతకు చిచ్చు రేపుతున్న శక్తులు అని ఏ మతం పేరు చెప్పుకుంటున్నా సరే వ్యతిరేకించాల్సిందే. దేశాన్ని కాపాడుకోవాల్సిందే. ❊

“కానీ ముట్టుకుంటే దేశభక్తి కారిపోయే ఆరెస్సెస్‌కు సామ్రాజ్యవాదులే అత్యంత ఆప్తమిత్రులు! స్వతంత్ర్యానికి ముందు బ్రిటీష్ పాలకులకు పలు విధాల సహకరించిన చరిత్ర, ఇప్పుడు అమెరికన్ సామ్రాజ్యవాదుల పల్లకీ మోస్తున్న చరిత్ర ఆరెస్సెస్‌ది. కానీ ఇతరుల దేశభక్తిని మాత్రం ప్రశ్నిస్తూ ఉంటారు వీరు!”



అంబేద్కర్‌ను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న సంఘ్‌పరివార్

ఈ మాసం ప్రత్యేకం

# శాస్త్రీయ దృక్పథం

**ఎస్ వెంకట్రావు**



రచయిత సిపిఐ (ఎం)
రాష్ట్రకమిటీ సభ్యులు

శాస్త్రీయ దృక్పథం అనేది ఒక జీవన విధానం. సమాజం, సమాజంలోని వ్యక్తులు ఆలోచనలు, ఆచరణలు చేసే అత్యున్నత పద్ధతి ఇది. మన చుట్టూ ఉండే భౌతిక వాస్తవికతను పరిశీలించి, ప్రశ్నించి, పరీక్షించి, విశ్లేషించి, ఒక అభిప్రాయానికి రావడం, దాన్ని కమ్యూనికేట్ చేయడమే శాస్త్రీయ దృక్పథం. తర్కం, చర్చ, వాదన, విశ్లేషణల ద్వారా నిర్ధారణలకు రావటం శాస్త్రీయ దృక్పథంలోని ప్రధాన అంశం. ఇందులో నమ్మకం ఉంటుంది, సమానత్వం ఉంటుంది, ప్రజాస్వామ్య బద్ధత ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే భౌతిక వాస్తవికత మన ఆలోచనల్లో నుండి పుట్టదు, మన ఆలోచనలే భౌతిక వాస్తవికత నుండి పుడతాయి కాబట్టి మన ఆలోచనల ద్వారా వాస్తవికతను తెలుసుకోవడం కాకుండా ఆచరణల ద్వారా తెలుసుకోవడం శాస్త్రీయ దృక్పథం. దీనికి భిన్నమైంది అశాస్త్రీయ దృక్పథం.

ఈ నిర్వచనాన్ని పరిశీలించినప్పుడు శాస్త్రీయ దృక్పథం అనేది కేవలం సైన్సుకు సంబంధించిన విషయం మాత్రమే కాదనీ, అది వ్యక్తులకూ, సమాజానికంతటికీ సంబంధించిన విషయమని అర్థమవుతుంది.

ఆధునిక సైన్సు శాస్త్రీయ పద్ధతిని మాత్రమే అంగీకరిస్తుంది. పరీక్షకు నిలవని దాన్ని అది అంగీకరించదు. తర్కం, విశ్లేషణ, చర్చ ఉన్న సమాజాల్లో శాస్త్రీయ దృక్పథం పరిఢవిల్లుతుంది. సమాజంలో అది కొరవడితే శాస్త్రీయ దృక్పథమూ కొరవడుతుంది. శాస్త్రీయ దృక్పథం లేని చోట సైన్సు కూడా నిలవదు.

పై అంశాలను దృష్టిలో పెట్టుకుని భారత దేశాన్ని ఒక సారి పరిశీలిద్దాం. 1959లో ఢిల్లీలోని భారత ఖగోళ, సంస్కృత పరిశోధనా సంస్థ డైరెక్టర్ రామ్ స్వరూప్ శర్మ జ్యోతిష్య శాస్త్రంపై రాసిన పుస్తకాన్ని నాటి ప్రధాని నెహ్రూకు అంకితమివ్వబోయాడు. నెహ్రూ దాన్ని తిరస్కరించినందుకు ఆక్షేపిస్తూ శర్మ ఆయనకు ఉత్తరం రాశారు. దానికి నెహ్రూ ఇలా సమాధానం చెప్పారు: "డియర్ శ్రీ శర్మ. జులై 13న మీరు రాసిన ఉత్తరం అందింది. కృతజ్ఞతలు. నాకు జ్యోతిష్యంపై నమ్మకం లేదని మీరు రాశారు. అది చాలా వరకు నిజం. నిజమైన శాస్త్ర పరిశోధనను స్వాగతించాల్సిందే, అయితే అది శాస్త్రీయ పద్ధతిలో జరగాలి. భారత దేశంలో మన పూర్వీకులు ఖగోళ గణింపుల్లో చాలా పురోగమించారనేది నా అభిప్రాయం. ఈ విషయంలో మీరు చేసిన శాస్త్ర పరిశీలనను అభినందిస్తూనే ఈ పుస్తకాన్ని అంకితం పొందడానికి నేను సరిపోనని భావిస్తున్నాను. నా పాయింట్ మీరు అర్థం చేసుకుంటారనుకుంటాను...."

వాస్తవానికి "శాస్త్రీయ దృక్పథం" (సైంటిఫిక్ టెంపర్) అన్న పదాన్ని మొట్టమొదట నెహ్రూ 1946లో ప్రచురితమైన "డిస్కవరీ ఆఫ్ ఇండియా" పుస్తకంలో ప్రస్తావించారు. ఆనాడు ఆయన సైంటిస్టులతో ఒక ట్రేడ్‌యూనియన్ ఏర్పాటు చేశారు. దాని పేరు భారత సైంటిఫిక్ వర్కర్స్ అసోసియేషన్ (ఎఎస్‌డబ్ల్యుఐ). ఒక ప్రధానిగా ఉంటూ కూడా దానికి ఆయన అధ్యక్షుడిగా ఉండేవారు. 1940,50 దశకాల్లో చాలా చురుకుగా ఉండే ఈ సంస్థ 1960 దశకం వచ్చేసరికి క్రమంగా బలహీనపడుతూ ఉనికిలో లేకుండా పోయింది. కారణం, సైంటిస్టులు క్రమంగా దాన్ని వీడి వెళ్లిపోయారు. ఎందుకు వెళిపోయారు అంటే వారిలో శాస్త్రీయ దృక్పథం కొరవడుతూ వచ్చింది.

శాస్త్రజ్ఞుల్లో శాస్త్రీయ దృక్పథం కొరవడడమా? నిజానికి ఇప్పుడు మన దేశం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య అదే. స్వాతంత్ర్యానికి ముందు సర్ సి.వి రామన్ తరువాత భారత దేశం గత 85 ఏళ్లలో ఒక్క నోబుల్ బహుమతి కూడా పొందలేదంటే కారణం ఇదే.

తొలి ప్రధాని నెహ్రూ అశాస్త్రీయమైన జోతిష్యాన్ని నమ్మబోనని తిరస్కరిస్తే 1998లో వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్న మురళీ మనోహర్ జోషీ విశ్వ విద్యాలయ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి)కి ఒక సర్క్యులర్ ఇస్తూ జ్యోతిష్యంలో డిగ్రీ కోర్సులు ప్రారంభించాలని ఆదేశించారు. అలా కోర్సులు ప్రారంభించే కళాశాలలకు ప్రత్యేక గ్రాంట్లు ఇసామని అందులో పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఇటువంటి అశాస్త్రీయ కోర్సులు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ప్రఖ్యాత శాస్త్రవేత్త పి.ఎం. భార్గవ, ఆయన సహచరుడు సుప్రీమ్ కోర్టులో పిటిషన్ వేశారు. ప్రముఖ సుప్రీమ్ కోర్టు లాయర్ ప్రశాంత్ భూషణ్ దీనిపై వాదించారు. విశేషమేమంటే జ్యోతిష్యం వంటి అశాస్త్రీయ, అహేతుక అంశాన్ని శాస్త్ర విజ్ఞానం అంటూ కళాశాలల్లో ప్రవేశపెట్టడం తప్పు అని చెప్పాల్సిన కోర్టు శాస్త్రవేత్తలు వేసిన పిటిషన్‌ను కొట్టి వేసింది. జ్యోతిషం శాస్త్రం కాదు అని అనేక సందర్భాల్లో నిర్ధారణ అయిన విషయాన్ని కోర్టు పరిగణలోకి తీసుకున్నట్లు లేదు. దీనికి కారణమేమిటి? న్యాయమూర్తులు కూడా మూఢనమ్మకాలకు అతీతులు కాలేదన్నమాట. ఈ తీర్పుకు వ్యతిరేకంగా ఇంతటి దేశంలో ఒక్కరంటే ఒక్క శాస్త్రవేత్త వారికి మద్దతుగా ముందుకు రాలేదు. సామాన్యులు కొందరు భార్గవకు మద్దతుగా నిచారు, కోర్టు కేసులెదుర్కోడానికి విరాళాలు ఇచ్చారు గానీ శాస్త్రవేత్తలు ముందుకు రాకపోవడం మన శాస్త్రవేత్తల తీరును తెలియజేస్తోంది. వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో వేద గణితం, జ్యోతిష్యం వంటి కుహనా శాస్త్రాలను (సూడో సైన్సెస్) పాఠ్యగ్రంథాల్లో చేరిస్తే ఇప్పుడు మోడీ ప్రభుత్వం వచ్చేసరికి పరిస్థితి మరింత దిగజారింది. ఈ ప్రభుత్వం మన వేదాలు, పురాణాలనే ఏకంగా సైన్సుగా ప్రచారం చేయడం ప్రారంభించింది. దీనికి అఖిల భారద సైన్సు కాంగ్రెస్‌ను వేదిక చేసుకున్నారంటే మన దేశంలో శాస్త్రీయ దృష్టి ఎంత అధఃపాతాళానికి చేరుకుందో అర్థమవుతుంది. శాస్త్రీయ దృక్పథం లేని చోట సైన్సు అభివృద్ధి కాదు.

ఢిల్లీలో శాస్త్రవేత్తల బృందంతో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ గణేశుడు సగం మనిషి, సగం ఏనుగు రూపంలో ఉన్నాడంటే పురాణ కాలంలోనే ప్లాస్టిక్ సర్జరీ మనవాళ్లకు తెలుసు అన్నదానికి నిదర్శనం అని శెలవిచ్చారు. ప్రధాని ఇంత అశాస్త్రీయ సంభా


షణ చేస్తుంటే ఆయన ఎదురుగా ఉన్న ఒక్క శాస్త్రవేత్త కూడా ఖండించలేకపోయారంటే ఏమనాలి? ప్రధాని చెపింది ఒక నమ్మకం. ఒక ఊహాజనితమైన విషయాన్ని తీసుకొచ్చి అదే సైన్సు అంటుంటే శాస్త్రవేత్తలకు చీమకుట్టినట్లయినా లేని దేశంలో సైన్సు ఎలా అభివృద్ధి చెందుతుంది?

ఇంకో ఉదాహరణ: గతేడాది ముంబయిలో జరిగిన 102వ సైన్సు కాంగ్రెస్‌లో ఒక సూడో సైంటిస్టు ఒక సూడో సైంటిఫిక్ పత్రం ప్రవేశపెట్టారు. 9000 సంవత్సరాల క్రితమే భారత్‌లో ఇప్పటికన్నా పెద్ద జంబో విమానాలు ఉండేవని ఆ పత్రంలో పేర్కొన్నారు. ఒక్కో విమానం 60 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పూ ఉండేవనీ, కొన్ని విమానాలైతే 200 అడుగుల పొడవు కూడా ఉండేదని చెప్పారు. భారత దేశంలో హరప్పా, మొహంజదారో నాగరికతల కన్నా 4,500 సంవత్సరాల ముందే ఇవన్నీ ఉన్నాయని పేర్కొన్నారు. అంతటితో ఆగలేదు, ప్రస్తుత రాడార్ వ్యవస్థకన్నా మెరుగైన వ్యవస్థలు ఆనాడుండేవని పేర్కొన్నారు. ప్రతి జీవ, నిర్జీవ పదార్థం నుండి నిరంతరం శక్తి విడుదలవుతుందన్న సూత్రం ఆధారంగా ఈ రాడార్ పనిచేస్తుందని చెప్పారు. 'లా ఆఫ్ ఇంటర్-పెనిట్రేషన్' అనే కొత్త సూత్రం ప్రకారం సైన్సు-ఆధ్యాత్మికతలు కలగలిసిపోతాయని పత్రంలో పేర్కొన్నారు.

నిరూపణకు నిలిచేదే సైన్సు. నరేంద్ర మోడీ సైంటిస్టులకు చెప్పిందిగానీ, సైన్సు కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టబడిన పత్రంలో పేర్కొన్నది గానీ నిరూపితమైన విషయాలు కావు. కేవలం నమ్మకాలు. అశాస్త్రీయమైన విషయాలు. మరి అంతమంది శాస్త్రవేత్తల ఎదుట అంతగా మూఢ నమ్మకాల ప్రచారం జరుగుతున్నా వారు కిమ్మనకున్నారంటే మన శాస్త్రవేత్తల్లో శాస్త్రీయ దృక్పథం ఉన్నట్లు ఎలా అనుకుంటాం?

ఇంకా ఘోరం ఏమంటే: మన శాస్త్రవేత్తలే మూఢనమ్మకాలను పాటించడం. భాతర దేశ మంగళయాన్ ప్రాజెక్టు మనందరికీ ఎంతో గర్వకారణమైంది. రాకెట్ సైన్సు, అత్యంత ఖచ్చితమైన రాకెట్ టెక్నాలజీ అభివృద్ధి వల్ల ఈ ప్రాజెక్టు సాధ్యమైంది. కానీ మన ఇస్రో ఛైర్మన్ డాక్టర్ రాధాకృష్ణన్ మంగళ్‌యాన్ ప్రారంభానికి ఒక రోజు ముందు తిరుపతి వెళ్లి రాకెట్ నమూనాకు పూజలు చేయించి వచ్చారు. ఏమిటిది అని అడిగితే ఏమో 'ఛాన్స్'కు ఎందుకు వదిలేయడం అన్నారు. మన ఉపగ్రహాన్ని అంగారకునిపైకి తీసుకుపోయింది సైన్సా, ఛాన్సా? పూజలు చేస్తే ఉపగ్రహం అంగారకుని

"ఇంకా ఘోరం ఏమంటే: మన శాస్త్రవేత్తలే మూఢ నమ్మకాలను పాటించడం. భాతరదేశ మంగళయాన్ ప్రాజెక్టు మనందరికీ ఎంతో గర్వకారణమైంది. రాకెట్ సైన్సు, అత్యంత ఖచ్చితమైన రాకెట్ టెక్నాలజీ అభివృద్ధి వల్ల ఈ ప్రాజెక్టు సాధ్యమైంది. కానీ మన ఇస్రో ఛైర్మన్ డాక్టర్ రాధాకృష్ణన్ మంగళ్ యాన్ ప్రారంభానికి ఒక రోజు ముందు తిరుపతి వెళ్లి రాకెట్ నమూనాకు పూజలు చేయించి వచ్చారు."



తిరుపతిలో జీఎస్ఎల్‌వి రాకెట్ నమూనాతో పూజలు చేస్తున్న ఇస్రో ఛైర్మన్ రాధాకృష్ణన్

చేరుతుందంటే ఈ పరిశోధనలు ఎందుకు? శాస్త్రవేత్తల కృషి ఎందుకు? ఇంత ప్రయాస ఎందుకు? ఒకవేళ శాస్త్ర-సాంకేతిక విజ్ఞానం వల్లే ఉపగ్రహం అంగారకుని చేరుతుందంటే ఈ పూజలు ఎందుకు?

ద్వైదీ భావం. శాస్త్రీయ దృక్పథం స్థానంలో మన సమాజంలో ఈ ద్వైదీ భావం రాజ్యమేలుతోంది. శాస్త్రం శాస్త్రమే నమ్మకాలు నమ్మకాలే అనేది అశాస్త్రీయమైన వైఖరి. శాస్త్రం మానవ కృషికి సంబంధించింది. నమ్మకం మనవాతీతమైంది.

మనిషి తత్వంలోనే ఈ ద్వైదీ భావం ఉంది. 'నారుపోసినవాడు నీరుపోయడా" అన్నది మానవాతీతమైన భావనను ప్రోత్సహించే తత్వం. "గాలిలో దీపం పెట్టి దేవుడా నీవే దిక్కు" అంటే ఆగుతుందా అనేది మానవ కృషిని ప్రోత్సహించే తత్వం. మనిషి జ్యోతిషం చూసుకుని ఇంట్లో కూర్చోడు. పని చేసి జ్యోతిష్యం పరీక్షిస్తాడు. పనికి వెళుతూ శకునాలు చూస్తాడు. కష్టపడుతూ యంత్రాలు, తంత్రాలను ఆశ్రయిస్తాడు. ఆసుపత్రికి వెళుతూ కొబ్బరికాయ కొడతాడు. పరీక్షకు సిద్ధమై భగవంతుని ప్రార్థిస్తాడు. ఇంకా చాలా ఉదాహరణలు చెప్పొచ్చు.

మనిషిలో ఈ ద్వైదీభావం అంటే ఒకవైపు విజ్ఞానశాస్త్రంపై నమ్మకం, రెండో వైపు అతీత శక్తి లేక దేవుడు అనేదానిపై నమ్మకం రెండూ కలిసి నడవడం అనేది శాస్త్ర విజ్ఞానాభివృద్ధి క్రమంలోనే ఏర్పడింది.

సైన్సు ఆవిర్భావం గురించి ప్రఖ్యాత శాస్త్రవేత్త, "చరిత్రలో సైన్సు" గ్రంథ రచయిత జె.డి. బెర్నాల్ ఇలా అన్నారు: "మానవజాతి చరిత్ర మొత్తం పరిశీలిస్తే సైన్సు స్వరూపం ఎంతగానో మారిపోతూ వచ్చింది. అందుకే సైన్సుకు ఒక నిర్దిష్టమయిన నిర్వచనం చెప్పుకోవడం కష్టం. మానవ సమాజం శైశవప్రాయంలో ఉన్నప్పుడు సైన్సు మనుషుల ఆచారాలు, మతక్రతువుల్లో అంతర్లీనంగా దాగి ఉండేది. ఆ తర్వాత ప్రకృతి శాస్త్ర ప్రభావం వల్ల, దాని రూపంలో అది నిర్దిష్టంగా ఏర్పడింది. మానవ నైపుణ్యం, సైన్సు, తాత్విక చింతనల మధ్య నిరంతరం అవినాభావ సంబంధం ఉంటూవచ్చింది.

ఒకరకంగా చెప్పాలంటే సైన్సు క్రమబద్ధం చేయబడిన నైపుణ్యం, మరోరకంగా అది హేతుబద్ధం గావించబడిన పురాణం. ఎందుకంటే సైన్సు ఆదిమానవుని చేతివృత్తులు, మతాచారుల మంత్రపఠనాలలో నిగూఢమైన అంశం నుండి ప్రారంభమయింది. మానవుని జీవనయాత్రలో స్థిరపడుతూ, మారుతూ వచ్చిన కార్యకలాపాలు, సమాజం అవిచ్ఛిన్నంగా సాగడానికి దోహదపడిన భావాలూ, ఆచారాలు సామాజంలో ఏర్పడిన వివిధ వర్గాల హక్కులు వాటి మధ్యలో సైన్సు అభివృద్ధి చెందుతూ వచ్చింది."

అందువల్ల సైన్సు, శాస్త్రీయ దృక్పథం అనేవి శాస్త్రజ్ఞుల లేబరేటరీల్లో పుట్టలేదు. సమాజంలో పుట్టాయి. కాబట్టి వాటి

> **❝ పెట్టుబడిదారీ వర్గం ఆవిర్భవించి, అభివృద్ధి చెంది ఫ్యూడల్ శృంఖలాలను ఛేదించినప్పుడు మాత్రమే మళ్ళీ సైన్సు అభివృద్ధి చెందింది. ఈ కాలంలో సైన్సుకూ మతానికీ మధ్య పెద్ద యుద్ధం జరిగింది. చివరికి మతంపై సైన్సు విజయం సాధించింది. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థ, ఆధునిక సైన్స్ రెండూ ఒకేసారి ప్రారంభమయ్యాయి. ❞**

స్థితిగతులను సమాజమే నిర్ణయిస్తుంది. చరిత్రలో అన్ని స్థలాలలోనూ, అన్ని కాలాల లోనూ సైన్సు ఒకేలాగా వెలుగొందలేదు. కొంతకాలం ఒక్కో చోట దేదీప్యమానంగా వెలిగిన విజ్ఞాన జ్యోతి మరికొంత కాలానికి అణగారిపోయి మిణుకు మిణుకు మన్నది. వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాలలోనే సైన్సు అభివృద్ధి చెందింది. ప్రాచీన వ్యాపార కేంద్రాలైన బాబిలోనియా, ఈజిప్టు, భారతదేశాలలో సైన్సు వికసించింది. ఆ తరువాత గ్రీసు దేశం వీటన్నిటి వారసత్వాన్ని పుచ్చుకున్నది. గ్రీసులోనే సైన్సుకు ఈనాడు మనం చూస్తున్న హేతుబద్ధ విధానం తొలిసారి అబ్బింది. అయితే గ్రీసులో నగర రాజ్యాల పతనంతో శాస్త్రీయ ఆలోచనా విధానం మంద గించింది. తరువాత రోమను సామ్రాజ్యంలో సైన్సుకు స్థానం లేకుండా పోయింది. పశ్చిమ ఐరోపాలో ఏర్పడిన బర్బర రాజ్యాలలో విజ్ఞానజ్యోతి పూర్తిగా మట్టుపెట్ట బడింది. అయితే విజ్ఞానం ఈ ప్రపంచం నుండి పూర్తిగా తుడుచుకుపోలేదు. తూర్పుదేశాల నుండి గ్రీసు చేరిన విజ్ఞానం తిరిగి తూర్పుదేశాలకు చేరుకు న్నది. సిరియా, పర్షియా, భారత్, చైనాలలో నూతనంగా ఆవిర్భవించిన ఇస్లాం మత ప్రభా వం కింద సైన్సు ఊపిరి పోసుకుంది. అక్కడ నుండి మళ్ళీ మధ్యయుగాలలో అది యూరప్‌లో ప్రవేశించింది. అక్కడ సైన్సు మళ్ళీ అభివృద్ధి చెందింది. తొలిదశలో చాలా నెమ్మదిగా అడుగులు వేసిన విజ్ఞాన శాస్త్రం తరువాత ఒక్కసారిగా ఉరుకులు పరుగులు అందుకున్నది. సృజనాత్మక కార్యకలాపాలు పెరిగి, ఆధునిక శాస్త్రవిజ్ఞానానికి అంకురార్పణ అక్కడే జరిగింది.

ఐరోపాలో సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలో విజ్ఞాన శాస్త్ర రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఆ తరువాత సైన్సు ఊహించని వేగంతో పురోగమించింది. అయితే ఈ పురోగమనంలో కూడా మనకు నాలుగు దశలు కనిపిస్తాయి.

మొదటిదశ ఇటలీలో ప్రారంభమ యింది. లియోనార్డో డావిన్సీ, వెసేవియస్, కోపర్నికస్ మొదలైన శాస్త్రవేత్తలతో యాంత్రిక విజ్ఞానం, శరీర ధర్మశాస్త్రం, ఖగోళశాస్త్రాలు పునరుజ్జీవనం పొందాయి. మనిషి ప్రపంచానికి సంబంధించిన అభిప్రాయాలపై ప్రాచీన విజ్ఞాను ల పట్టును వీరు పంటాపంచాలు చేశారు. రెండవ దశ ఫ్రాన్స్, బ్రిటన్‌లలో ప్రారంభమైంది. బెకన్, గెలీలియో, డిన్‌కార్టెస్‌లతో ప్రారంభమై మహాశాస్త్ర వేత్త న్యూటన్ వరకు ఈ దశ సాగింది. ప్రపంచాన్ని వారు నూతన గణిత యాంత్రిక నమూనాలో ఆవిష్కరించారు. తరువాత కొంత విరామానంతరం పారిశ్రామిక బ్రిటన్‌లోనూ, విప్లవ ఫ్రాన్స్‌లోనూ సైన్సు మూడవ దశ మార్పుకు గురయింది. గ్రీకుల కాలంలో ఏ మాత్రం పరిచయం లేని విద్యుత్ వంటి నూతన శాస్త్ర రంగాలకు తలుపులు తెరుచు కున్నాయి. విద్యుత్, యంత్రాలు, రసాయనాలు వీటిద్వారా విజ్ఞానశాస్త్రం ఉత్పత్తి, రవాణా రంగాలలో మార్పులకు దోహదపడింది. ఇక నాల్గవది, చివరి దశ మనకాలంలో కనిపిస్తున్న విజ్ఞానశాస్త్ర విప్లవం. సైన్సు ఇప్పుడు ప్రపంచ వ్యాపితరూపం సంతరించుకున్నది. పాత పరిశ్రమలు పోయి నూతన పరిశ్రమలు అనేకం వచ్చాయి. మానవ జీవనంలోని అన్ని రంగా లకూ సైన్సు విస్తరించింది.

విజ్ఞానశాస్త్ర అభివృద్ధిలోని ఈ దశలన్నీ సామాజిక, ఆర్థిక మార్పులతో ముడిపడి ముందుకుసాగాయి. గ్రీకుసైన్సు ధన ప్రాబల్యం గల ఇనుపయుగపు బానిస సమాజ అభివృద్ధి, పతనాలను ప్రతిబింబిస్తోంది. గ్రీసులో తొలి ప్రజాస్వామ్యంతో పాటే సైన్సూ, శాస్త్రీయ ఆలోచనలూ అభివృద్ధి చెందాయి. అయితే అది బానిస యజమానుల ప్రజాస్వామ్యమే కానీ ప్రజలందరి ప్రజాస్వామ్యం కాదు. అందుకే ఈ కాలంలో సైన్సు అభివృద్ధికి పరిమితులు ఏర్పడ్డాయి. మధ్యయుగాలలో విజ్ఞాన శాస్త్రం, శాస్త్రీయ ఆలోచనలు తిరోగమించాయి. కారణం ఫ్యూడల్ ఆర్థిక వ్యవస్థలోని అస్థిరత. ఈ సమాజంలో సైన్సు ఉపయోగం చాలా తక్కువ. అందువల్ల ఈ కాలంలో చర్చి, దాని ఆలోచనా విధానం ప్రజలపై పెత్తనం సాగించింది. పెట్టుబడిదారీ వర్గం ఆవిర్భవించి, అభివృద్ధి చెంది ఫ్యూడల్ శృంఖలాలను ఛేదించినప్పుడు మాత్రమే మళ్ళీ సైన్సు అభివృద్ధి చెందింది. ఈ కాలంలో సైన్సుకూ మతానికీ మధ్య పెద్ద యుద్ధం జరిగింది. చివరికి మతంపై సైన్సు విజయం సాధించింది. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థ, ఆధునిక సైన్స్ రెండూ ఒకేసారి ప్రారంభమయ్యాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భవించి నాలుగు శతాబ్దాలు అయింది. ఈ కాలంలో సైన్సు విపరీతంగా పెరిగింది. సైన్సు–సాంకేతిక శాస్త్రాలు మానవ జీవిత విధానాన్నే మార్చేశాయి. మానవుని జ్ఞాన నేత్రం పదార్థపు చిట్టచివరి లోతుల నుండి విశ్వపు చిట్టచివరి అంచుల వరకు చూడగలుగుతోంది. మానవ జీవితపు ప్రతి క్షణం, ప్రతి అడుగు, ప్రతి వస్తువు సైన్సుతో ముడిపడి సాగుతోంది.

సైన్సు ఇంతగా పెరిగినప్పుడు శాస్త్రీ య దృక్పథం అంతే మోతాదులో పెరగాలి కదా! కానీ విచిత్రం...! ఆధునిక సమాజంలో శాస్త్రీయ దృక్పథం పెరగకపోగా క్రమంగా తగ్గుతోంది. బాబాలు, సాధువులు, అమ్మలను కొలవడం, మూఢనమ్మకాలు, టీవీలో మత బోధనలు, అశాస్త్రీయ యాడ్స్, దెయ్యాలు మూఢ నమ్మకాలను సమర్థించే సినిమాలు, టివి కార్యక్రమాలు, అశాస్త్రీయ వైద్యం, వాస్తు.... అన్ని రకాల మూఢవిశ్వాసాలు పెరుగుతున్నాయి. మామూలు ప్రజలే కాదు, సైన్సు చదువుకున్న వారు, శాస్త్రవేత్తలు కూడా ఎందుకు ఈ అశాస్త్రీయ భావాలను ప్రశ్నించకుండా అమోదిస్తు న్నారు? ఆచరిస్తున్నారు?

తెలుగునాట భక్తిరసం
తెప్పలుగా పారుతోంది
డ్రైనేజీ స్కీములేక
డేంజరుగా మారుతోంది

అని గజ్జెల మల్లారెడ్డి కవిత్వం చెప్పారు. కానీ అభ్యుదయ కవే కాలం గడిచే సరికి మూఢనమ్మకాల బారిన పడ్డారు. కుల,మత నమ్మకాలు, మూఢనమ్మకాలకు దూరంగా ఉన్న కుటుంబాల్లో తరాలు మారుతున్న కొద్దీ అశాస్త్రీయ నమ్మకాలు పెరుగుతున్నవైనాన్ని వారి పెళ్లిళ్లు, క్రతువులు, ఇతర జీవన ఆచారాల్లో చూస్తున్నాం. ఎందుకిలా జరుగుతోంది?

హేతువాదం, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పథం అనేవి సమాజాన్ని ముందుకు తీసుకుపోయే ఆలోచనా ధోరణులు. ఒకనాడు

"విజ్ఞానం ఎంత విస్తరించినా అతని మెదడుకు అందని చీకటి ప్రాంతం చాలా ఉంది. విశ్వంలో 94 శాతం డార్క్ మేటర్ ఉంది. దాని గురించి మనకేం తెలియదు. 'తెలిసిన' విశ్వంలో కూడా మనకు తెలియని విషయాలు చాలా చాలా ఉన్నాయి. అందువల్ల ఈ తెలియని చీకటి ప్రాంతం "విశ్వాసాలు" పెరగడానికి ఒక ప్రాతిపదిక."

ఫ్యూడల్ సమాజంపై తిరుగుబాటుకు ఈ ఆలోచనలనే ఆధునిక బూర్జువావర్గం సాధనాలుగా చేసుకుంది. ఫ్రెంచ్ విప్లవ కాలంలో క్యాథలిక్కు మతాచారాలను ఫ్రీ రాడికల్స్ దునుమాడారు. దైవ భావాన్నే తిరస్కరించారు. నిజానికి విశ్వాన్ని వర్ణించడానికి ఆదిమానవులకు దేవుడు అవసరమైనాడు. కాని అభివృద్ధి చెందిన సైన్సు, విశ్వసృష్టిలో దేవుని ప్రమేయం లేదని తేల్చేసింది. ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త లాప్లాస్ తను ఖగోళాన్ని గురించి చేసిన అధ్యయనంలో దేవుని ప్రమేయం ఎక్కడా రాలేదని చెప్పాడు. ఖగోళశాస్త్రమే కాదు, నేడు జన్యుశాస్త్రం, మానవ విజ్ఞాన శాస్త్రం, మెదడుకు సంబంధించిన పరిశోధనలు ఇవేవీ కూడా దేవుని ప్రమేయం లేకుండానే జరుగుతున్నాయి. కాబట్టి శాస్త్రవేత్త లకు తెలుసు దేవునితో వారికీ, వారి పరిశోధ నలకూ సంబంధం లేదని. అయినా వారు దేవుని నమ్ముతున్నారు. సమాజం నడవడానికీ, ప్రజల్లో నీతినియమాలు స్థాపించడానికీ దేవుడు అవసరం అంటారు. అందువల్ల ఎంత గొప్ప శాస్త్రవేత్త అయినా, ఎంత విజ్ఞానవంతుడైనా అతని మెదడులో నుండి దేవుడు అనే భావం చెరిగిపోక పోవడమే కాదు అనేక రకాల మూఢనమ్మకాలతో కలగలిసి మరింత వికారంగా తయారవుతోంది. పామరులు, చదువు లేనివారైతే సరే... బాగా నాగరీకులమనుకున్న వారే బాబాలు, స్వాములకు సాష్టాంగపడు తున్నారు. సత్యసాయిబాబా చనిపోయిన తరువాత బాగా చదువుకున్న వారే బాబాగారు మూడో రోజు లేస్తారు చూడండి, ఆయన సమాధిలో నుండే మాట్లాడతాడు, అద్భుతాలు చేస్తాడు అన్నారు. కానీ అలా ఏం జరగలేదు. శకునాలు, అదృష్టాలు, దిష్టులు, జ్యోతిష్యాలు, వాస్తులు వగైరావగైరా మూఢ నమ్మకాలు ఈ 'విజ్ఞానుల్లోనే' ఎక్కువగా కనిపిస్తున్నాయి.

నిత్యజీవన సమరంలో సతమతమవుతున్న శ్రామికునికన్నా 'విజ్ఞానులైన' ఈ ఉన్నతవర్గాల్లోనే ఈ నమ్మకాలూ, మూఢాచారాలు ఎక్కువగా ఉన్నాయి, పెరుగుతున్నాయి ఎందుకన్నది ప్రశ్న.

సమాజంలో శాస్త్రీయ దృక్పథానికి లేక కొరవడడానికి రెండు ప్రాతిపదికలున్నాయి. 1. మన విజ్ఞానానికి ఉన్న పరిమితులు 2. సమాజిక పరిస్థితులు.

మన విజ్ఞానానికి ఉన్న పరిమితులేమిటి? ఆదిమానవుడు ప్రకృతిపై పనిచేయడం ద్వారా దానిలోని సూత్రాలను కనిపెట్టగలిగాడు. ఆ విధంగా అతను విజ్ఞానాన్ని విస్తరించుకుంటూ పోతున్నాడు. విజ్ఞానం ఎంత విస్తరించినా అతని మెదడుకు అందని చీకటి ప్రాంతం చాలా ఉంది. విశ్వంలో 94 శాతం డార్క్ మేటర్ ఉంది. దాని గురించి మనకేం తెలియదు. 'తెలిసిన' విశ్వంలో కూడా మనకు తెలియని విషయాలు చాలా చాలా ఉన్నాయి. అందువల్ల ఈ తెలియని చీకటి ప్రాంతం "విశ్వాసాలు" పెరగడానికి ఒక ప్రాతిపదిక.



కరోర్‌పతి బాబాకు పాదాభివందనం చేస్తున్న బిజేపీ నేత నితిన్ గడ్కరి

రెండవది సామాజిక ఆర్థిక చట్రంలో నెలకొన్న పరిస్థితులు అశాస్త్రీయ భావాలు పెరగడానికి మరో ప్రాతిపదికను సృష్టిస్తున్నాయి. మానవుల "సామాజిక, రాజకీయ, వైజ్ఞానిక జీవితాలపై వారి భౌతిక జీవితావసరాసాల ఉత్పత్తి విధానం విధిగా ఆధిపత్యం వహిస్తుంది" అని కారల్ మార్క్స్ చెప్పాడు. అంటే నేటి మన ప్రజల వైజ్ఞానిక జీవితంలో వస్తున్న మార్పులకు ప్రాతిపదిక మన సమాజపు ఆర్థిక జీవనంలో అంటే ఆస్తి, సంపదల సృష్టి, పంపిణీ విధానంలో ఉందన్నమాట.

మన సమాజంలో కొందరు ఎంత కష్ట పడినా వారి వద్ద పేదరికం పోగుపడుతోంది, మరికొందరు కష్టపడకపోయినా వారివద్ద సంపద పోగుపడుతోంది. పోగుపడిన సంపద కొందరివద్ద నుండి మళ్లీ ఇంతలోనే మాయమైపోతోంది. తెలియకుండానే వస్తున్న సంపద తెలియకుండానే వెళ్లిపోవడానికి కారణమేమిటి? తాము ఏ తప్పూ చేయకపోయినా కొన్నిసార్లు సంపద కోల్పోతున్నారు. ఏ ఘన కార్యం చేయకపోయినా సంపద అకస్మాత్తుగా రావడం చూస్తున్నారు. అందువల్ల ఏదో తెలియని శక్తి దీన్ని నడిపిస్తోందన్న భావనకు ఆధునిక మానవుడు గురవుతున్నాడు. దాన్ని అదృష్టమనో, మరొకటనో అనుకుంటున్నాడు.

యాంత్రీకరణ పెరిగి ఉత్పత్తి బాగా అభివృద్ధి చెందినాక సంపద ఎలా పోగవుతోంది, ఎలా పంపిణీ జరుగుతోందో వ్యక్తులకు తెలిసే అవకాశాలు మరింత తగ్గిపోతున్నాయి. ఆస్తి కార్పొరేట్ సంస్థల్లో సమిష్టి, నైరూప్య గుణాలు సంతరించుకుంటోంది. స్టాక్స్, బాండ్లు, టైటిల్ డీడ్‌లుగా మారి స్టాక్ ఎక్స్ఛేంజ్ సుడిగుండంలోకి విసిరివేయబడుతోంది. అక్కడ ఆస్తిని కొనుగోలు, అమ్మకాలు ఒకరి మొహాలు ఒకరు చూసుకోకుండానే జరిగిపోతున్నాయి. చివరికి అది తనదగ్గరికి ఎక్కడి నుండి వచ్చిందో ఎక్కడికి పోతోందో కూడా తెలియదు. చేతులు మారుతోంది. స్టాక్ ఎక్స్ఛేంజిలో కొందరికి నష్టం వస్తోంది. కొందరికి లాభాలొస్తున్నాయి. స్టాక్‌లు ఎందుకు నష్టపోతున్నాయో, ఎందుకు లాభపడుతున్నాయో తెలియదు. అంతా ఒక జూదం లాగా సాగిపోతోంది. దీని గురించి పాల్ లాఫార్గ్ ఇలా అంటాడు: "ఆధునిక ఆర్థికాభివృద్ధి మొత్తం పెట్టుబడిదారీ సమాజాన్ని ఒక పెద్ద అంతర్జాతీయ జూద గృహంగా మార్చేసింది. ఇక్కడ పెట్టుబడిదారుడు నిత్యం పెట్టుబడిని గెలుచుకుంటుంటాడు, ఓడిపోతుంటాడు.

“ కాని పెట్టుబడిదారీ వర్గం సామాజిక రంగంలో మాత్రం శాస్త్రవేత్తలు ఈ పనిచేయడానికి అనుమతించడం లేదు. అలా చేసినప్పుడు దేవుడు, ఆత్మలు, మాయలు, మంత్రాలు, శకుల నాలు వంటివాటిపై నమ్మకాలు పోతాయి. కాని ఆ నమ్మకాలు ఉండడం పెట్టుబడిదారీ వర్గానికి అవసరం గనుకనే అది పనిగట్టుకుని సామాజిక శాస్త్రాలనూ, సామాజిక పరిశోధనలనూ నిర్లక్ష్యం చేస్తోంది, వక్రీకరిస్తోంది.”

ఇదంతా కూడా ఎవరూ ఊహించని అదృశ్య ఘటనల వల్ల సంభవిస్తుంటాయి. ఇదంతా కూడా అదృష్టం మీద ఆధారపడి నడుస్తుందని వారు భావిస్తుంటారు. ఒక జూద గృహంలో మాదిరిగానే అదృశ్యశక్తి పెట్టుబడిదారీ సమాజంలో తచ్చాడుతుంటుంది.”

పేకాడేవాడు ప్రతి ముక్కకూ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంటాడు. సెంటిమెంట్లు, నమ్మకాలు, శకునాలు అతన్ని ముక్కముక్కకీ నడుపుతుంటాయి. మన స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టిన వారు కూడా ఎప్పుడేం జరుగుతుందో తెలియని అయోమయంలో పేకట రాయుళ్ల మాదిరి సెంటిమెంట్లు, నమ్మకాలు, శకునాలకు లోనవుతారు. అటువంటి వారు హేతుదృక్పథాన్ని పూర్తిగా వదిలేసి సంపూర్ణ మూఢనమ్మకాల మనుషులుగా మారతారు.

ఆదిమానవుడు ప్రకృతి శక్తుల గమనం గురించి తెలియక వాటిముందు ఎంత అయోమయంగా నిలబడ్డాడో నేటి సమాజంలో సంపదను నడిపించే ఈ అదృశ్యశక్తి ముందు మనిషి అంతే అయోమయంగా నిలబడ్డాడు. తను సృష్టించుకున్న విలువలేని, లేక అత్యంత విలువ తక్కువ కాగితం ముక్క (రూపాయి) నాగరిక సమాజాన్ని నడుపుతోంది. తిండి, ఇల్లు, గుడ్డ, వినోదం అన్నిటినీ ఇస్తోంది. దాని గమనం అదృశ్య శక్తులతో నడుస్తోంది. ఇదంతా మనిషిలో ఒక రకమైన మార్మికతను పెంచి పోషిస్తోంది. అందునా ఆర్థిక సంక్షోభ కాలాల్లో అయితే తమ చేతుల్లో లేని అదృశ్య శక్తులు విచ్చలవిడిగా వ్యవహరిస్తాయి. మొత్తం మీద ఆధునిక జీవనంలో మనిషి అంతులేని వైచిత్రుల అగాథంలో కూరుకుపోతాడు. శాస్త్రవేత్తల కృషి వల్ల ప్రకృతి శక్తులపై అదుపు సాధించిన మానవుడు సామాజిక శక్తులమీద అదుపు సాధించలేకపోతున్నాడు. ఇక్కడ ఆర్థిక శక్తులే సమాజాన్ని, రాజకీయాలను అన్నిటినీ నడుపుతాయి. అవి అతన్ని ఎంతగా భయపెడతాయంటే ఆదిమానవుడు ప్రకృతి శక్తులను ప్రసన్నం చేసుకోడానికి చెట్టూ పుట్టా ముందు మోకరిల్లినట్లు ఆధునిక మానవుడు ఈ సామాజిక అగోచర శక్తిని ప్రసన్నం చేసుకోడానికి దేవుళ్లూ, దెయ్యాలు, బాబాలు, స్వాములు అందరినీ మొక్కుతాడు. ఆదిమానవుడు ప్రకృతిని ప్రసన్నం చేసుకోడానికి రకరకాల క్రతువులను ఆశ్రయించినట్లు, ఆధునిక మానవుడు అనేక రకాల క్రతువులు, మూఢనమ్మకాలు, శకునాలు, జ్యోతిష్యాలు, సెంటిమెంట్లను ఆశ్రయిస్తున్నాడు. ఆదిమానవునికి మంచి ఆత్మలు (దేవతలు), చెడ్డ ఆత్మలు (దెయ్యాలు) మాదిరిగానే ఆధునిక మానవునికి సామాజిక శక్తులు దెయ్యాలు, దేవతలు మాదిరిగా కనిపిస్తాయి.

మనిషి ప్రకృతి శక్తులపై నిత్యం విజయాలు సాధిస్తుంటాడు గనుక అనాగరికులకైనా రేపు తన సమస్యలన్నిటికీ పరిష్కారం దొరుకుతుందన్న ఆశ ఉంటుంది. కాని సామాజిక శక్తులముందు మోకరిల్లిన ఆధునిక మానవునికి ఆ ఆశకూడా లేనప్పుడు ఈ శక్తుల నుండి విముక్తిచేసే మార్గం అతనికి దేవుళ్లూ, బాబాలు, స్వాముల్లో మినహా మరెక్కడా కనిపించదు.

అందువల్ల దేవుళ్లు, బాబాలపై నమ్మకాలు, మూఢ విశ్వాసాలు, అహేతుక భావజాలం సామాజిక వాతావరణం నుండి ఉద్భవించాయి. కనుక సమాజాన్ని అధ్యయనం చేసి, ఈ విశ్వాసాలకు కారణమైన పెట్టుబడిదారీ సామాజిక వ్యవస్థ మూలాన్ని సంస్కరించినప్పుడే శాస్త్రీయ దృక్పథం పెరుగుతుంది.

యూరప్‌లో ఫ్యూడలిజంపై జరిగిన పోరాటం సందర్భంగా క్యాథలిక్కు ఛాందస భావాలను ప్రతిఘటించడం జరిగింది. హేతువాదం, లౌకిక వాదం, శాస్త్రీయ ఆలోచనలకు అదరణ పెరిగింది. కాని పెట్టుబడిదారీ వ్యవస్థ నిలదొక్కుకున్న తరువాత ఆ వ్యవస్థలోని అహేతుకత సమాజంలో హేతుబద్ధ ఆలోచనలకు తిలోదకాలిచ్చింది. మన దేశంలో కూడా స్వాతంత్ర్యోద్యమం జరుగుతున్నప్పుడు సమాజంలో రాడికల్ భావాలకు ఆదరణ పెరిగింది. కాని స్వాతంత్ర వచ్చాక పాలకులు ఆ విలువలకు తిలోదకాలిస్తున్నారు. అహేతుక, మతతత్వ, అశాస్త్రీయ భావాలు పెరుగుతున్నాయి. ప్రపంచీకరణ యుగంలో ఇవి మరింత వెర్రి తలలు వేస్తున్నాయి.

**ప్రపంచీకరణ మూఢభావాలు**

ఆధునిక మనిషికి అర్థంకాని అగోచర సాంఘిక శక్తులు ప్రపంచీకరణ యుగంలో మరింత విజృంభించాయి. ఆర్థిక నిర్వహణపై ప్రభుత్వ నియంత్రణ తగ్గుతున్న కొద్దీ స్వేచ్ఛా మార్కెట్ శక్తులు విజృంభిస్తున్నాయి. పెట్టుబడికి ప్రపంచ వ్యాపితంగా స్వేచ్ఛ లభించింది. పెట్టుబడి ఇప్పుడు ఏ దేశంలోని స్టాక్ మార్కెట్‌నుండైనా క్షణాల్లో మాయమైపోయి మరోదేశానికి పారిపోవచ్చు. అందువల్ల పెట్టుబడిదారుల వద్ద పోగైన సంపద ఏ నాటికన్నా నేడు చంచలంగా ఉంది. కళ్ల ముందే తోటివారివద్ద కోట్ల సంపద పోగవుతుంటే, రాత్రికిరాత్రి మార్కెట్ పతనాలతో కొందరు దివాళా ఎత్తుతున్నారు. ఇదంతా ప్రజల్లో మరింత అభద్రతనూ, అశాంతినీ పెంచి పోషిస్తోంది. కాబట్టి ప్రపంచీకరణ యుగంలో దేవుడు, బాబాలు, స్వాములు వారి మాయలూ, మంత్రాలూ మరింత అవసరమైనాయి. అందుకనే ఈ కాలంలో అన్ని దేశాల్లోనూ మత ఛాందసత్వం, మూఢ విశ్వాసాలు పెరిగాయి.

విజ్ఞాన శాస్త్రాలతో ఈ ఛాందసత్వానికి వ్యతిరేకంగా పోరాడితే సరిపోతుందని కొందరు భావిస్తున్నారు. కాని ఆ పని జరిగేది కాదని చరిత్ర మనకు చెబుతోంది. ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థ తన అవసరం కొద్దీ శాస్త్ర–సాంకేతిక రంగాలను ప్రోత్సహిస్తోంది. సైంటిస్టులు ప్రకృతి విజ్ఞాన శాస్త్రాలను సరిగ్గానే పరిశోధన చేసి ఫలితాలు అందిస్తున్నారు. కాని పెట్టుబడిదారీ వర్గం సామాజిక రంగంలో మాత్రం శాస్త్రవేత్తలు ఈ పనిచేయడానికి అనుమతించడం లేదు. అలా చేసినప్పుడు దేవుడు, ఆత్మలు, మాయలు, మంత్రాలు, శకుల నాలు వంటివాటిపై నమ్మకాలు పోతాయి. కాని ఆ నమ్మకాలు ఉండడం పెట్టుబడిదారీ వర్గానికి అవసరం గనుకనే అది పనిగట్టుకుని సామాజిక శాస్త్రాలనూ, సామాజిక పరిశోధనలనూ నిర్లక్ష్యం చేస్తోంది, వక్రీకరిస్తోంది. పుక్కిటి పురాణాలను చరిత్రగానూ, మూఢ విశ్వాసాలను సైన్సుగానూ ప్రచారం చేసే ధోరణి ఈ రోజు పెరిగిపోవడానికి కారణం ఇదే. ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలు కూడా ఈ మూఢవిశ్వాసాలు పెంచడానికే ఉపయోగపడుతున్నాయి. అందు వల్ల అశాస్త్రీయ భావాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని సైన్సు రంగంలో కాకుండా సామాజిక రంగంలో చేయాలి. ఛాందసవాదాన్ని పెంచిపోషిస్తున్న సామాజిక వ్యవస్థ ఉన్నంత కాలం ఈ భావజాలం ఉంటూనే ఉంటుంది. కాబట్టి శాస్త్రీయ సామాజిక వ్యవస్థ కోసం పోరాడటం ద్వారా మాత్రమే సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించగలం. ❄

**ఇంటర్వ్యూ**

# అభివృద్ధిలో ఎఫ్‌డిఐల పాత్ర నామమాత్రమే



రచయిత ఎల్‌ఐసి ఎంప్లాయీస్ యూనియన్ అఖిలభారత అధ్యక్షులు

**అమానుల్లా ఖాన్**

*ఎల్‌ఐసి ఎంప్లాయీస్ యూనియన్ అఖిల భారత అధ్యక్షులు అమానుల్లాఖాన్‌గారు విజయవాడ వచ్చిన సందర్భంగా మార్క్సిస్టు ఇన్‌ఛార్జి* ***ఎ కోటిరెడ్డి*** *ఆయనను ఇంటర్వ్యూ చేశారు. ఆ ఇంటర్వ్యూలోని అంశాలను పాఠకులకు అందిస్తున్నాం.*

**ద్రవ్యరంగంలో సంస్కరణలను అమలు జరపటానికి మోడి ప్రభుత్వం ఎందుకు తొందర పడుతున్నది?**

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక రంగం ప్రమాదంలో ఉంది. ప్రస్తుతం ఏం జరుగుతోందంటే ఆర్థిక రంగాన్నే పెట్టుబడిగా మార్చేస్తున్నారు. ఇదివరకు ద్రవ్య పెట్టుబడి అనేది పారిశ్రామిక ప్రక్రియలో అనుబంధంగా ఉండేది. ప్రజలు పెట్టుబడి పెట్టడం, పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉత్పత్తులను పంపిణీ చేయడం ద్వారా లాభాలు గడించేవారు. కానీ ఇప్పుడు ఆర్థిక రంగం ఉత్పత్తి ప్రక్రియ నుంచి వేరుపడి స్వతంత్రంగా వ్యవహరిస్తోంది. సంపదపై కేంద్రీకరణ పెరగడం, పెద్దమొత్తంలో సంపద పోగుపడిపోవడం మూలాన ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికైనా వెళ్లగలిగి, సట్టా వ్యాపార ప్రక్రియను విస్తరించేందుకు వీలుగా ఆర్థిక రంగం మారిపోయింది. ద్రవ్య పెట్టుబడి కోసం ఏర్పాటు చేసుకున్న అంతర్జాతీయ ఆర్థిక చట్రంలో భారత్ కూడా ఉండాలని పెట్టుబడిదారులు కోరుకుంటున్నారు. అందువల్లనే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నిర్మాణంలో భారత ఆర్థిక రంగాన్ని భాగస్వామిగా చేయాలనుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ రంగంలోని ఆర్థిక సంస్థలను ధ్వంసం చేయాలనుకుంటున్నారు.

**దీని ఫలితాలెలా ఉంటాయి?**

భారత్‌లో బ్యాంకింగ్, బీమా రంగాలను కుప్ప కూల్చేందుకు తీవ్ర ప్రయత్నాలు జరిగినా సాధ్యం కాలేదు. 2008లో చోటు చేసుకున్న పరిణామాలకు ప్రస్తుత ప్రయత్నాలు పూర్తిగా భిన్నమైనవి. పోగుబడిన సంపదను ఏదోచోట పెట్టుబడి పెట్టాలి. డెరివేటివ్స్ లాంటి వన్నీ కూడా పెట్టుబడి పెట్టేందుకు అనువైనవాటి అన్వేషణలో ఆవిష్కృతమైనవే. ఈ ప్రక్రియలో భాగంగానే బ్యాంకింగ్, బీమా, ఆర్థిక రంగాలు కుప్పకూలిపోతాయి. అమెరికాలో జరిగిందిదే. యూరప్ అంతటా ఇదే దుస్థితి కొనసాగింది. కానీ భారత్ మాత్రం ఆ ప్రమాదం నుంచి బయటపడగలిగింది. ఎందుకంటే భారత్ మార్కెట్ డెరివేటివ్స్ లాంటివాటిని అనుమతించేందుకు నేటికీ సిద్ధంగా లేదు. ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంకుల్లో ఇలాంటి ప్రయత్నాలకు యత్నించి విఫలమయ్యారు. అంటే అమెరికా, యూరప్‌ల జరిగిన పరిణామాలతో పోలిస్తే భారత బ్యాంకింగ్ రంగం పటిష్టంగా ఉంది. ఇప్పుడేమంటున్నారంటే భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భాగస్వామిగా చేస్తామంటున్నారు. అదే జరిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నడుపుతున్న ఫైనాన్స్ పెట్టుబడి ప్రభావం భారత ఆర్థికరంగంపై పడుతుంది. అందువల్లనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో భారత ఆర్థిక రంగాన్ని భాగస్వామిగా మార్చే ప్రయత్నాలను అడ్డుకొని, భారత ఆర్థిక రంగ సార్వభౌమత్వాన్ని పరిరక్షించుకునేందుకు సంఘటితంగా పోరాడాల్సివుంది.

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత ఆర్థిక రంగం భాగస్వామిగా ఉండాలని భారత బడా పెట్టుబడిదారులు కోరుకుంటున్నారా?**

కొంత కాలం వరకూ వాళ్లు కూడా విదేశీ పెట్టుబడులకు వ్యతిరేకంగా ఉండేవారు. పన్ను రాయితీలు, పరిరక్షణ విధానాల వల్ల భారత పెట్టుబడిదారులు సంపదను పోగేసుకోవడానికి, శక్తిమంతులు కావడానికి దోహదపడ్డాయి. భారత పెట్టుబడిదారుల వద్ద ఎప్పుడైతే ఇలా సంపద పోగుబడిందో అప్పటి నుంచి వారి వద్ద పోగుబడిన సంపదను పెట్టుబడి పెట్టే ప్రదేశాలు కావాలని కోరుకుంటారు. దీంతో మొదట సంస్కరణలు చేపట్టాలని, ప్రభుత్వ రంగాలను ప్రయివేటీకరించాలని కోరారు. ప్రభుత్వం కూడా వారు కోరుకున్నట్లుగానే నడుచుకుంటోంది. ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్య (పిపిపి) విధానమే దానికి నిదర్శనం. విమానశ్రయాలు, అన్ని మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పిపిపి పేరుతో ప్రయివేటు పరమైపోతున్నాయి. పన్ను రాయితీలు, ఇతర ప్రోత్సాహకాల మాటున ప్రస్తుతం భారత పెట్టుబడిదారుల వద్ద ఇదివరకు లేనంతగా పెట్టుబడి పోగుపడుతోంది. విస్మరించలేని రెండో అంశమేమిటంటే ఇప్పటికీ కూడా భారత పెట్టుబడిదారులు విదేశీ పెట్టుబడులను గట్టిగానే వ్యతిరేకిస్తున్నారు. అయితే సోవియట్ యూనియన్ పతనం తర్వాత ప్రపంచం ఏకధ్రువ ప్రపంచంగా మారిపోతూవచ్చింది. అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య పోటీ నెలకొనివున్నప్పుడు భారత పెట్టుబడిదారులకు లభించిన అవకాశాలు ఆ తర్వాత లేకుండాపోయాయి. దీంతోపాటు ఫైనాన్స్ పెట్టుబడి చాలా శక్తివంతంగా మారింది. అంతేకాదు ఫైనాన్స్ పెట్టుబడి పాత్ర స్వభావమూ మారింది. గతంలో ఫైనాన్స్ పెట్టుబడి జాతీయ పెట్టుబడిగా ఉండేది. బ్రిటన్ పెట్టుబడి, జర్మనీ పెట్టుబడి, అమెరికా పెట్టుబడి ఇలా జాతీయ పెట్టుబడిగా ఉండేది. అయితే బహుళ జాతి సంస్థల విస్తరణ తర్వాత పెట్టుబడి అనేది ఏ ఒక్క దేశానికో పరిమితం కాలేకపోయింది. వాస్తవానికి అది అంతర్జాతీయ పెట్టుబడిగా మారిపోయింది.

ఈ ప్రత్యేక సమయంలోనే ఫైనాన్స్ పెట్టుబడిని అడ్డుకోవడం సాధ్యంకాదని భారత పెట్టుబడి దారులు గ్రహించారు. ఎందుకంటే ఫైనాన్స్ పెట్టుబడి విస్తారమైనది.

ఉదాహరణకు జిఇ(జనరల్ ఎలక్ట్రికల్స్) కంపెనీ టర్నోవర్ తీసుకుంటే చాలా దేశాల బడ్జెట్‌ల కంటే ఎక్కువగా ఉంటుంది. అందువల్ల దానిని నిలువరించడం సాధ్యపడదు. ఫైనాన్స్ పెట్టుబడిని అడ్డుకోవడం సాధ్యపడదు కాబట్టి

> **"ఉదాహరణకు రెండు ముఖ్య రంగాలు ప్రస్తావిస్తాను. ఒకటి ఎలక్ట్రానిక్స్, రెండోది శీతల పానీయాలు. ఈ రెండు రంగాల్లో భారత కంపెనీలు ఎక్కడున్నాయి. శీతల పానీయాలు తీసుకోండి దేశీయంగా ఉన్న శీతల పానీయాల తయారీ పరిశ్రములను కూలదోసి మార్కెట్ అంతటినీ పెప్సీ, కోకాకోలాలే ఆక్రమించేశాయి."**

జిఇ లాంటి కంపెనీల్లో జూనియర్ భాగస్వామిగా ఎందుకు చేరిపోకూడదు అని భావించారు. అందువల్ల అంతర్జాతీయ పెట్టుబడిలో భారత పెట్టుబడిదారులు జూనియర్ భాగస్వాములుగా చేరిపోయారు.

**బడా పెట్టుబడిదారులు, ఆ మాట కొస్తే ప్రభుత్వ పెద్దలు కూడా ఈ విధానాలకు ప్రత్యామ్నాయం లేదని చెబుతున్నారు కదా. అది వాస్తవమేనా?**

టెక్నాలజీ వల్ల ప్రపంచీకరణ వచ్చింది. టెక్నాలజీని ఆపలేము కదా, పైగా ప్రపంచీకరణ ఫైనాన్స్ పెట్టుబడిని అందిస్తోంది కాబట్టి ఈ విధానాలకు ప్రత్యామ్నాయం లేదని వారంటున్నారు. అందువల్ల భారత్ కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భాగస్వామిగా ఉండాల్సిందే అంటున్నారు. వారంటున్నదాంట్లో మనకు సమస్యలేదు. ఫైనాన్స్ పెట్టుబడి కోసం ఆవురావురంటున్నారు. పెట్టుబడులు కోసం మనం పరుగులు తీయడం కాదు. ఫైనాన్స్ పెట్టుబడి కూడా పెట్టుబడి పెట్టే ప్రదేశాల కోసం ఆవురావురుమంటూ వేట సాగిస్తూవుంటుంది. ఈ నేపథ్యంలో 'ఇదిగో ఈ రంగంలో పెట్టుబడి పెట్టుకోండి..ఈ రంగంలో మేము అనుమతిం బోం' అని మన పాలకులు ఎందుకు నికరంగా నిలబడరనేది అసలు ప్రశ్న. మనం ప్రశ్నించేది అదే. రండి పెట్టుబడులు పెట్టండి. పరిశ్రమలు ఏర్పాటు చేయండి. ఉపాధి సృష్టించండి అని కోరితే మనమేమి వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. భారతదేశ అభివృద్ధి మన లక్ష్యం. కానీ ఫైనాన్స్ పెట్టుబడి అనేది లాభాల కోసం వస్తుందే తప్ప మన దేశ ప్రయోజానాలు ఆశించి కాదనేది గమనంలో ఉంచుకోవాలి. కొత్త పరిశ్రమలేవీ ఏర్పాటు చేయకుండా దేశంలో ఇప్పటికే బాగా అభివృద్ధి చెందిన పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టి లాభాలు దండుకుంటామంటే దానికి మనం అంగీకరించం. ఉదాహరణకు రెండు ముఖ్య రంగాలు ప్రస్తావిస్తాను. ఒకటి ఎలక్ట్రానిక్స్, రెండోది శీతల పానీయాలు. ఈ రెండు రంగాల్లో భారత కంపెనీలు ఎక్కడున్నాయి. శీతల పానీయాలు తీసుకోండి దేశీయంగా ఉన్న శీతల పానీయాల తయారీ పరిశ్రములను కూలదోసి మార్కెట్ అంతటినీ పెప్సీ, కోకాకోలాలే ఆక్రమించేశాయి. భారత కంపెనీ ఒక్కటీ లేదు. అదేవిధంగా అనేక దేశీ బ్రాండ్ టీవీలుండేవి. ఇప్పుడు ఆ టీవీలన్నీ ఏమయ్యాయి. భారత టీవీలెక్కడు న్నాయి. భారతీయ రిఫ్రిజిరేటర్లు ఎక్కడున్నాయి. ఫైనాన్స్ పెట్టుబడిని వాటిని మింగేసింది. ఇలా ఒకటి తర్వాత ఒకటి భారత పారిశ్రామిక రంగాలిన్నిటినీ ఫైనాన్స్ పెట్టుబడి ఆక్రమించు కుంటూ పోతే యావత్ భారత ఆర్థిక రంగమంతా విదేశీ పెట్టుబడి కబంధ హస్తాల్లో బంధీ అయిపోతుంది. అందువల్ల దానిని మనం తీవ్రంగా వ్యతిరేకిస్తాం. ఇది న్యాయసమ్మతమైనది కాదని చెబుతాం.

మరి ప్రత్యామ్నాయమేంటి? మన ఆర్థిక వ్యవస్థ పెరిగితే, పెరగడమంటే ఫైనాన్స్ పెట్టుబడి పెరగడం కాదు. ప్రజల కొనుగోలు శక్తి ఆధారంగా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందాలి. అలా ప్రజల కొనుగోలు శక్తి పెరగాలంటే ముందు వారికి ఉద్యోగాలివ్వాలి. ఉద్యోగాలు ఇవ్వండి. ఆ దిశగా పెట్టుబడులు పెట్టండి. మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టండి. అప్పుడు ఆటోమేటిక్‌గా భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ బలపడితే అప్పుడు మనం ఏ రంగంలో ఫైనాన్స్ పెట్టుబడిని ఆహ్వానించాలి. ఎలాంటి షరతులు విధించాలని అనేది మన చేతుల్లో ఉంటుంది.

**2008లో సంక్షోభం వచ్చినప్పుడు దాదాపు అన్ని దేశాలు ప్రభావితమయ్యాయి. ఇతర దేశాలపై ఉన్నంత తీవ్రంగా భారత్‌పై ఎందుకని దాని ప్రభావం పడలేదు?**

భారతదేశం కూడా ప్రభావిత మైంది. మొత్తం ప్రపంచమంతా సంక్షోభంలో ఉన్న సందర్భంలో భారత్ ఒక్కటే బతికిబట్ట కట్టలేదు కదా. కొన్నేళ్లుగా దేశీయ డిమాండ్ ఆధారంగా ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయటానికి బదులు విదేశీ డిమాండ్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోంది. ఎగుమతుల ఆధారిత ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రయత్ని స్తున్నాం. దాంతో పాటు రుణ ఆధారిత ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రయత్ని స్తున్నాం. ఈ రెండు అంశాలు కూడా భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపాయి. మన ఉత్పాదనలు ఎవరైతే కొంటారో వాళ్లు సంక్షోభంలో ఉంటే ఎగుమతలను, ఇతర నిత్యావసరాలను ఎలా కొనగలరు. అది సాధ్యం కాదు. ఎగుమతులు పడిపోయినప్పుడు అర్థిక వ్యవస్థ పైనా ప్రభావం పడుతుంది. దీనికి సంబంధించి రెండో అంశమేమిటంటే, నువ్వు ఒక్కసారి ఎగుమతులపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసిన తర్వాత స్థానిక అవసరాలకు అనుగుణమైన ఉత్పాదనలు చేసే సామర్థ్యం ఉండదు. అందువల్ల పారిశ్రామిక ఉత్పాదకత క్షీణించిపోతుంది. అందువల్ల సంక్షోభ ప్రభావం కచ్చితంగా ఉంటుంది. మరో కీలకమైన అంశం ఇప్పుడు ఆర్థిక వ్యవస్థ అంతా రుణాధారితంగా వృద్ధి చెందుతోంది. ప్రతి దానికీ రుణాలిచ్చేసి దాని ద్వారా ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయాలనుకుంటున్నారు. ఇలా రుణాలు తీసుకున్న ప్రజలు ఉద్యోగాలు కోల్పోతే రుణాలు కట్టలేక

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

**'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

అప్పులలో కూరుకుపోతారు. ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. అందువల్ల సంక్షోభం నుంచి భారత్ బయటపడగలిగినా అభివృద్ధి వేగం అందుకోలేకపోయింది. అందువల్లే 2007లో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఇప్పటికీ అందుకోలేక పోతున్నాం. అందువల్ల ఈ సంక్షోభానికి భారత ప్రజలు మూల్యం చెల్లించే దురవస్థ తీసుకురావద్దని, భారత బీమా కంపెనీలను బలి చేయొద్దని చెబుతున్నాం. ప్రభుత్వ నియంత్రణలో ఉన్న బీమా, బ్యాంకింగ్ కంపెనీలను అమెరికా, పశ్చిమ దేశాల్లో మాదిరి ప్రయివేటుకు బలి చేయొద్దంటున్నాము.

**మోడీ ప్రభుత్వం చాలా ఉత్సాహంగా ఎఫ్‌డిఐలను ఆహ్వానిస్తోంది. భారత అభివృద్ధిలో ఎఫ్‌డిఐల పాత్ర ఏమిటి?**

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ)పై ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా చర్చ నడుస్తోంది. అధ్యయనాలు జరుగుతున్నాయి. అభివృద్ధిలో ఎఫ్‌డిఐల పాత్ర చాలా నామమాత్ర మేనని చాలా అధ్యయనాలు తేల్చి చెప్పాయి. ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలు చేకూర్చేవి కచ్చితంగా దేశీయ పొదుపు సొమ్ము మాత్రమే. ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యధిక పొదుపు సొమ్ము ఉన్న దేశాల్లో భారత్ ఒకటిగా కొనసాగు తోంది. ఒక దశలో స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 36 శాతంగా ఈ పొదుపు సొమ్ము ఉండేది. ఇప్పుడు 30 శాతం మధ్యన కొనసాగు తోంది. కుటుంబాల పొదుపు 27 శాతం వరకు ఉంటోంది. అందువల్ల విదేశీ పెట్టుబడులపై ఆధారపడటం కంటే ఈ పొదుపు సొమ్ముపైనే ఎక్కువగా ఆధారపడాలి. ఇదంతా మన సొమ్ము. మన పొదుపు సొమ్ము మనం వాడుకోకుండా విదేశీ పెట్టుబడి సంస్థలకు కట్టపెట్టేందుకు చూడటమేంటనేది ప్రశ్న. బ్యాంకులను ప్రయివేటీ కరించడం, బీమా కంపెనీలను ప్రయివేటీకరిం చడం వల్ల వచ్చే విదేశీ కంపెనీలు మన పొదుపు సొమ్మును కొల్లగొట్టేందుకు వస్తాయే తప్ప మనకేవో ప్రయోజనాలు చేకూర్చేందుకు రావు. మన పొదుపు సొమ్మును వారికి ఎందుకు కట్టబెట్టాలి. ఈ పొదుపు సొమ్ముతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రయత్నిం చాలి. ఇదేమంత కష్టం కాదు. అంతేకాని విదేశీ పెట్టుబడులపై ఆధారపడటం మన ఆర్థిక వ్యవస్థకు ఏమాత్రమూ ఆరోగ్యకరం కాదు.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులనేవి కచ్చితంగా మార్జిన్ల కోసమే వస్తాయి. లాభాలు దండుకొని వెళ్తాయి. వ్యవసాయ పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఏ విదేశీ పెట్టుబడి సంస్థ ముందుకొస్తుందో చెప్పండి. ఏ కంపెనీ కూడా రాదు. ఈ నేపథ్యంలో పొదుపు సొమ్ము లో కచ్చితంగా ప్రభుత్వ జోక్యం తప్పనిసరి. ప్రభుత్వ ఆజమాయిషిలోనే ఉండాలి తప్ప విదేశీ కంపెనీలకు కట్టబెట్టకూడదు.

> **"బ్యాంకులను ప్రయివేటీకరించడం, బీమా కంపెనీలను ప్రయివేటీకరిం చడం వల్ల వచ్చే విదేశీ కంపెనీలు మన పొదుపు సొమ్మును కొల్లగొట్టేందుకు వస్తాయే తప్ప మనకేవో ప్రయోజనాలు చేకూర్చేందుకు రావు. మన పొదుపు సొమ్మును వారికి ఎందుకు కట్టబెట్టాలి. ఈ పొదుపు సొమ్ముతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రయత్నించాలి."**



సంస్కరణల దుష్ఫలితాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళా కార్మికులు

**వినాశకర ఈ ఆర్థిక విధానాల పట్ల ప్రపంచ, భారత కార్మికవర్గం ఏవిధంగా స్పందిస్తున్నది?**

ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలుగా పోరాటాలు జరుగుతున్నాయి. అయితే సంక్షోభాలు వచ్చిన సందర్భాల్లో ఎక్కువ నష్టపోయేది కార్మికులే. వేతనాలు, పెన్షన్లు తగ్గిపోతాయి. ఉద్యోగాలు ఊడుతాయి. వేతనాల కోసం, పింఛన్ల కోసం ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గం ఉధృతంగానే ఉద్యమిస్తున్నా విప్లవస్ఫూర్తి కనిపించడం లేదు. పైగా ఇప్పటి ఉద్యమాలు వ్యవస్థను సవాలు చేసే రీతిలో కాకుండా వ్యవస్థకు లోబడే సాగు తున్నాయి. ఆక్యుపై వాల్‌స్ట్రీట్ ఉద్యమాన్ని తీసుకున్నా, యూరప్‌లో జరిగిన ఏ ఉద్యమమైనా ఆయా దేశాల వ్యవస్థలకు లోబడే సాగాయి మినహా ఆ వ్యవస్థలకు సవాలుగా జరగలేదు. ఎందుకంటే కొన్నేళ్లుగా కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడుతూ విప్లవ పథాన పయనించేవారి సంఖ్యను తగ్గిస్తూ వచ్చింది. వ్యవస్థను సవాలు చేసే విప్లవతత్వం యవనికలోకి వస్తే మినహా సంస్కరణలకు ఉద్యమాలతో సరైన సమాధానం లభించదు.

భారతదేశంలో అలాంటి విప్లవ తత్వంతో కూడిన ఉద్యమాలను నిర్మించేందుకు మేము ప్రయత్నిస్తున్నాము. ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని సరళీకరించాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తూ వస్తున్నా సంపూర్ణంగా సఫలం కాలేకపో తున్నాయి. అఖిల భారత స్థాయిలో కార్మికుల ఐక్య పోరాటాల వల్లే ఇది సాధ్యపడింది. అందువల్లే ఇప్పటికి కూడా పెద్ద మొత్తం సంస్థ లు ప్రభుత్వాధీనంలో ఉన్నాయి. ఆర్థికవ్యవస్థలోని కీలక రంగాలు ప్రభుత్వ యాజమాన్యంలోనే కొనసాగుతున్నాయి. ఈ పోరాటాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముంది. కార్మికోద్యమంలో మార్పు కనిపిస్తోంది. కార్మికవర్గాన్ని చూస్తే అధికశాతం అసంఘటిత కార్మికులే ఉన్నారు. వీరంతా కూడా చాలా తీవ్రంగానే సమస్యలపై పోరాడుతున్నారు. గోడకేసి బాదాలని చూస్తే అంతే తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో హింసాత్మక ఘటనలూ చోటుచేసుకుంటున్నాయి. గుర్గావ్, బెంగళూరు ఘటనలు మనం చూశాం. ఈ ఉద్యమాలన్ని సంఘటితం చేసి రాజకీయ రూపం ఎలా తీసుకురావాలనేదే భారతదేశ కార్మికోద్యమం ముందున్న అతిపెద్ద సవాలు. ఆర్థిక పరమైన డిమాండ్లు ముందుకొచ్చినప్పుడు పెద్ద ఎత్తున్న కార్మికులు ఉద్యమిస్తున్నారు. కానీ ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రం అది కనిపించదు. తమతమ కులాలకు, మతాలకు, లేదా వారికిష్ట మైన పార్టీల వైపే నిలబడతారు. ఇది మారా లంటే వారిలో రాజకీయ అవగాహన పెంచా ల్సిన అసరముంది. ఇది ఇప్పటికిప్పుడు అయి పోయేది కాదు. దానికి సమయం పడుతుంది.

**అనువాదం : బి. అమరనారాయణ**

# ఉన్నత విద్యలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు

**నరేందర్ ఠాకూర్**

ఉన్నత విద్యా విధానం విషయంలో యన్‌డిఎ ప్రభుత్వం తన ముందున్న ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని కొనసాగిస్తున్నది. ప్రైవేటీకరణ ప్రభుత్వ ప్రాధాన్యతా విధానంగా మిగిలిపోయింది. ఫోర్ ఇయర్ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ (యఫ్‌వైయుపి)ను రద్దు చేసినప్పటికీ, యన్‌డిఎ ప్రభుత్వం రూపొందించిన ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్( సిబిసియస్) కూడా విద్యారంగంపై ప్రైవేటీకరణను రుద్దటానికే రూపొందించబడింది.

2014లో కేంద్రంలో ప్రభుత్వం మారినప్పటికి, ఉన్నత విద్యా విధానానికి సంబంధించిన ఆర్థిక సూత్రాలలో ఏ విధమైన మార్పును మనం చూడలేము. నయా సాంప్రదాయిక విధాన చట్రంలో ఉన్నత విద్యను లాభదాయకమైన, అమ్మకం, కొనుగోలు చేసే వాణిజ్య సరుకుగా మార్చటం లక్ష్యంగా ఒకదాని తర్వాత ఒకటిగా వస్తున్న ప్రభుత్వాలు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నాయి. ఉన్నత విద్యను సరళీకరణ చేయడానికి గత రెండు దశాబ్దాల కాలంలో పాలకవర్గాల మధ్య ఏకాభిప్రాయం రావటాన్ని చూడవచ్చు. యుపిఎ ప్రభుత్వం 2013లో ప్రవేశపెట్టిన నాలుగు సంవత్సరాల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ అయినా, 2015లో యన్‌డిఎ ప్రభుత్వం ప్రారంభించిన ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ అయినా ఉన్నత విద్యలో ప్రవేటీకరణను సులభతరం చేయడం లక్ష్యంగా పాఠ్యాంశాలలో మార్పులు చేస్తున్నారు.

2005లో దోహాలో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ బహుళపక్ష వాణిజ్య చర్చలలో దేశంలోని ఉన్నత విద్యారంగ ఉప విభాగాల మార్కెట్‌లోకి ప్రవేశం కల్పిస్తామని భారత ప్రభుత్వం అంగీకరించటమే వరుసగా వస్తున్న ప్రభుత్వాల విధానాలలోని ఏకీభావానికి కారణం. వివిధ అంశాలను ముందుగా చక్కదిద్దాల్సిన అవసరం ఉన్నందున గత పది సంవత్సరాలలో ఈ ప్రతిపాదన ఆచరణలోకి రాలేదు. ఉన్నత విద్యను వాణిజ్య సరుకుగా మార్చటానికి అనుగుణంగా చట్టాలను మారుస్తున్నారు. ప్రైవేటు సంస్థలకు నష్టం కలిగేలా ప్రభుత్వ ఖర్చుతో నడుస్తున్న సంస్థలకు సబ్సిడీలు ఇవ్వబోమని ప్రభుత్వం ప్రైవేటు వారికి హామి ఇచ్చింది.

ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఉన్నత విద్యాసంస్థలలోకి ప్రజల ప్రవేశాన్ని పరిమితం చేయటానికి నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం 32 శాతం మంది మాత్రమే వీటిలో చేరుతున్నారు. అదే సమయంలో పాఠశాల విద్యతో పాటు ఉన్నత విద్యలో కూడా తమ వాటాను మరింతగా పెంచుకోవడానికి ప్రైవేటు రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ప్రైవేటు సంస్థలలో చేరే విద్యార్థుల సంఖ్య 68 శాతానికి పెరిగింది. ఉన్నత విద్యారంగాన్ని లాభదాయకమైన, వాణిజ్య సరుకుగా మార్చాలన్న దృఢ నిర్ణయంతో ప్రభుత్వం అమలు జరుపుతున్న రహస్య ఎజండాను ఇది స్పష్టం చేస్తున్నది. ఇటీవల ప్రారంభించిన రెండు విద్యారంగ సంస్కరణల కార్యక్రమాలైన యఫ్‌వైయుపి, సిబిసియస్‌లపై కేంద్రీకరించి భారత ఉన్నత విద్యారంగంలో సంస్కరణలను, పునర్వ్యవస్థీకరణ ప్రయత్నాలను ఈ వ్యాసంలో చర్చించడానికి ప్రయత్నిస్తాను.

**యఫ్‌వైయుపి**

యుపిఎ 2 ప్రభుత్వం సంస్కరణలను అమలు చేసే పేరుతో 2013–14 విద్యా సంవత్సరం నుండి ఢిల్లీ విశ్వవిద్యాలయంలో యఫ్‌వైయుపిని ప్రవేశపెట్టటానికి పూనుకున్నది. 2014–15లో యన్‌డిఎ ప్రభుత్వం దీనిని రద్దు చేసింది. ఉన్నత విద్యలో నాలుగు సంవత్సరాల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సును ప్రారంభించటం వెనుకనున్న భావం దేశంలో ఉన్నత విద్యారంగ నిర్మాణాన్ని ప్రపంచ ఉన్నత విద్యారంగ నిర్మాణానికి అనుగుణంగా మార్పు చేయటం, వృత్తివిద్యా కోర్సులలో యువత నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవటం కోసం కీలకమైన కోర్సులను భాగంగా చేయటం ఉన్నాయి.

ఢిల్లీ విశ్వవిద్యాలయం యొక్క ఎంపిక ప్రధానంగా రెండు అంశాల ఆధారంగా జరిగింది. మొదటిది : రాజధాని నగరంలో అనేక అనుబంధ కళాశాలలు ఉన్నాయి. రెండవది, భారతదేశంలో డిగ్రీ పూర్వ విద్యార్థులు చేరే శాతం చాలా ఎక్కువగా ఉన్నది. 2012–13లో 79 శాతం మంది చేరారు. భారతదేశంలో కొన్ని కళాశాలలు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులతో పాటు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను కూడా అందిస్తున్నాయి. మొత్తం నమోదైన వారిలో పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు 11 శాతంగా ఉన్నారు. 2012–13లో మొత్తం నమోదైన వారిలో అండర్ గ్రాడ్యుయేట్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు కలిపి 90 శాతం ఉన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో సంస్కరణలు ప్రవేశ పెట్టటానికి యుపిఎ–2 ప్రభుత్వానికి ఇది ప్రేరణ కలిగించి ఉండవచ్చు.

**సిబిసియస్**

యన్‌డిఎ ప్రభుత్వం యఫ్‌వైయుపిని రద్దు చేసిన తర్వాత సిబిసియస్‌ను పరిచయం చేస్తూ సంస్కరణలను ప్రారంభించింది. ఒక విధంగా చూస్తే భారత ఉన్నత విద్యా వ్యవస్థలో విధాన నిర్ణయాలు తీసుకొనే స్థాయిలో సంస్కరణలకు యుపిఎ 2 ప్రభుత్వం పునాది వేసింది. ఎన్‌డిఎ ప్రభుత్వం కూడా కొత్తదైనా ఇలాంటి ప్రణాళికతోనే ఉన్నత విద్యా వ్యవస్థలో సంస్కరణలను అమలు చేయడానికి ముందు కొచ్చింది. మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ 2014– 15 వార్షిక నివేదికలో ఉన్నత విద్యావ్యవస్థను పునర్వ్యవస్థీకరించటాన్ని గురించి నొక్కి చెప్పింది. భారతదేశ విశ్వ విద్యాలయాలలో అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో సిబిసియస్‌ను ప్రవేశ పెట్టటంతో సహా వరుస క్రమంలో అనేక చర్యలను ప్రతిపాదించింది.

2015–16 విద్యా సంవత్సరం నుంచి భారతదేశంలో తక్షణమే సిబిసియస్‌ను అమలు చేయటం, లేదా పరిచయం చేయటం చేయాలని ప్రభుత్వ నిధులతో నడిచే కేంద్ర, రాష్ట్ర విశ్వ విద్యాలయాల్లోని వైస్ ఛాన్సలర్లందరికీ యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. భారతదేశంలో స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే ఉన్నత విద్యా సంస్థలు కేవలం ప్రభుత్వ

రాజకీయ ఎజెండాను అమలు చేయటం కోసం పనిచేస్తున్నాయన్నది ఆసక్తికరమైన విషయం. రాజకీయంగా భిన్న దృక్పథాలతో ఉన్నా ఆర్థికంగా ఒకే విధమైన భావజాలంతో ఉన్న రెండు ప్రభుత్వాలు ఒకే విధమైన పోలికలున్న రెండు విద్యా కార్యక్రమాలను(యఫ్‌వైయుపి, సిబిసియస్) ప్రారంభించాయి. వాటిలోని ముఖ్యాంశాలను పరిశీలించవలసిన అవసరం ఉంది.

**యఫ్‌వైయుపి సిబిసియస్**

మొదటి నుండి ఉన్న యఫ్‌వైయుపి, ప్రస్తుత సిబిసియస్ కొన్ని సారూప్యతలు కలిగి ఉన్నాయి. యుపిఎ ప్రభుత్వం యఫ్‌వైయుపిని, ఎన్‌డిఎ ప్రభుత్వం సిబిసియస్‌ను అతురతతో ప్రారంభించాయి. రెండు కార్యక్రమాలు నయా ఉదారవాద ఆర్థిక చట్రంపై ఆధారపడి ఉన్నాయి. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల కాలంలో ఒకచోటు నుండి మరోచోటికి మారటం లక్ష్యంగా యఫ్‌వైయుపి భారత ఉన్నత విద్యా వ్యవస్థను ప్రామాణికీకరించటానికి, దానిని అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా తీసుకొని రావడానికి ప్రయత్నించింది. ఒక కోర్సు నుండి మరో కోర్సుకు, ఒక సబ్జెక్టు నుండి మరో సబ్జెక్టుకు, ఒక డిపార్ట్‌మెంటు నుండి మరో డిపార్ట్‌మెంటుకు మారటానికి, దేశంలో ఒక కళాశాల నుండి మరో కళాశాలకు, ఒక విశ్వ విద్యాలయం నుండి మరో విద్యాలయానికి మారే స్వేచ్ఛను సిబిసియస్ విద్యార్థులకు కల్పిస్తున్నది.

రెండు కార్యక్రమాలను పై నుండి కిందకు అమలు చేసే విధానాన్ని అనుసరించారు. విద్యా విధానంలో ప్రధాన భాగస్వాములైన ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యావేత్తలు, సమాజ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవటాన్ని, క్రింద నుండి పైకి అమలుచేసే విధానాన్ని పరిశీలించటాన్నివిస్మరించింది. యఫ్‌వైయుపిలో వలెనే సిబిసియస్‌లో బిఎ(వృత్తి) వంటి కోర్సుల్లో

**"రెండు కార్యక్రమాలను పై నుండి కిందకు అమలు చేసే విధానాన్ని అనుసరించారు. విద్యా విధానంలో ప్రధాన భాగస్వాములైన ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యావేత్తలు, సమాజ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవటాన్ని క్రింద నుండి పైకి అమలుచేసే విధానాన్ని పరిశీలించటాన్ని విస్మరించింది."**



**యఫ్‌వైయుపి సంస్కరణలను అమలు జరిపిన ఢిల్లీ యూనివర్శిటీ**

బహుళ నిష్క్రమణ అవకాశాలను కల్పించారు. రెండింటిలోనూ ఉపాధ్యాయులపై పని భారాన్ని అనిశ్చితంగా వదిలివేయటం ఉపాధ్యాయులను తాత్కాలిక పద్ధతిలో తీసుకోవటానికి (క్యాజువలైజేషన్) దారి తీసింది. యఫ్‌వైయుపి, సిబిసియస్ ఈ రెండింటి అమలు సందర్భాలలోనూ ఒక విద్యా సెషన్‌లో బహుళ కోర్సులను అధ్యయనం చేయటం, టైమ్‌టేబుల్ సంక్లిష్టత వలన అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలపై ఒత్తిడి పెరిగింది.

ఈ రెండు కార్యక్రమాలు చాలా అంశాలలో విభిన్నంగా ఉన్నాయి. అయితే సిబిసియస్ భారతదేశంలోని అన్ని కళాశాలలు, రాష్ట్ర విశ్వ విద్యాలయాలలో అమలుకాగా, యఫ్‌వైయుపి ఢిల్లీచ యూనివర్శిటిలో మాత్రమే అమలు జరిగింది. సిబిసియస్ కోర్సుల సిలబస్‌ను కేంద్రం నుండి యుజిసి రూపొందిస్తున్నది. దానిని 20 నుండి 30 శాతం వరకు మాత్రమే సవరించు కొనేందుకు యూనివర్సిటీలకు అవకాశం ఇచ్చారు. యఫ్‌వైయుపి కోర్సులను, సిలబస్‌ను పూర్తిగా ఢిల్లీ విశ్వ విద్యాలయమే రూపొందిం చింది. యఫ్‌వైయుపిలో బిఎ (వృత్తి) కోర్సు లేనప్పటికి నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్ వర్క్‌లో భాగంగా యుజిసి సిబిసియస్‌తో పాటు బిఎ (వృత్తి) కోర్సును కూడా ప్రవేశపెట్టింది. ఉపాధ్యాయులు, వృత్తివిద్యా కోర్సులలో శిక్షణ పొందుతున్న విద్యార్థుల సాయంతో నైపుణ్యాన్ని అభివృద్ధి చేయటంపై కేంద్రీకరించింది. యఫ్‌వైయుపిని ప్రవేశపెట్టినపుడు కొన్ని విద్యార్థి సంఘాలు, కొంతమంది ఉపాధ్యాయులు దానిని వ్యతిరేకించారు. సిబిసియస్‌ని మెజారిటీ విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయులు వ్యతిరేకించారు. అప్పుడు సారాంశం (కంటెంట్) పరంగా చూస్తే యఫ్‌వైయుపి పరిశోధనకు( రీసెర్చి) అనుగుణమైన కోర్సులను అందించగా, సిబిసియస్ అందించే వాటిలో పరిశోధనకు అవసరమైన సారాంశం లేదు. ఇప్పటి వరకు మార్కులు లేదా శాతాల ఆధారంగా విద్యార్థులను అంచనా వేస్తున్నారు. ఇప్పుడు సిబిసియస్ క్రెడిట్ సిస్టమ్ ఆధారంగా విద్యార్థులను అంచనా వేసే పద్ధతిని ప్రారంభిస్తున్నది.

**ముగింపు**

ప్రైవేటు రంగం, ప్రపంచ వాణిజ్య సంస్థ ఒత్తిడి వలన ఉన్నత విద్యా వ్యవస్థను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వాలు తొందర పడుతున్నాయని పై చర్చ వలన స్పష్టంగా గ్రహించవచ్చు. యఫ్‌వైయుపి, సిబిసి యస్‌ల ద్వారా సంస్కరణలను రుద్దుతూ, సంస్క రణలను అమలు చేసే క్రమంలో కింది నుండి ప్రారంభించి పై వరకు అమలుచేసే విధానం కాకుండా పైనుండి క్రిందికి అమలుచేసే కేంద్రీ కృత విధానాన్ని అమలు చేస్తున్నారు. యఫ్‌వై యుపి లేక సిబిసియస్‌లు భారత ఉన్నత విద్యా వ్యవస్థలో మార్కెట్ ఆధారిత సంస్కరణలకు సాధనాలుగా ఉన్నాయి. ఇవి ఉన్నత విద్యను వినియోగ వస్తువుగా మార్చటానికి ఉపయోగ పడతాయి మినహా విద్యార్థులు, ఉపాధ్యాయుల శక్తి సామర్థ్యాలను పెంపొందించవు. అసమానతలున్న సమాజంలో ఉన్నత విద్యా విధానాన్ని రూపొందించి, దానిని సమర్థవంతంగా అమలు చేయటం కోసం సమాజంలో పెద్ద భాగంగా ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యా వేత్తలతో సక్రమంగా సంప్రదించి, వారిని విశ్వాసంలోకి తీసుకోవాలి.

**(అనువాదం : సింహాద్రి ప్రతిభ)**

## సవరణ

'మే'నెల సంచికలో ప్రచురించిన 'నేను కమ్యూనిస్టును కాకపోతిని' వ్యాసాన్ని తెలకపల్లి రవిగారు రచించారు. పొరపాటుగా వేరేవారి పేరుతో ప్రచురితమైంది. పొరపాటుకు చింతిస్తున్నాము.

<u>గమనిక :</u> 'మే'నెల సంచికలో ప్రచురించిన ప్రకాష్ కరత్ రచించిన 'అంబేద్కర్ తిరుగుబాటు దృక్పథాన్ని పరిరక్షించుకుందాం' వ్యాసాన్ని సింహాద్రి సరోజిని అనువాదం చేశారు.

అనిందితసేన్ గుప్తా రచించిన 'అభివృద్ధిలో వెనుకవరుసన మహిళా శ్రేయస్సు' వ్యాసాన్ని డా॥ శమంతకమణి అనువాదం చేశారు.

# చరిత్రకారులపై ఎందుకీ దాడి!



రచయిత్రి ప్రముఖ పాత్రికేయురాలు

టికె రాజాలక్ష్మి

జాతీయతావాదంపై ఇంకా చర్చ పూర్తికాకుండానే ఒక చరిత్ర పుస్తకంలో భగత్‌సింగ్ యొక్క పాత్ర చిత్రీకరణపై ఒక కొత్త వివాదం ప్రారంభమైంది. విద్యా వ్యవస్థలో చారిత్రక తప్పులను సరిచేయటానికి బి.జె.పి. నాయకత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం దృఢంగా పూనుకోవటం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంలో కొత్త మలుపు తిరిగింది. ఏప్రిల్ 27వ తేదీన జాతి నిర్మాణంలో చరిత్ర యొక్క పాత్ర గురించి మాట్లాడే సందర్భంలో ఫిబ్రవరిలో జె.ఎన్.యు.లో జరిగిన సంఘటనలను ప్రస్తావిస్తూ బి.జె.పి. ఎం.పి. అనురాగ్ ఠాగూర్ ప్రముఖ చరిత్రకారుడు బిపన్ చంద్ర, మరి నలుగురిచే రచించబడిన ఒక చరిత్ర పుస్తకంపై తీవ్రస్థాయిలో దాడి చేశాడు. ఆ పుస్తకంలో భగత్‌సింగ్‌ను 'విప్లవ తీవ్రవాది' గా పేర్కొన్నాడని, ఆ ప్రొఫెసర్‌లు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీని చరిష్మా గల నాయకుడని వర్ణించినట్లు ఆరోపించాడు. 1857 నుండి 1947 కాలాన్ని వివరించిన ఆ పుస్తకం 'భారత స్వాతంత్ర్య పోరాటం' పేరుతో 1988లో ప్రచురించబడింది. ఆ పుస్తకం ప్రతులు ఇప్పటికే ఒక లక్షపైగా అమ్మబడినాయి. 'తీవ్రవాది' అనే పదాన్ని ఉపయోగించడమనే దానిపైనే చర్చ. ఆ పుస్తకం 1947 వరకు జరిగిన ఘట్టాలకు సంబంధించినదైనపుడు, కొందరు ప్రస్తుత నాయకులను చరిష్మా గల నాయకులుగా చరిత్రకారుడు అభివర్ణించడం సహేతుకం కాదు అని ఆ ఎం.పి. ఆరోపించాడు.

ఈ పుస్తకం ఢిల్లీ యూనివర్శిటీకి చెందిన 'హిందీ ఇంప్లిమెంటేషన్ బోర్డ్' చేత 1990లో హిందీలోకి అనువదించబడి ప్రముఖమైన రచనగా పేరొందింది. తప్పుగా ఉపయోగించబడ్డాయన్న పదాల వలన కలకలం సృష్టించబడటంతో, అవి ఏ సందర్భంలో ఉపయోగించబడినాయో టి.వి. ఛానళ్ళ ద్వారా చరిత్రకారులు వివరణ ఇచ్చారు. అయినప్పటికి వారు నిరంతరం విమర్శించబడుతున్నారు. జాతీయతావాదం, జాతి వ్యతిరేకతకు మధ్య జరుగుతున్న చర్చ కొత్త రూపు సంతరించుకున్నట్లుగా ఉంది. మళ్ళీ కొత్తగా భగత్‌సింగ్‌ను రాజకీయం చేయడం ప్రారంభమైంది. వలసవాద,సామ్రాజ్యవాదానికి సంబంధించిన సందర్భం పుస్తక నేపథ్యం అనేది ఆ పుస్తక విమర్శకులకు సంబంధించినంత వరకూ అంత ప్రాముఖ్యత ఉన్న విషయం కాదు. ఈ విషయం రాజ్యసభలో లేవనెత్తబడినపుడు డిప్యూటీ చైర్మన్ పి.జె.కురియన్ "విప్లవ తీవ్రవాది" అనే పదం ఉపయోగించడం పట్ల స్పందించి, ఆ పదాన్ని పుస్తకం నుండి తొలగించమని ప్రభుత్వాన్ని ఆదేశించాడు. (ఆ పుస్తకాన్ని నిషేధించాలని అనలేదని తరువాత కురియన్ వివరణ ఇచ్చారు). యూనివర్శిటీ వెంటనే ఆ పుస్తకం అమ్మకాలు, పునర్ముద్రణపై నిషేధం విధించాలని ఆదేశించింది. భారతదేశ చరిత్ర చదువుకునే విద్యార్థులకు అది సిలబస్‌కు సంబంధించిన పుస్తకం కాదు, భారత చరిత్రపై అధ్యయనంలో కేవలం ఒక అదనపు రిఫరెన్స్ పుస్తకంగా మాత్రమే సూచించారు. మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి స్మృతి ఇరానీ ఒక టి.వి. ఛానల్‌లో మాట్లాడుతూ భగత్‌సింగ్‌ను ఒక తీవ్రవాదిగా పేర్కొనడం 'విద్యా సంబంధమైన హత్య' (ఎకాడమిక్ మర్డర్) గా పేర్కొన్నది.

భగత్‌సింగ్ కుటుంబంలోని 'షాహీద్ భగత్‌సింగ్ బ్రిగేడ్'కు ప్రాతినిధ్యం వహించే ఒక వర్గం పుస్తకంలోని వివరణను తొలగించాలని డిమాండ్ చేస్తుంటే, భగత్‌సింగ్ కుటుంబంలోని ఇంకొక వర్గం చరిత్రకారులపై దాడిని ఖండించారు. భగత్‌సింగ్ మేనల్లుళ్ళలో ఒకరైన జగ్‌మోహన్ సింగ్ ప్రస్తుత చర్చ "విచారించే స్వేచ్ఛ, ప్రశ్నించే స్వేచ్ఛ, నేర్చుకునే స్వేచ్ఛలను సవాల్ చేసే సమయంలో" జరుగుతున్నదని చెప్పాడు. 1978లో 'భగత్‌సింగ్ రిసెర్చ్ కమిటి' ని ఏర్పడడానికి చొరవ చూపింది బిపన్ చంద్ర అని ఆయన పేర్కొన్నాడు. 'మృత వీరుల వ్యక్తిత్వాలు, ఆలోచనలపై ఒక కొత్త వెలుగును ప్రసరింపచేసిన భగత్‌సింగ్ యొక్క రచనలు నేనెందుకు నాస్తికుడనైనాను', 'కలల ప్రపంచానికి ఒక పరిచయం'లను పరిచయం చేసింది కూడా బిపన్ చంద్రే' అని పేర్కొన్నాడు. భారత స్వాతంత్ర్యం కొరకు జరిగిన పోరాటాన్ని ఒక కొత్త కోణంలో అర్థం అయ్యేట్లు చేసింది కూడా బిపన్ చంద్ర. అతని వల్లనే తాను (జగ్‌మోహన్ సింగ్) భారత స్వాతంత్ర్య ఉద్యమానికి చెందిన అన్ని రకాల పత్రాలను భగత్‌సింగ్ కుటుంబం నుండి, తోటి దేశభక్తుల నుండి, బ్రతికి ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల నుండి సమీకరించానని, దాని ఫలితంగానే ఇంత గొప్ప వారసత్వం గురించి తెలుసుకునే అవకాశం కలిగిందని అంటాడు. "ప్రొ.బిపన్ చంద్ర చరిత్రకు చేసిన సేవలను రక్షించడానికి మద్దతుగా నిలుస్తాను" అని జగ్‌మోహన్ సింగ్ చెప్పాడు. 'తీవ్రవాదం' అనే పదాన్ని ఉపయోగించడం వల్ల ఉత్పన్నమైన వివాదంపై మాట్లాడుతూ, 'ఇంకా సంపూర్ణమైన అవగాహన అవసరమని, కావాలనే చర్చంతా ఒకే పదంపై జరిపారని,ఇది కుహనా జాతి వ్యతిరేకులు చేసే పని' అని అంటాడు.

ఒకే భావాలు కలిగిన చరిత్రకారులందరూ జగ్‌మోహన్ సింగ్ యొక్క అభిప్రాయాలను ప్రతిధ్వనించారు. భగత్‌సింగ్ రచనలను, భావాలను వ్యాప్తిచేసిన బిపన్ చంద్ర అవమానించబడినాడని వారంతా అభిప్రాయపడినారు. ప్రభుత్వంలోని కొన్ని విభాగాలు చేస్తున్న విమర్శ వారు చెప్పే దానికి భిన్నంగా ఉంది. బి.జె.పి. ఎం.పి.లు గందరగోళపరిచే విధంగా వ్యవహరిస్తూ, ఒకరు ఆ పదాన్ని తొలగించి,


పుస్తకాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. బిపన్ చంద్ర ఎప్పటినుండో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉంటూ వస్తున్నాడని మరొక పార్లమెంట్ సభ్యుడు అన్నాడు. చిట్టగాంగ్ ఆయుధాగారంపై దాడిచేసిన సూర్యసేన్ కూడా ఒక విప్లవ తీవ్రవాదిగా వర్ణించబడినాడని తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు పేర్కొంటారు. ఆ పుస్తకంలోని "భగత్‌సింగ్, సూర్యసేన్ ఇతర విప్లవ తీవ్రవాదులు" అనే అధ్యాయంలో దీనికి సంబంధించినది పేర్కొన బడింది. ఒక తెలివైన, ఎదుటివారిని ప్రభావితం చేయగల నాయకుడు, మృదుభాషి, పారదర్శకత, క్రమశిక్షన కలిగిన వ్యక్తిగా సూర్యసేన్‌ను అదే అధ్యాయంలో వర్ణించాడు. ధైర్య సాహసాలు, మానవత్వం కలిగిన వ్యక్తిగా కూడా మంచి పేరుంది. "మానవత్వం అనేది ఒక విప్లవకారు నికి ఉండదగిన ఒక ప్రత్యేక సద్గుణం" అని చెప్పడం అతనికి ఇష్టం. కవిత్వం అంటే కూడా అతనికి బాగా ఇష్టం. రవీంద్రనాథ్ ఠాగూర్, కాజీ నజ్రుల్ ఇస్లాం అతని అభిమాన కవులు.

అదే అధ్యాయంలోని 254వ పేజీలో భగత్‌సింగ్ గురించి ఈ విధంగా వర్ణించ బడింది. "ప్రముఖ విప్లవకారుడు, అజిత్‌సింగ్‌కు మేనల్లుడైన భగత్‌సింగ్ 1907లో పుట్టాడు. అతడు ఒక గొప్ప మేధావి. ఒక మంచి పాఠకుడు. ఆనాటి విజ్ఞానవంతులైన రాజకీయ నాయకులలో ఒకడు. లాహోర్‌లోని ద్వారకా దాస్ గ్రంథాలయంలో సోషలిజం, సోవియట్ యూనియన్, విప్లవోద్యమాల (ముఖ్యంగా రష్యా, ఐర్లాండ్, ఇటలీ) పై రచించిన అనేక రచనలను ఎంతో ఆసక్తిగా అధ్యయనం చేశాడు". అదే అధ్యాయంలో, 1929లో తన అరెస్ట్‌కన్నా ముందు ఉగ్రవాదం, వ్యక్తిగత నాయకత్వ చర్యలపై తనకున్న విశ్వాసాన్ని వదులుకున్నాడు". అతడు మార్క్సిజంవైపు మరలినాడు. ముఖ్యంగా విశాల ప్రాతిపదికన ఏర్పడే ప్రజా ఉద్యమాలే విప్లవం విజయవంతం అవడానికి దారితీస్తా యని నమ్ముతాడు. ఇంకొక విధంగా చెప్పాలంటే విప్లవం అనేది కేవలం ప్రజల కొరకు, ప్రజల చేతనే సాధించబడుతుందని విశ్వసించాడు. అందుకే 1926లో విప్లవకారుల బహిరంగ సంస్థగా పంజాబ్ నవజవాన్ భారత సభ ఏర్పాటుకు భగత్‌సింగ్ సహాయపడినాడు".

బిపన్ చంద్ర విప్లవకారులను విమర్శించదల్చుకుని ఉండి ఉంటే భగత్‌సింగ్, సూర్యసేన్‌లను మెచ్చుకొనే పదజాలాన్ని ఉపయోగించి ఉండేవాడు కాదనేది స్పష్టం.

ఢిల్లీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ యోగేశ్ త్యాగికి వ్రాసిన ఉత్తరంలో బిపన్ చంద్ర

> **"అది (తీవ్రవాది) పొగడ్తకు సంబం ధించిన పదం. అది భగత్‌సింగ్‌కు, స్వాతంత్ర్యోద్యమంలో ఇతర మార్గాలను అనుసరిస్తూ పోరాటం చేస్తున్న వారికి మధ్య ఉన్న తేడాను తెలియ జేయడానికి ఉపయోగించబడింది. కానీ 'తీవ్రవాదం' అన్న పదం ఇప్పుడు వేరే అర్థంలో తీసుకొనబడుతుంది. ఇకముందు ఈ పదాన్ని ఉపయోగించడం నాకిష్టం లేదు"**



బిపన్ చంద్ర

తన తరువాత రచనలలో ఈ వర్ణనలను ఉపయోగించడం నిలిపివేశారని, 'తీవ్రవాది' అనే పదం ఇక ముందు బహిరంగంగా ఉపయోగించనని అన్నాడని సహ రచయితలు పేర్కొన్నారు. 2007లో భగత్‌సింగ్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా బిపన్ చంద్ర చేత జారీ చేయబడిన ఒక వివరణను జె.ఎన్.యు. చరిత్ర విభాగం ప్రొఫెసర్, సహ రచయిత ఆదిత్య ముఖర్జి ఢిల్లీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌కు పంపించడం జరిగింది. ఆ వివరణ ఒక ప్రముఖ దినపత్రికలో ప్రచురించబడింది. ఆ పత్రికా వ్యాసంలో బిపన్‌చంద్ర ఈ విధంగా పేర్కొన్నట్లు తెలిపింది. "అది (తీవ్రవాది) పొగడ్తకు సంబంధించిన పదం. అది భగత్‌సింగ్‌కు, స్వాతంత్ర్యోద్యమంలో ఇతర మార్గాలను అనుసరిస్తూ పోరాటం చేస్తున్న వారికి మధ్య ఉన్న తేడాను తెలియజేయడానికి ఉపయోగించబడింది. కానీ "తీవ్రవాదం" అన్న పదం ఇప్పుడు వేరే అర్థంలో తీసుకొనబడుతుంది. ఇకముందు ఈ పదాన్ని ఉపయోగించడం నాకిష్టం లేదు". ఆయన (బిపన్‌చంద్ర) ఇంకా ఈ విధంగా పేర్కొన్నాడు "సహ రచయితలందరూ బిపన్ చంద్ర కోరిక ప్రకారం ఆ పుస్తకంలో అవసరమైన మార్పులు చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. సహ రచయితలైన మృదులా ముఖర్జీ, కె.ఎన్. ఫణికర్, సుచేతా మహాజన్, నా తరపున 1990లో హిందీ భాషలో ప్రచురించబడిన ఆ పుస్తకంలో అవసరమైన మార్పులు చేసే ఉద్దేశ్యాన్ని మీకు నేను తెలియచేస్తున్నాను".

'హిందీ ఇంప్లిమెంటేషన్ బోర్డు' డైరెక్టర్ ఆశా గుప్తాకు వ్రాసిన ఉత్తరంలో, ఆదిత్య ముఖర్జీ తాను వైస్ ఛాన్సలర్‌కు వ్రాసిన ఉత్తరం, 2007లో బిపన్ చంద్ర ఇచ్చిన వివరణలను ప్రస్తావించి, పుస్తకంలో అవసరమైన మార్పులకు తాను సహకరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఇన్ని హామీలిచ్చినప్పటికీ వివాదం సమసిపోలేదు. దానికి కారణం భగత్‌సింగ్ లేదా ఇతర విప్లవకారులను, ఆనాటి దేశభక్తులను ఆయన విమర్శించడం కాదు. జాతీయతపైన చర్చ జరిగే సందర్భంలో ఆయనను, సహ రచయితలను జాతి వ్యతిరేకులుగా ముద్ర వేయడం వారి ఉద్దేశ్యం. ఈ పుస్తక ప్రధాన రచయిత, సహ రచయితలు గతంలో, ఇప్పుడు కూడా జె.ఎన్.యు.కు సంబంధించిన వారు కావడం ఆశ్చర్యకరం. 21వ శతాబ్దంలో భారత దేశం యొక్క దేశభక్తికి సంబంధించిన కఠిన పరీక్షను జె.ఎన్.యు.ఎదుర్కొంటున్నది.

ఢిల్లీ యూనివర్శిటీ చరిత్ర విభాగం అధిపతిగా ప్రొ. డి.ఎన్. ఝా ఈ పుస్తకాన్ని హిందీ భాషలోకి అనువదించాలని సూచించాడు. ఝా ఫ్రంట్‌లైన్‌తో ఈ విధంగా అన్నాడు "హిందీ ఇంప్లిమెంటేషన్ బోర్డ్ హిందీ పుస్తకాలకు సంబంధించిన మెటీరియల్‌ను సరఫరా చేయడానికి మాత్రమే ఉద్దేశించబడిన విభాగం కాదు. కేవలం పాఠ్య పుస్తకాలు మాత్రమే కాక, సోషల్ సైన్స్ లాంటి ఇతర పుస్తకాలను కూడా హిందీలో ముద్రించడానికి ఉద్దేశించబడింది. 'భారత స్వాతంత్ర్య పోరాటం' పుస్తకం ఎప్పుడైతే చూశానో వెంటనే హిందీ

**"ఇప్పుడు ఎవరైతే దీనిని ఒక సమస్యగా చూస్తున్నారో వారంతా నిరక్షరాస్యులు. ఇది ఉద్దేశ్య పూర్వకంగా రేకెత్తిస్తున్న వివాదం. ఇంకా అనేక ముఖ్యమైన ఇతర సమస్యలున్నాయి. భగత్‌సింగ్ తనను తాను ఒక రాజకీయ తీవ్రవాదిగా వర్ణించుకోవడానికి ఆ పదం ఉపయోగించాడు."**

లోకి అనువదించాలని నేను సూచించాను. అది పాఠ్యాంశాలకు సంబంధించిన పుస్తకం కాకపోయినా,దాని వలన లాభం జరుగుతుందని నా ఉద్దేశ్యం. ఇప్పుడు ఎవరైతే దీనిని ఒక సమస్యగా చూస్తున్నారో వారంతా నిరక్షరాస్యులు. ఇది ఉద్దేశ్యపూర్వకంగా రేకెత్తిస్తున్న వివాదం. ఇంకా అనేక ముఖ్యమైన ఇతర సమస్యలు న్నాయి. భగత్‌సింగ్ తనను తాను ఒక రాజకీయ తీవ్రవాదిగా వర్ణించుకోవడానికి ఆ పదం ఉపయోగించాడు. భగత్‌సింగ్ వంశస్తులు చెప్పిన ప్రకారం చరిత్రను ఎందుకు వ్రాయాలో నాకు అర్థం కాలేదు. అతని వంశస్తుల ఆలోచనలను చరిత్రకారులు అనుసరించకూడదు. వైస్ ఛాన్సలర్ ఇంకొంత ఆలోచించి చర్యకు పూనుకోవలసింది. ఒకవేళ ఢిల్లీ యూనివర్సిటీ ఆ పుస్తకం అమ్మకాలను, పునర్ముద్రణను ఆపివేసి ఉంటే, అది మూర్ఖత్వం అవుతుంది.

వారిపై చేసిన దాడి, వివాదానికి సమాధానంగా సహ రచయితలు, బిపన్ చంద్ర మృతవీరుని విమర్శించే ఉద్దేశ్యంతో 'విప్లవ తీవ్రవాది' అనే పదం ఉపయోగించాడని ఆరోపించడం ఆయనపై ఉద్దేశ్యపూర్వక దాడిగా అభివర్ణించారు. ఆ పుస్తకంలోని 142వ పేజీలో ఆ పదాన్ని మొట్ట మొదటిసారిగా ఉపయోగించి నట్లు వారు పేర్కొన్నారు. ఏ విధమైన విమర్శనా దృష్టితో కాకుండా, ఒక భిన్నమైన పదం కావాలనే ఉద్దేశ్యంతో ఆ పదం ఉపయోగించామని బిపన్ చంద్ర వివరణ ఇచ్చాడు. 2006లో ప్రచురించ బడిన 'నేను ఎందుకు నాస్తికుడినయ్యాను' అనే పుస్తకానికి పరిచయ వాక్యాలు వ్రాసిన బిపన్ చంద్ర 'తీవ్రవాదం' అనే పదం ఉపయోగించ లేదని వారు (సహ రచయితలు) అన్నారు. "భగత్‌సింగ్ భారతదేశం యొక్క గొప్ప స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవ సోషలిస్టులలో ఒకడు మాత్రమే కాదు, ఆయన తొలి మార్క్సిస్ట్ మేధావులలో, సిద్ధాంతాలను అమలు పరచిన వారిలో కూడా ఒకడు. కానీ మిగతా వాటితో పోలిస్తే చివరి అంశం (తొలి మార్క్సిస్ట్ మేధావి) అందరికీ అంతగా తెలిసిన విషయం కాదు. దానికి కారణమేమంటే మతతత్వవాదులు, రాజకీయ, సామాజిక మార్పును వ్యతిరేకించే వారు, వాస్తవాలను దాచిపెట్టి, తప్పుడు పద్ధతులలో, వారి రాజకీయ, సైద్ధాంతిక లాభం కొరకు భగత్‌సింగ్, ఆయన తోటి కామ్రేడ్‌లు చంద్రశేఖర్ ఆజాద్‌లాంటి వారి పేరు, ప్రతిష్టలను మోసపూరితంగా ఉపయోగించుకొనే ప్రయత్నం చేస్తూ వచ్చారు."

**సహమత్ వివరణ:**

బిపన్ చంద్ర భగత్‌సింగ్‌పై వేసిన చారిత్రక అంచనాను సమర్థిస్తూ సఫ్దర్ హష్మీ మెమోరియల్ ట్రస్ట్ (సహమత్) తన సవివరమైన వివరణలో భగత్‌సింగ్ 'తీవ్రవాదం' గురించి ఏం చెప్పాడో పేర్కొనడం జరిగింది. ఆ కాలంలో ఆ పదం అవమానకరమైనది కాదు. భగత్‌సింగ్, తన తోటి కామ్రేడ్లకు చెందిన 'హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ (హెచ్.ఎస్.ఆర్.ఎ.) ప్రణాళికలో ఈ విధంగా వ్రాయబడింది. "మేము తీవ్రవాద పంథాకు చెందిన లక్ష్య సాధన కొరకు తీసుకోబడినాము. ఇది కేవలం ఉగ్రవాదాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే సరియైన ప్రతీకారం తీర్చుకోవచ్చు అనే దానిలో ఎటువంటి సందేహం లేదు". "బ్రిటిష్ వారి అణచివేత కారణంగానే ఈ దేశంలో 'తీవ్రవాదం' పుట్టిందని, ఇది ఒక అవసరమైన, అనివార్యమైన విప్లవదశ, తీవ్రవాదం సంపూర్ణ విప్లవం కాదు, ఆ విప్లవం తీవ్రవాదం లేకుండా పూర్తికాదు" అని హెచ్.ఎస్.ఆర్.ఎ. పేర్కొన్నది. కొత్తగా పుట్టుకొచ్చి, ప్రస్తుతం భగత్‌సింగ్‌ను మెచ్చుకుంటున్నవారు హెచ్.ఎస్.ఆర్.ఎ. ప్రణాళికతో సహ ఆయన రచనలు ఏవీ అధ్యయనం చేయలేదని స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. 1931లో జైలు నుండి తన సహచరులకు వ్రాసిన లేఖలో భగత్‌సింగ్ ఈ విధంగా అంటాడు "తీవ్రవాదులు చాలా పనిచేశారు. మన ప్రచార క్రమంలో తీవ్రవాద పద్ధతులను చాలా ఉపయోగించుకోవచ్చు. మేము తీవ్రవాద చర్యల నుండి పూర్తిగా వేరు కావడం లేదు. శ్రామికుల విప్లవం దృష్టితో మేం దాని (తీవ్రవాదం) యొక్క విలువ ఏమిటో తెలుపుతాం. ఈ విధమైన ఉగ్రవాద చర్యలు ప్రజల దృష్టితో జరగడం వలన ప్రజా పోరాటాలను తళుక్కున మెరిసేటట్లు చేసి, పదునెక్కిస్తాయి. ఇకమీద ఎట్టి పరిస్థితులలో ఈ ఆదర్శాన్ని ముందుకు తీసుకొని వెళ్ళకూడదు" ఉన్నత విద్యా రంగానికి చెందిన ప్రముఖులు 'సహమత్' వివరణను బలపర్చారు. ఈ


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**


'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్,గవర్నరుపేట, విజయవాడ-2

భావనలనన్నింటిని భగత్‌సింగ్ చర్చించి తన రచనలలో పొందుపరిచాడనేది స్పష్టం అయ్యింది. అలా జరిగింది కాబట్టి బిపన్‌చంద్ర కూడా అన్ని విధాల చర్చించి, ఆలోచిస్తూ ఉండేవాడు. దానికి కారణం బిపన్ చంద్ర భగత్‌సింగ్ పట్ల, అతని భావాలకు ఆకర్షితుడు కావడమే. అనారోగ్య కారణాలు, కంటిచూపు సమస్య వలన తాను అనుకున్న విధంగా ఆ పుస్తకాన్ని పునస్సమీక్షించలేకపోయాడు. కానీ వారు ఆ పుస్తకంలోని ఆ పదాన్ని (తీవ్రవాది) తొలగించాలని అనుకుంటున్నట్లు, సహ రచయితలు పేర్కొన్నారు. "భగత్‌సింగ్‌ను ఎంతో శ్రమించి ఒక ప్రధాన వేదికపైకి తీసుకొని వచ్చిన బిపన్ చంద్ర లాంటి మేధావిపై దాడి చేయడం అంటే విమర్శకుల నోర్లు మూయించడానికి వేసిన పథకంలో భాగమే" అని సహ రచయితలు అన్నారు. ఆయన (బిపన్ చంద్ర) 1970లో వెలికితీసి, 'నేను నాస్తికుడ్ని ఎందుకయ్యాను?' ను ఒక కరపత్రంగా తన స్వంత ఖర్చులతో ప్రచురించాడన్న విషయాన్ని వారు తెలియజేశారు. 2011 ఏప్రిల్‌లో జె.ఎన్.యు.లో 'భగత్‌సింగ్ చైర్' ప్రారంభోత్సవ సభలో ఆయన చేసిన ప్రసంగం చివరిది అని ఆదిత్య ముఖర్జీ అన్నారు. ఆ సభలో బిపన్ చంద్ర ఒకవేళ భగత్‌సింగ్ బ్రతికి ఉండి ఉంటే 'భారతదేశ లెనిన్' అయి ఉండెడి వాడు అని అభిప్రాయ పడినాడు. బిపన్ చంద్ర అసంపూర్తియైన చివరి రచన 'భగత్‌సింగ్ జీవిత చరిత్ర'.

భారత జాతీయ ఉద్యమంతోపాటు, కొంతమంది విప్లవ భావాలు కలిగిన స్వాతంత్ర్య సమరయోధుల అనుభవాలను నమోదు చేయడానికి 600 పేజీల 'భారత స్వాతంత్ర్య పోరాటం' అనే గ్రంథాన్ని ప్రచురించడానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్ కూడా కొంత ఆర్థిక సహాయం అందించింది. సాంప్రదాయబద్ధమైన విషయ సేకరణ పద్ధతితో పాటు, రచయితలు దాదాపు 1500 మంది జీవించి ఉన్న స్వాతంత్ర్య సమరయోధులను ఇంటర్వ్యూ చేశారు. 2011లో మొట్ట మొదటి 'భగత్‌సింగ్ చైర్' స్మారకోపన్యాసంలో 'తీవ్రవాదం' అనే పదం విప్లవకారులను విమర్శించడానికి ఉపయోగించబడలేదని, భగత్‌సింగ్ ఆ పదాన్ని ఉపయోగించాడని, అయినప్పటికీ 'జాతీయ విప్లవకారుడని' ఉపయోగించి ఉంటే బావుండేదని బిపన్ చంద్ర అభిప్రాయపడినట్లు 'భగత్‌సింగ్‌కే సంపూర్ణ దస్తావేజు' సంకలనం, సంపాదకులుగా ఉన్న చరిత్ర మాజీ ప్రొఫెసర్ చమన్‌లాల్ అన్నాడు.

**" బహుశా వారు యూనివర్శిటీలను, ముఖ్యంగా వారి జాతీయతా నిర్వచనాన్ని బలపరచనటు వంటి వాటిని లక్ష్యంగా చేస్తున్నారనుకుంటాను, హిందీ భాషలో ఉన్న పుస్తకం యువ విద్యార్థులకు చాలా ఆకర్షణీయంగా ఉండడంతోనే సమస్య ఏర్పడిందని చమన్‌లాల్ అంటాడు."**



భగత్‌సింగ్

**పెంగ్విన్ బుక్స్ వివరణ:**

పెంగ్విన్ బుక్స్ ఇండియా ఒక వివరణలో ఈ విధంగా పేర్కొన్నది. "1988లో మొదటి ప్రచురణ నుండి 'భారత స్వాతంత్ర్య పోరాటం' గ్రంథం, భగత్‌సింగ్, తన సహచరులు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వారు అందించిన సేవలు తెలియజేసే అధికారిక గ్రంథంగా గుర్తింపు పొందింది. దానిని రచించే సమయంలో రచయిత 'విప్లవ తీవ్రవాది' అనే పదం విప్లవకారులను విమర్శించే ఉద్దేశ్యంలో ఉపయోగించబడలేదు కానీ ఒక భిన్నమైన పదం కావాలనే ఉద్దేశ్యంతో మాత్రమే ఉపయోగించబడిందని స్పష్టత ఇచ్చాడు. ఈ పుస్తకం మొట్ట మొదట ప్రచురించబడిన నాటి నుండి భాష మారుతూ వస్తుంది. ఆధునిక భారతదేశ సృష్టి కొరకు గొప్ప పాత్ర పోషించిన భగత్‌సింగ్ గురించి ఆధునిక భాషా వినియోగాన్ని ప్రతిబింబించే విధంగా పద సముదాయాన్ని తాజాపర్చడానికి, పున: సమీక్షించడానికి మేము ఇప్పటికే సహ రచయితలతో కలిసి పనిచేస్తున్నాం". భగత్‌సింగ్ ఆయన సహచరులు చేసిన సేవలు చాలా విలువైనవని ఈ సందర్భంగా అంగీకరించబడినట్లు చెప్పారు. మార్పులు చేయడానికి ఇబ్బంది లేదని, ఈ పుస్తకం వల్ల చాలా లాభం జరుగుతుందని ప్రచురణకర్త పేర్కొన్నాడు.

ప్రస్తుత వివాదానికి కారణం తెలుసుకోవడం పెద్ద కష్టం కాకపోవచ్చు. భగత్‌సింగ్ కుటుంబంలోని ఒక వర్గానికి చెందిన వారి భావాలు, అవసరాలు ప్రభుత్వంలో ఉన్నవారి భావాలు ఒకే విధంగా ఉన్నట్లు కనపడుతున్నాయి. ఈ సమస్య యు.పి.ఎ.-1 ప్రభుత్వ హయాంలోనే లేవనెత్తబడినట్లు, బిపన్ చంద్ర వ్రాసిన 'ఆధునిక భారతదేశం' లో 'జాట్' లను తక్కువ చేసిన విధానానికి వ్యతిరేకంగా దాడిచేసినట్లు ప్రొ. చమన్‌లాల్ పేర్కొన్నాడు. "బహుశా వారు యూనివర్శిటీలను, ముఖ్యంగా వారి జాతీయతా నిర్వచనాన్ని బలపరచనటు వంటి వాటిని లక్ష్యంగా చేస్తున్నారనుకుంటాను, హిందీ భాషలో ఉన్న పుస్తకం యువ విద్యార్థులకు చాలా ఆకర్షణీయంగా ఉండడంతోనే సమస్య ఏర్పడిందని" చమన్‌లాల్ అంటాడు.

2014లో మరణించిన బిపన్ చంద్ర 'వలసవాదం', 'జాతీయవాదం', 'మతతత్వం' పైన రచించబడిన అనేక గ్రంథాలకు రచయిత. ఆయన నేషనల్ బుక్ ట్రస్ట్‌కు అధ్యక్షుడిగా పనిచేశాడు. ఆయనపై మోపబడిన నేరం గురించి ఆయన తోటి అధ్యాపకులకు, విద్యార్థులకు విస్మయం కలగలేదు, కానీ బిపన్ చంద్రకు భగత్‌సింగ్, అతని భావాల పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించని బి.జె.పి. నాయకత్వం తీరు పట్ల విస్మయం కలిగింది. ఒకవేళ ఢిల్లీ యూనివర్శిటీ 'భారత స్వాతంత్ర్య పోరాటం' గ్రంథాన్ని ఉనికిలో లేకుండా చేసే ప్రయత్నం చేసినా లేదా తీవ్ర మైన నిర్ణయాలు తీసుకొన్నా అది మేథో, విద్యా విషయక, పరిశోధక స్వేచ్ఛకు ఒక పెద్ద దెబ్బ. జాతీయ ఉద్యమాన్ని సవివరంగా నమోదు చేసిన పుస్తకం పట్ల అనుచితంగా వ్యవహరించటం అవుతుంది.

**(అనువాదం: బోడపట్ల రవీందర్)**

**సిద్ధాంతం - ఆచరణ**

# సోషలిజానికి మార్గం కష్టమే కాని అసాధ్యం కాదు



రచయిత్రి సోషలిస్టు ఉద్యమ మద్దతుదారు

**మార్తా హర్నేకర్**

గత కొన్ని దశాబ్దాలుగా లాటిన్ అమెరికన్ దేశాలలో జరుగుతున్న రాజకీయ పరిణామాలలో సాంప్రదాయంగా కొనసాగే కార్మికవర్గ పోరాటాలు పెద్దగా కనపడకపోవడం ఒక ముఖ్య అంశం. నయా ఉదారవాద విధానాల ఫలితంగా కాంట్రాక్టీకరించబడి, సులువుగా మారిపోయే వైఖరి పెంపొందించు కున్న కార్మికవర్గం ఏవో కొన్ని సందర్భాల్లో తప్ప, ప్రతి ఘటించడం మర్చిపోయింది. ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్న పోరాటాలలో కార్మికవర్గం కొంత మేరకు పాల్గొనటం తప్ప, ఈ పోరాటాలకు ముందుభాగాన ఉండి నడిపించే పాత్ర పోషించటం లేదు.

ఈ మధ్యకాలంలో జరుగుతున్న కొత్త సామాజిక ఉద్యమాలు ముందుగా రాజకీయ నాయకులు, వారి విధానాలకు వ్యతిరేకంగా ప్రారంభమవుతున్నాయి. కాని ఈ పోరాటాలు ముందుకు సాగేకొద్దీ, చాలా సందర్భాలలో అప్పటిదాకా తాము పోరాడిన ఏకపక్ష అంశాలను దాటుకొని, రాజకీయ విధానాలను తిప్పికొట్టే విధంగా బహుముఖత్వాన్ని సంతరించుకొని, గద్దెమీద ఉన్న ప్రభుత్వ, పాలకవర్గాల పీటలు కదిలిస్తున్నాయి. ఈ క్రమలోనే తమకంటూ ప్రత్యామ్నాయ రాజకీయ సంస్థలు లేదా విధానాలను రూపొందించుకోవాలనే కాంక్షను పెంచుకుంటున్నాయి. ఈక్వెడార్‌లో, బొలీవియాలో అదే జరిగింది.

ఈ పోరాటాల నుంచి మనం నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి. ఒకరి పోరాటాలకు ఒకరు మద్దతుగా నిలబడటం అనేది ముఖ్య ప్రాతిపదికగా చేయటం వలన, సాధ్యమైనంత మంది కార్మికవర్గాన్ని, ప్రజానీకాన్ని ఏకం చేయడం లేదా ఒకే గొడుగు క్రిందకి తేవడం తద్వారా అందరి లక్ష్యం ఒకటే అనే భావనను పెంపొందించటం. వివిధ తరగతుల వారు, విభిన్న రాజకీయ వైఖరులున్నవారు అయినప్పటికీ, అందరికీ సూత్రబద్ధమైన లక్ష్యం ఒకటే అనే భావన తేవటం ప్రధానం. ఇంత జరిగిన తరువాత, అభ్యుదయకర ప్రభుత్వాలు ఎన్నిక కాకపోయినప్పటికీ, ఈ పోరాటాలలో సాధించిన సామాజిక సమీకరణలు, పెరిగిన రాజకీయ అవగాహనలు, విశాల దృక్పధాల వలన ప్రభుత్వాల మీద అనివార్యంగా ఒత్తిడి తేగలిగే స్థాయిలో ప్రభావం చూపుతాయి.

సోషలిజానికి మార్గం కష్టమే కాని అసాధ్యం కాదు. మనం చెప్పుకున్నట్లుగా, నయా ఉదారవాద శక్తులను ఎదుర్కొన్న కొన్ని లాటిన్ అమెరికన్ దేశాలు ప్రత్యామ్నాయ సమాజ నిర్మాణం కోసం మార్గాలు వెతుకుతూనే ఉన్నాయి. ఎవరికి తోచిన పద్ధతిలో వారు వాటికి నామకరణాలు చేశారు. ఇరవై ఒకటో శతాబ్దపు సోషలిజం అని, వర్గ సోషలిజం అని, బ్యూయన్ వివిర్ (మంచి జీవితం అని), పరిపూర్ణమైన జీవితం కోసం సమాజం అని పిలుస్తున్నారు. వీటన్నింటి సారాంశం ఒక్కటే. ప్రజలచే నిర్మించబడే సమాజం కావాలి. పైనుంచి దిద్దే సమాజం వద్దని.

కాని ఈ పోరాటాలన్నిటికీ ఉన్న ఒక పెద్ద సవాలు వీటన్నింటినీ సోషలిజం వైపునకు తీసుకెళ్ళగలగటం. ప్రభుత్వాలను మార్చినంత మాత్రాన ఏమీ జరగదు. మార్క్సిజం యొక్క అంతిమ లక్ష్యానికి భిన్నంగా ఉంది వీరి వైఖరి. 20వ శతాబ్దపు ప్రారంభ దశలో జరిగిన విధంగా బూర్జువా వ్యవస్థను సర్వనాశనం చేయందే మనం ముందుకు పోలేమని మార్క్సిజం ఏదైతే నేర్పిందో అది తప్పనిసరిగా జరిగేలా ప్రయత్నాలు చేయాలి. అప్పుడు వచ్చిన విప్లవాలన్నీ, ప్రజల సాధారణ సాంప్రదాయ రాజ్యాంగ వ్యవస్థనే కూకటి వ్రేళ్ళతో పెకలించి వేశాయి. కాని నేడు ఉన్న ప్రత్యేక పరిస్థితులలో వామపక్షాలు, వారి భావాలు చిన్నాభిన్నమై పోయాయని కొంతమంది వామపక్షవాదులు కూడా అనుకొనే పరిస్థితులు ఉన్నాయని కూడా మనం అర్థం చేసుకోవాలి.

అంతేకాకుండా, ఎన్నికలలో విజయం సాధించడం అనేది కేవలం రాజ్యంలో ఒక చిన్న పాత్రగానే పరిగణించాలి. చాలా సందర్భాలలో పార్లమెంటు, న్యాయవ్యవస్థ గుప్పెటలోకి రాకుండానే అధికారం చేతిలోకి వస్తుంది. వీటికితోడు పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రభావం గల ఆర్థిక యంత్రాంగం, మీడియా, మిలిటరీ వాటి యథాస్థితిలోనే ఉంటాయి. ఇప్పుడు సమస్య అదే, ఈ మిగతా అధికార యంత్రాలన్నింటినీ ఎలా స్వాధీనంలోకి తెచ్చుకోవాలి? దీనికి ఒకటే మార్గం. అది మరింత మంది ప్రజల్ని ఆకట్టుకోగలగటం, ఈ మార్పు ప్రక్రియలో భాగస్వాములను చేయడం. వారి అంతిమ లక్ష్యాన్ని చేరుకోవటానికి వారే సారథ్యం వహించేలా చూడడం.

ఈ రకమైన పరిస్థితులలో సోషలిజంవైపు పయనించడంలో అనేక అవరోధాలు, సవాళ్ళు ఎదురవుతాయి. అభ్యుదయకర ప్రభుత్వాలు ముందు వారి దేశాలలో ఉన్న వెనుకబాటుతనం మీద యుద్ధం చేయాలి. ఎందుకంటే, పెట్టుబడిదారీ శక్తులు ఉత్పత్తి చేసిన ఆర్థిక అసమానతలు కొన్నాళ్ళ పాటు తమతో కలిసే సహజీవనం చేస్తాయి కాబట్టి. అది కూడా సాంప్రదాయ పెట్టుబడిదారీ రాజ్యపాలనకు అలవాటుపడ్డ అధికార యంత్రాంగం సోషలిస్టు సమాజంవైపు వేసే ప్రతి అడుగుకి ప్రతిబంధకంగా ఉంటుందని అవగాహనతోనే ఈ ప్రయత్నం చేయాలి. ఆచరణలో అది సాధ్యమేనని కూడా ఋజువు అయ్యింది. కొన్ని తరగతుల వామపక్షవాదుల వాదనలు పక్కన ఉంచి, నిజానికి విప్లవకారులు ఒక రాజ్యాన్ని పూర్తిగా వశం చేసుకున్నాక, వారి అధికారం ఉపయోగించి, ఇప్పటికీ ఉన్న వ్యవస్థలను కావాలంటే కొత్తరకం రాజకీయ వ్యవస్థకి, ఇతర వ్యవస్థలను

నిర్మించటానికి పునాదులు వేయవచ్చు. వీటికి అదనంగా, ప్రజా నాయకుల మన్ననలు పొందిన వారికోసం అవసరమైన స్థానాలు సృష్టించి, నిత్య ప్రజా జీవితంలో వారే పాలకులుగా ప్రజలందరినీ భాగస్వాములను చేయాలి.

కాని చరిత్ర మనకు నేర్పిన పాఠం ఏమిటంటే వర్గాలను ఒక్కసారి వచ్చే పెను తుఫానులతో పెకలించలేము. మనం నిర్మించాలనుకున్న సమాజానికి, ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజం నుంచి రావాలంటే సుదీర్ఘకాలమే పడుతుంది. ఛావెజ్‌లాంటి వాళ్ళు దీనిని కొన్ని దశాబ్దాలు పడుతుందని, సమీర్ అమీన్, అల్వారో గార్వియాలినేరా వంటివారు శతాబ్దాలు పట్టవచ్చని అభిప్రాయాలు చెప్పారు. సోషలిజం అనే లక్ష్యానికి మనం నిరంతరం సాధన చేస్తుండాలేకాని, దానిని పూర్తి స్థాయిలో మనం చూడలేమేమో అని నేను అభిప్రాయపడుతున్నాను. నాదేమీ నిరాశావాదంతో కూడుకున్న వాదన కాదు. ఒక ఆదర్శవంతమైన లక్ష్యం కోసం, దానిని జాగ్రత్తగా నిర్వచించుకుంటే, అది మన పోరాటాల మార్గానికి వెలుతురునిచ్చి, మరింత పట్టుదలతో ముందుకు సాగటానికి ఉపయోగపడుతుంది. ప్రతి అడుగు ఎంత చిన్నదైనా, అది మనని ఆ లక్ష్యం అంచుల వరకు తీసుకెళ్తుంది.

లాటిన్ అమెరికన్ దేశాలలో మేము సోషలిస్టు వ్యవస్థవైపు మార్పు చెందుతున్న చారిత్రాత్మక ఘట్టంలో అడుగు పెడుతున్నాము. అయితే మా లక్ష్యం ఎలా సాగుతుందా అని అందరికీ అనిపించవచ్చు. కాని ఈ మార్పును మేము అనుసరిస్తున్న పద్ధతులు, విధానాలు ఆయా దేశాల ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అమలు చేయాలి. ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు, వర్గాలలో పొందిక, రాజకీయ శక్తుల బలాలను బట్టి నిర్ణయించాలి. ప్రస్తుతమున్న వ్యవస్థల మధ్యనే సోషలిస్టు వ్యవస్థ వైపుకి, మార్పువైపుకి ప్రయత్నం చేయాలంటే, అది సుదీర్ఘకాలపు లక్ష్యం. అలాగే అనేక అభ్యంతరాలు, సవాళ్ళలో కూడుకొని ఉంటుంది. ఏదీ అప్రతిహతంగా ముందుకు సాగిపోతుందని అనుకోవటానికి లేదు. ఓటములు రావచ్చు. కొన్నిసార్లు వెనుకడుగు వేయాల్సి రావచ్చు.

అధ్యక్ష స్థానానికి ఎన్నికలలో గెవటం ఒక ముఖ్య విజయమే కాని అది అంతిమంగా యుద్ధంలో గెలిచినట్లు కాదు. వ్యవస్థలోని అనేక విభాగాలను మనం గెలుచుకోవాలంటే, జాతిలోని మెజారిటీ ప్రజలను మనవైపు మరల్చుకోవాలి. అటువంటి మెజారిటీ సాధిస్తేనే, మనం అనుకుంటున్న నూతన సమాజానికి ప్రజాస్వామ్య బిడ్డింగు వైపు అడుగు వేయగలుగుతాము. అందుకోసం విప్లవకారులందరి మధ్య ఐక్యత తప్పనిసరి. అలాగే సామాజిక న్యాయం కోసం, అందుకు మద్దతు పలికే వారందరినీ కూడా కలుపుకొని, అక్కున చేర్చుకొని ముందుకు పోవాలి. అంటే మనం కేవలం రాజకీయ వామపక్షవాదులు, సామాజిక వామపక్ష వాదులనే కాక, మధ్యస్తంగా ఉన్నవారిని, ఈ పాపులర్ ప్రాజెక్టుకి జతకలవాలని భావించే కొంతమంది వ్యాపార వర్గాలను కూడా కలుపుకొని పోవాలి.

ఇదే సందర్భంలో గత వ్యవస్థలో ప్రముఖులుగా ఉన్నవారు తమకనుకూలమైన పద్ధతిలో వ్యవస్థలు నడుస్తుంటే మద్దతు నటిస్తూ ఉంటారు. ఇటువంటి వారు వామపక్ష ప్రభుత్వాలు వస్తే వాటిని తట్టుకొని నిలుస్తారు. అవసరమైతే బలపరుస్తారు కూడా. వారి రాజకీయ లక్ష్యాలు నష్టం లేనంతవరకు కలుస్తారు. అయితే ఎప్పుడైతే ఆర్థిక వనరులపై ప్రభావం పడుతుందో, ఆ దిశగా తీసుకువచ్చే ప్రజాతంత్ర విధానాలన్నింటినీ న్యాయపరంగానైనా, అక్రమ పద్ధతులలోనైనా నిర్వీర్యం చేసేందుకు వెనుకాడరు. అందుకనే, మనం ఈ ప్రముఖులను ఎదుర్కోవడానికి, ఓడించటానికి వారి ప్రయత్నాలన్నింటినీ గమనిస్తూ, ఆ అడ్డంకులను తొలగించుకుంటూ సోషలిస్టు వ్యవస్థవైపు అడుగువేయాలి. వారనుసరించే పద్ధతులలో ఒకటి అభ్యుదయ, వామపక్ష వాద ప్రభుత్వాలలో స్వయంగా చొరబడి, అంతర్గతంగానే దానిని నిర్వీర్యం చేయడం. రెండోది కొన్ని రంగాలలోని కార్మికసంఘాల్ని, వారి నాయకులను లోబరుచుకోవటం. ప్రభుత్వాల యొక్క బలహీనతలను ఉపయోగించుకొని వీరు బలపడతారు. చిలీలో అలెండీ నాయకత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇలాగే జరిగింది. కాపర్ గనులు, రవాణా రంగాలలోని కార్మికసంఘాల్ని వశపరచుకొని, ప్రభుత్వం మీద దాడికి దిగారు. దురదృష్టవశాత్తూ అభ్యుదయకర ప్రభుత్వాలు ఈ ప్రముఖుల నుండి రక్షించుకోవడానికి తప్పనిసరిగా పోరాటం చేస్తుంటే వామపక్ష భావజాలంలోని కొన్ని శక్తుల నుండి ప్రతిఘటనను ఎదుర్కోవలసి వస్తుంది. సమాజంలో ఉన్న భిన్న ధృవాల సమస్యలను అర్థం చేసుకోకుండా, సందర్భానుసారంగా వేసే ఎత్తుగడలను, సర్దుబాట్లను అర్థం చేసుకోక, సామాజిక పరివర్తనలు వేగంగా తేలేకపోతున్నారనే నిందలతో ప్రముఖులను, పెట్టుబడిదారులను శత్రువులుగా చూడకుండా, ఈ అభ్యుదయ ప్రభుత్వాలనే శత్రువులుగా చూసే వామపక్ష శక్తులు కూడా ఇబ్బందులు సృష్టిస్తుంటాయి. కొన్ని కార్మికసంఘాలు, సామాజిక ఉద్యమ సంస్థలు కూడా ప్రభుత్వం పట్ల చాలా విషయాలలో మొండి వైఖరిని అనుసరిస్తున్నాయి. వారసత్వంగా, అలవాటుగా, ప్రతిదాన్నీ వ్యతిరేకించే స్వభావం గల వీటిని అధిగమించటానికి మనం కొత్త మార్గాలు అన్వేషించాల్సి ఉంటుంది. నిరంతరం ప్రతిపక్షాలు చేసే దాడులను ఎదుర్కోవాలన్నా న్యాయబద్ధంగా నిలబడాల్సిన పరిస్థితి. అంటే ఎన్నికల ప్రక్రియను కూడా తట్టుకొని నిలవాల్సిన స్థితి. ప్రజాస్వామ్యంలో ప్రజలు క్రియాశీల పాత్ర నిర్వహించాలనే పేరుతో ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేయటానికి ప్రయత్నం చేస్తుంటాయి.

రాజకీయ ఒత్తిడులు, ప్రజాస్వామ్య విధానాల మధ్య ఉండే వైరుధ్యాలను పరిష్కరించటం అంత సులభమేమీ కాదు. కాని అదే సందర్భంలో చట్టాలు, అమలు చేయాల్సిన విధానాల మీద సుదీర్ఘకాలం పాటు చర్చలతోనే నడుపుకొస్తుంటే, ఏ సమాజం వైపునకు మార్పుకు ప్రయత్నిస్తున్నామో అంతిమంగా అదే దెబ్బ తింటుంది. వెనిజులాలో, ఈక్వెడార్‌లలో ఇదే జరిగింది. అందుకనే విప్లవకారులు, నాయకులు రాజ్యాన్ని, అధికార యంత్రాంగాన్ని తమకనుకూలమైన వ్యవస్థలను నిర్మించటానికి ఎలా ప్రయత్నం చేస్తున్నారో, అలాగే ఈ సోషలిస్టు సమాజ స్థాపన మార్గంలో వచ్చే ప్రతిబంధకాలు, అడ్డుగోడలు, అవరోధాలపై పెద్దఎత్తున

**“ అలాగే సామాజిక న్యాయం కోసం, అందుకు మద్దతు పలికే వారందరినీ కూడా కలుపుకొని, అక్కున చేర్చుకొని ముందుకు పోవాలి. అంటే మనం కేవలం రాజకీయ వామపక్షవాదులు, సామాజిక వామపక్ష వాదులనే కాక, మధ్యస్తంగా ఉన్నవారిని, ఈ పాపులర్ ప్రాజెక్టుకి జతకలవాలని భావించే కొంతమంది వ్యాపార వర్గాలను కూడా కలుపుకొని పోవాలి. ”**

> **“ మనం ఎప్పుడైతే ప్రజలకి అర్థమయ్యేలా నిజాలు చెబుతామో, తాము ఎంచుకున్న మార్గానికి ఉన్న అవరోధాలను ప్రజలు ఎప్పుడైతే తెలుసుకుంటారో, అప్పుడు వారి యొక్క డిమాండ్లను కూడా నియంత్రించుకొని సహకరిస్తారు. అంతిమ లక్ష్యమైన సోషలిస్టు సమాజ స్థాపనకు ఆటంకం లేకుండా తోడ్పడ తారు. ”**

పాండిత్యాన్ని గడించి, ప్రజలలో కూడా ప్రచారం చేయాలి. ఈ ఇబ్బందులు, అవరోధాల గురించి ప్రజలకి చెప్తే వారు నిరుత్సాహపడతారని, నిరాశ చెందుతారని వీరికున్న అపోహ. కాని అది నిజం కాదు. మనం ఎప్పుడైతే ప్రజలకి అర్థమయ్యేలా నిజాలు చెబుతామో, తాము ఎంచుకున్న మార్గానికి ఉన్న అవరోధాలను ప్రజలు ఎప్పుడైతే తెలుసుకుంటారో, అప్పుడు వారియొక్క డిమాండ్లను కూడా నియంత్రించుకొని సహకరిస్తారు. అంతిమ లక్ష్యమైన సోషలిస్టు సమాజ స్థాపనకు ఆటంకం లేకుండా తోడ్పడ తారు. ఈ ప్రచారం పూర్తిస్థాయిలో జరగాలంటే, ఈ అవరోధాల అంశాలతోపాటు ప్రజలను సమీకరించడానికి సృజనాత్మకతతో పని చేయాలి. ఇక్కడ మనం ఒకటి అంగీకరించాలి. వామపక్షవాదులలో ఒక బలమైన నమ్మక ముంది. తమ ప్రభుత్వాలు లేక పార్టీ నిర్ణయాలను అనివార్యంగా ఆచరించే పాత్రను తమ క్రింద ఉండే ప్రజాసంఘాలు, కార్మికసంఘాలు పోషిస్తాయని భావిస్తారు. సాంప్రదాయ మార్క్సిస్టు–లెనినిస్టు వామపక్షవాదులు రష్యన్ విప్లవం ప్రారంభదశలో కార్మికసంఘాల పాత్ర గురించి లెనిన్ చెప్పిన అంశాలను పదే పదే వల్లె వేస్తుంటారు.

ఈ అసంపూర్ణమైన అధ్యయనంతో తన జీవితంలోని చివరి దశలో ఈ ప్రముఖ రష్యన్ విప్లవకారుడే స్వయంగా ప్రకటించిన అంశాలను మర్చిపోతున్నారు. నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో కార్మికవర్గానికి, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలకి మధ్య అంతకంతకూ పెరిగిపోతున్న వైరుధ్యాలను ఆయన గమనించి, కార్మికవర్గానికి అది తీవ్ర విఘాతం కలిగిస్తోం దని భావించాడు. అందుకే తన వాదనలో అది బూర్జువా ప్రభుత్వమైన మరి ఏ ఇతర ప్రభుత్వ మైనా, కార్మికసంఘాలు కార్మికుల యొక్క హక్కుల కోసం యాజమాన్యాలతో ఘర్షణ పడాల్సిందేనని, అవసరమైతే సమ్మెను కూడా ఒక ఆయుధంలా వాడి అధికార యంత్రాంగం చెప్పే వక్ర భాష్యాలను తిప్పికొట్టాలని లెనిన్ ప్రకటించాడు.

రాజకీయంగా ఎంతో ప్రభావితం చేయగల ఈ మార్పుని చాలా మార్క్సిస్టు లెనినిస్టు పార్టీలు గుర్తించలేకపోయాయి. ఇటీవల కాలం వరకు పార్టీకి, ప్రజాసంఘాలకి మధ్య సంబంధం ఒక కన్వేయర్ బెల్ట్‌లాగా మాత్రమే పరిగణించారు. మొదట ఇది కార్మికసంఘాలతో మొదలై తరువాత సామాజిక ఉద్యమాలు, వాటి నాయకత్వం బాధ్యతలు, ఉద్యమ ప్రాతిపదికలు ఒకటేమిటి అన్నీ పార్టీ నాయకత్వమే నిర్ణయిస్తుంది అని భావిస్తూ వచ్చారు ఈ లెనినిస్టులు. పై నుంచి ఆదేశాలను ఇవ్వటం, వాటిని ఆచరించటం మాత్రమే చేయాలని చూశారే తప్ప, అంతిమంగా అందరం ఏ ఆశయం కోసం పరితపిస్తున్నామో, ఆ ఆశయం వైపుకు పయనించే మార్గాల అన్వేషణలో, నిర్ణయాలలో, ప్రణాళికలలో వీరినెన్నటికీ భాగస్వాములను చేయలేదు.

ఈ రకమైన విధ్వంసకర పద్ధతులకి భిన్నంగా, మనం ప్రజానుకూలమైన ఉద్యమాలను సహించటం, వాటిని ప్రోత్సహించడం వలన అది అంతిమంగా తెచ్చే ఒత్తిడి వలన, అభ్యుదయ ప్రభుత్వాలు, వాటి అధికారులు కూడా ఆచరణలో వారు తెచ్చే అంశాలలో వచ్చే అవరోధాలు, పొరపాటు ధోరణులను సరిచేసుకోవచ్చు. ఈ స్ఫూర్తినే తీసుకొని కార్మికశాఖలో బాధ్యతలు స్వీకరించబోతున్న ప్రభుత్వ ఉద్యోగులనుద్దేశించి వెనిజులా అధ్యక్షుడు ఛావెజ్ ఇలా అన్నారు. ‘మీరు మంచివారు. అక్కడ మటుకు చాలా అధికార మదంతో కూడిన యంత్రాంగముంది’

అందువలనే మనం ఎంచుకున్న మార్గాన్ని చేరుకునే దశలో వచ్చే వక్రభాష్యాలను, అవాంతరాలను ఎదుర్కోవాలంటే, సంఘటితంగా ఉన్నవారు, నిశితంగా పరిశీలించేవారు, జనాదరణ పొందిన విమర్శలను, వారి పాత్రను అర్థం చేసుకోగలిగే ప్రభుత్వాలు, వీటన్నింటి సమిష్టి కృషితోనే అది సాధ్యపడుతుందని మనం గ్రహించాలి. అధికారులు విమర్శలను స్వాగతించేటట్లు ఉండాలి. అదే సందర్భంలో విమర్శలు కూడా నిర్ణయాత్మకమైనవిగా ఉంటూ, ప్రత్యామ్నాయ పద్ధతులను సూచించేవిగా ఉండాలి. ఉదాహరణకి, ఎల్ సాల్వడార్‌లో ఎఫ్‌ఎంఎల్‌ఎన్ ప్రభుత్వం, క్రిమినల్ గ్యాంగ్‌ల నుండి రక్షించడానికి ప్రజలకు రక్షణ కవచంగా సైన్యాన్ని వాడటాన్ని చాలామంది తప్పుపట్టారు. పోలీసులు ఒక్కరే రక్షణ కల్పించలేని పరిస్థితు లలో ప్రభుత్వం ఈ నిర్ణయం చేసింది. దీనిని విమర్శించిన వారు ప్రత్యామ్నాయం చెప్పలేదు. ప్రజలకు కల్పించాల్సిన రక్షణ సరిగ్గా అమలు జరగకపోతే, మాజీ ప్రభుత్వాలు ప్రమాదకరమైన వైనా తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది.

లాటిన్ అమెరికన్ దేశాలలోని అభ్యుదయకర ప్రభుత్వాలు అనుసరిస్తున్న “గుంజుకోవడం, లాక్కోవడం” (పరిశ్రమల నుంచి) విధానం కొందరు వామపక్ష వాదుల నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. ఈ విధానం వలన ఉత్పన్నమయ్యే సమస్యలు చాలానే ఉన్నాయి. కాని ఈ విమర్శకులు పేదరికాన్ని పారద్రోలటానికి ఈ మార్గం తప్ప వేరే ప్రత్యామ్నాయాలు చూపలేకపోయారు. తన సహజ వనరులలో కొన్నిటినైనా లాక్కొని వాటిద్వారా లాభం పొందడం తప్పా? పైన చెప్పిన రెండు అంశాలు, ప్రజల రక్షణకు సంబంధించిన దాని గురించి, ప్రకృతి వనరులను లాక్కోవడం పై గాని జాతీయ స్థాయిలో ఒక నిర్మాణాత్మకమైన చర్చ జరగాలి. అన్ని కోణాల గురించి జరగాలి. తన వాదనలో నిజం ఉన్నదనుకున్న వారు ఎవరూ చర్చలలో పాల్గొనటానికి భయపడరు. అంతేకాదు. తన వాదనను ఒక అవకాశంగా తీసుకొని ప్రజామోదం పొందేలా ప్రయత్నం చేయాలి. జనాదరణ పొందిన ఇటువంటి ప్రతిపాదనలు అభ్యుదకర ప్రభుత్వాలు తప్పనిసరిగా ఆదరిస్తాయి. ఎందుకంటే వారు ఇప్పటికే సరిహద్దులలో పొంచివున్న ప్రమాదాలను, విధ్వంసాలను గురించి ఆలోచిస్తున్నారు. పేదరికాన్ని తొలగించటానికి సంపూర్ణ పేదరిక నిర్మూలనా కార్యక్రమంలో దీనిని ఒక భాగంగా ఉపయోగిస్తున్నారే కాని, అందులో ఉన్న ప్రమాదాలను తెలియపరచటం లేదు.

ఇక చర్చలు అనే అంశం గురించి మాట్లాడాలంటే, నాకు పోప్ ఫ్రాన్సిస్ పెరుగ్వే పర్యటనలో చేసిన వ్యాఖ్యలు గుర్తుకొస్తాయి. ఈ రకమైన చర్చలు అనేవి సిద్ధాంతపరంగా రాకూడదు. అవి సంభాషణలోనే రావాలి. సంభాషణలలో, అభిప్రాయాలలో బహుళత్వం అనేది మంచిదని, అది అవసరమని గుర్తిస్తారు.

ఏకాభిప్రాయం అనేది మనల్ని కొన్నిసార్లు అచేతనులను చేస్తుంది. రోబోట్స్‌లాగా అవుతాము. జీవితం యొక్క గొప్పతనమే బహుళత్వం. నేను చర్చల కోసం ప్రయత్నిస్తున్నాను కాని అవతలి వాడు తప్పు వాదిస్తున్నాడని అనుకోవడం కంటే, అవతలివాడు తప్పు చేస్తున్నాడనే నేను ముందే ఊహించుకుంటున్నప్పుడు, ఆసలు చర్చలకే వెళ్ళాల్సిన అవసరం లేదు. చర్చ అనేది బేరం కాదు. బేరం అంటే నా వంతు ముక్కని సాధించుకోవటమే. చర్చ అనేది అందరికీ మంచి చేసేది. చర్చించటం, ఆలోచించటం, కలిసి అందరికీ ఉపయోగపడే సమాధానం రాబట్టడమే చర్చ. ఇతరుల ఆలోచనలను అర్థం చేసుకోవడంతో వారి అనుభవాలు, వారి ఆశయాలు మన ఆశయాలకు దగ్గరగా అనిపిస్తాయి.

> **"మనం ప్రతిపాదిస్తున్న సామాజిక ఎజెండా నిజంగా అంత అందం గానూ, లోతైనదిగాను, మార్పుకు ప్రత్యామ్నా యంగా నిలిస్తే, మెజారిటీ ప్రజానీకం యొక్క అవసరాలను ప్రతిబింబించేదయితే, మరి వీటిని ప్రతిపాదిస్తున్న వారు, ఆచరిస్తున్న వారు ఎందు కు విశాల ప్రజామద్దతు కూడగట్టలేక పోతున్నారు?"**

ఈ రోజు ప్రధానంగా "గుంజుకోవడం" మీద ప్రధాన చర్చ జరుగుతోంది కాబట్టి నేను రెండు ముఖ్య అంశాలు చెప్పదలచుకున్నాను. మనం మొట్టమొదట గుర్తించాల్సింది ఏమిటంటే మానవులు మొదటి నుండీ ప్రకృతి నుండి గుంజుకోవడం చేస్తూనే ఉన్నారు. చేస్తూనే ఉంటారు. ఇక్కడ సమస్య ఏమిటంటే, మానవుడు ఎలా గుంజుకుంటాడా అనేది కాదు. ఏ విధంగా పొందాలని ప్రయత్నం చేస్తాడనేది ప్రశ్న. మార్క్స్ చెప్పిన విధంగా మానవులు ప్రకృతి సమతుల్యాన్ని దెబ్బతీయకుండా ఎలా చేస్తారు అనేది. మొట్టమొదట సమాజంలో మానవుడు ప్రకృతిలో ఉన్న చెట్లనుండి ఫలాలు, సముద్రం నుంచి చేపలు సంపాదించారు. కాని ప్రకృతి సమతుల్యం దెబ్బతినకుండా చేశారు. ఎప్పుడయితే పెట్టుబడిదారీ సమాజం ఆవిర్భవించిందో, నాటినుండి లాభమే ప్రధాన ధ్యేయంగా నడిచిన మానవుడు ప్రకృతిని అడ్డగోలుగా కొల్లగొట్టడం ప్రారంభించి ఆ సమతుల్యాన్ని దెబ్బతీశాడు.

ప్రకృతి వనరులను మరింతగా కొల్లగొట్టడం వలన అది తీవ్ర నష్టం కలుగజేస్తుంది. పర్యావరణం దెబ్బతిని ప్రమాదకరమౌతుంది. దక్షిణ చిలీలో జపాన్‌కు చెందిన ఖండాంతరం కార్పొరేట్ కంపెనీలు అక్కడ ఉన్న స్థానిక చెట్లను నరికివేసి, వాటి స్థానంలో స్థానికంగా పెరిగే జాతులు ఆ వాతావరణానికి తగ్గట్టుగా నెమ్మదిగా పెరిగే వృక్షాలు కాకుండా, విదేశాల నుండి తెచ్చిన వృక్షజాతులను, అవి కూడా వేగంగా వృద్ధి చెందేవిగా, భూగర్భంలో ఉన్న నీటిని, వనరులను సమతుల్యత లేకుండా చేసే జాతులను పెంచుతున్నాయి. ఇక ఈక్వెడార్‌లో చెవ్రాన్ ఆయిల్ వారు అందిస్తున్న కాలుష్యాన్ని గురించి ఎంత చెప్పినా తక్కువే.

రెండవది, ఒక ప్రాంతంలో లభ్యమవుతున్న ప్రకృతి వనరులు, మినరల్స్, ఆయిల్, గ్యాస్, నీటిలోని జీవజాతులు, అటవీ సంపదలు కేవలం ఆ ప్రాంతంలో నివాసముంటున్న వారికే చెందుతాయని అనుకోవటం కూడా పొరపాటు. ఆ స్థానిక ప్రజల యొక్క హక్కులకు గట్టి మద్దతుదారులుగా మనం ఉండాలి. కాని అదే సందర్భంలో అక్కడ పనిచేసే కార్మికులందరి హక్కులు కూడా కాపాడాలి. వెనిజులా, ఈక్వెడార్‌లలో ఆయిల్ వనరులు, బొలీవియాలో గ్యాస్, చిలీలోని కాపర్ నిక్షేపాలు మనకు స్వర్గమిచ్చిన వరాలు లాంటివి. అవి మొత్తం సమాజానికి చెందాల్సిన వనరులు. అందుకే ఆ వనరులను వెలికితీయడమా లేదా అని సమాజం మొత్తం కలసి నిర్ణయించింది. అయినప్పటికీ ఆ ప్రాంతంలో నివసిస్తున్న స్థానిక ప్రజలు, ఆ పరిశ్రమలలో పనిచేసే కార్మిక వర్గంతో మాట్లాడి వారి అవసరాలను, వారి మనోభావాలను అర్థం చేసుకొని చర్యలు తీసుకోవాలి. ఈ రెండు అంశాలపై మనం కనుక ఒక ఒప్పందానికి రాగలిగి, ప్రస్తుతమున్న కాలంలో మనం అభివృద్ధి చెందాలంటే ఈ ప్రకృతి వనరులను ఎలా చిన్న చిన్నగా వాడుకోవాలి. తద్వారా ఒక ఆదర్శవంతమైన ఆర్థిక అభివృద్ధిని సాధించగలమో చూపించగలగాలి. అటువంటి దాని ద్వారానే ప్రకృతికి, మానవునికి మధ్య సమతుల్యాన్ని దెబ్బతినకుండా కాపాడగలుగుతాము.

ఇకపోతే విమర్శ అనే అంశాన్ని కనుక పరిశీలిస్తే, ఇటువంటి విమర్శలు చేయటానికి, వినియోగించటానికి తగిన విధంగా వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ప్రజలు స్వేచ్ఛగా చెప్పుకోగలిగిగే పరిస్థితి కల్పించాలి. లేకపోతే వారు సుషుప్తావస్థలోకి పోకుండా తమ అసంతృప్తిని అణిచిపెట్టుకొని, అశాంతితో జీవిస్తుంటే, అది పెరిగి పెద్దదయి ఎప్పుడో బ్రహ్మాండం బద్దలైనట్టు బయటపడుతుంది. అందుకని ఇటువంటి వ్యవస్థలు ఏర్పాటు చేయడం వలన సమస్యలను గుర్తించవచ్చు. వాటిని అధిగమించవచ్చు.

బొలీవియన్ రాజ్యాంగంలో సంఘటిత ప్రజానీకం సమస్యలను ఇలా గుర్తించొచ్చు. నిరసన తెలియచేయవచ్చు. వారి హక్కులకు భంగం కలిగినా, పర్యావరణ హక్కులకు భంగం కలిగినా ప్రశ్నించవచ్చని తెలిపింది. ఒక ప్రత్యేక న్యాయ ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేయబడింది. రసాయనిక ఉత్పత్తులు, పర్యావరణం, వ్యవసాయం, అటవీ సంపద, ఇతర పర్యావరణ అంశాలు అన్నింటికీ వర్తిస్తాయి. ఈ న్యాయాధిపతులు ఓటింగ్ హక్కు ద్వారా ఎన్నుకోబడతారు. ఆఖరుగా మనకు మనంగా ఒక ప్రశ్న వేసుకోవాలి. మనం ప్రతిపాదిస్తున్న సామాజిక ఎజెండా నిజంగా అంత అందం గానూ, లోతైనదిగాను, మార్పుకు ప్రత్యామ్నాయంగా నిలిస్తే, మెజారిటీ ప్రజానీకం యొక్క అవసరాలను ప్రతిబింబించేదయితే, మరి వీటిని ప్రతిపాదిస్తున్న వారు, ఆచరిస్తున్న వారు ఎందుకు విశాల ప్రజామద్దతు కూడగట్టలేక పోతున్నారు? నాకు తెలిసి మెజారిటీ లాటిన్ అమెరికన్ ప్రజానీకానికి కావాల్సినంత లోతుగా నీ సోషలిస్టు ప్రాజెక్టు యొక్క నిజ స్వరూపం, ఫలితాలు అర్థం కాలేకపోవడమే ప్రధాన లోపం. వీటిని తప్పుదోవ పట్టించడంలోను, తప్పుడు సంకేతాలు, భవిష్యత్తు గురించి భయాందోళనలు కల్పించడంలోనూ ప్రతిపక్షశక్తులు విజయం సాధిస్తున్నాయి. సోషలిస్టులుగా మనం కూడా దీనికి కారణభూతమౌతున్నాము. మన ప్రాజెక్టును ప్రచారం చేసుకోవడం, ప్రజల వద్దకు తీసుకెళ్ళటంలో విఫలమౌతున్నాం. తగినంత సమయాన్ని కేటాయించలేకపోవడం, వనరులను, సృజనాత్మకతను పెంచుకోలేక పోవడం మనం చేస్తున్నతప్పు. సోషలిస్టులుగా మనం ఏ ప్రాజెక్టునయితే ప్రచారం చేస్తున్నామో దానికి భిన్నంగా, అవినీతి రహిత సమాజం వంటి లక్షణాలకు భిన్నంగా మన భావనశైలి ఉండటం అన్నిటికన్నా తీవ్రమైనది. పెత్తనం చెలాయించే విధంగా, పక్షపాతిగా, పైకి కనిపించకుండా అనేక అవలక్షణాలను వెంటపెట్టుకొని ఉ

**"కాని ఎక్కువమంది ప్రజానీకాన్ని మనం ఎలా గెల్చుకోవాలి. మొట్టమొదట మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, వారిమీద మన భావాలను రుద్దటం కాదు, వారి హృదయా లను, మనసులను గెలుచుకోవాలి. మనం ఒక ప్రత్యేక కృషి కూడా చేయాలి. సామాజిక తరగతులలో సహజంగా ఎదిగిన అనేకమంది నాయకులు ఉన్నారు."**

ంటున్నాము. ఎందుకంటే అనేక సందర్భాలలో మనం చేసేదానికి, ఆచరణలో మనం భావించే దానికి పెద్ద అగాధమంత దూరం ఉండటం వలన ప్రజలు మనం చెప్పే దానిపై విశ్వాసాన్ని కోల్పోతున్నారు. అందుకే మనం ఆశ్చర్యపడాల్సిన దేమీ లేదు. లాటిన్ అమెరికన్ సమాజంలోని చాలా తరగతుల ప్రజానీకం మన సోషలిస్టు ప్రాజెక్టువైపు ఇంకా ఆకర్షితులవ్వకపోవడానికి ఇదే కారణం. వారందరినీ మెప్పించాల్సిన బాధ్యత మనమీద ఉంది.

కాని ఎక్కువమంది ప్రజానీకాన్ని మనం ఎలా గెల్చుకోవాలి. మొట్టమొదట మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, వారిమీద మన భావాలను రుద్దటం కాదు, వారి హృదయా లను, మనసులను గెలుచుకోవాలి. మనం ఒక ప్రత్యేక కృషి కూడా చేయాలి. సామాజిక తరగతులలో సహజంగా ఎదిగిన అనేకమంది నాయకులు ఉన్నారు. వారిని గుర్తించి, వారి విశ్వాసాన్ని కూడా మనం పొందేటట్లు చేయ గలిగితే వారి ప్రభావంలో విస్తారమైన ప్రజానీకం కూడా మనం గొడుగులోకి వస్తారు.

**ఒక నిర్మాణాత్మకమైన సంబంధం...**

అభ్యుదయకర ఉద్యమాలు, సామాజిక ఉద్యమాల మధ్య ఒక కొత్త సంబంధాన్ని మనం పటిష్టం చేయాలి. ఎన్నికలలో ప్రభుత్వాల విజయాల వెనుక ఇటువంటి దీర్ఘకాల చారిత్రక, సామాజిక పోరాటాలు కూడా ప్రధానపాత్ర పోషించాలనేది వారు మర్చిపోకూడదు. అలాగే ఈ ఉద్యమాలు, ఉద్యమకారులు కూడా ఈ ప్రభుత్వాలు తమ శతృవులు కాదని, వారి హక్కులని కాపాడేవని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్ళేవిగా చూడాలి. తమ సహజ మిత్రులుగా భావించాలి. ప్రస్తుతమున్న సమాజానికి భిన్నంగా ఒక లోతైన, బలమైన మార్పు దిశగా సమాజాన్ని నిర్మిస్తున్నామనే భావన ఇద్దరిలో ఉంటేనే వారి సంబంధం మరింత బలపడుతుంది. అయితే, ఈ బంధం ఫలితాలు ఇచ్చేదిగా ఉండాలంటే కొన్ని అంశాలు తప్పనిసరిగా గమనించాలి.

1. సామాజిక నాయకత్వం మర్చిపోకూడని అంశం ఏమిటంటే వారు సాధించిన రాజకీయ అధికారం ఒక భాగం మాత్రమేనని, మార్పులనే ప్రక్రియ చాలా నెమ్మదిగా జరుగుతుందని, జనరంజకమైన కోరికలను రాత్రికి రాత్రే తీర్చలేమని గుర్తించాలి.

2. ప్రభుత్వాలు కూడా అన్ని అంశాలను ప్రజలకు వివరించాలి. ఎన్ని పరిమితులకు లోబడి పనిచేస్తున్నామో సామాజిక ఉద్యమాలకి నాయకత్వం వహించేవారికి తెలియచేయాలి. ప్రజలు ఓర్పుతో, సహనంతో సహకరించాలని వివరించాలి. అది అంతిమంగా వారి విశ్వాసాన్ని పెంపొందించి, ఈ దీర్ఘకాల లక్ష్యాన్ని చేరుకోవడంలో వారిని పాత్రధారులుగా మార్చాలి.

3. ఈ రెండు వర్గాల మధ్య బంధం అంటే ప్రభుత్వానికి గుత్తాధికారం ఇచ్చినట్లు, ఇక ఉద్యమాలతో అవసరం లేదని అర్థం కాదు. ప్రభుత్వానికి ఊడిగం చేసే లేదా తొత్తు విభాగాలుగా మారకూడదు. ప్రభుత్వం తలపెడుతున్న మార్పులతో కూడిన విధానాలకు మద్దతునిస్తూనే, సంయుక్త బాధ్యతను నిర్వర్తిస్తూనే, ప్రభుత్వం చేస్తున్న తప్పుడు విధానాలను చర్చించడం కూడా వారి బాధ్యత. ఒకవేళ చర్చల ప్రక్రియ ఫలితాలను ఇవ్వకపోయినా, వినేవారు లేని పరిస్థితి వచ్చినా, అప్పుడు దాటిపోకుండా చూడాల్సిన అవసరం కూడా ఉంది.

ప్రభుత్వం ఏది చెప్పినా, ఏది తల పెట్టినా వాటిని గుడ్డిగా వ్యతిరేకించే అలవాటును ఈ సామాజిక ఉద్యమ నాయకత్వం వదులుకోవాలి. లేకపోతే వారి నాయకులనే ప్రభుత్వం ఏజెంట్లుగా, క్షమాపణలు చెప్పుకొనే వారిగా నిందించడం చేస్తుంటారు. ఇటువంటి అలవాట్లను, వినాశకర పద్ధతులకు విడనాడక పోతే, వారి సొంత సామాజికవర్గంలోనే వారు పునాదిని కోల్పోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే ప్రభుత్వ విధానాల యొక్క ఫలితాలను ప్రజలు నేరుగా చూస్తుంటారు. కాబట్టి వీరు అర్థం చేసుకొంటే వ్యతిరేకతను నిరసిస్తారు.

5) ప్రభుత్వం కూడా జాగ్రత్తగా గమనంలో ఉంచుకోవాల్సిన అంశం ఏమిటంటే, మనం ఏ సంస్కృతి నుండి వారసత్వం పొందామో అది గుర్తుంచుకొని, అనవసర పంతాలకు పోకుండా సర్దుబాటు చేసుకుంటూ, సామాజిక ఉద్యమ కారుల నాయకులతో ఓపిగ్గా చర్చిస్తూ సహనంతో పనిచేయాలి. అందులో మీరు గుర్తించాల్సిందే మిటంటే, తనకున్న జనాదరణని అడ్డం పెట్టుకొని, ఈ సామాజిక మార్పుని అడ్డుకునే విధంగా కావాలనే ప్రయత్నించేవారెవరు? అలాగే పాతకాలపు అలవాట్ల వలన, సమగ్ర సమాచారం, అవగాహన లేక తెలిసీ తెలియక తప్పు ధోరణులలో వెళ్ళేవారెవరు అనేది స్పష్టంగా గుర్తెరిగి జాగ్రత్త వహించాలి.

**మనం పురోగమనంలో ఉన్నామా? తిరోగమనంలో ఉన్నామా?**

1. కార్మికవర్గం బలపడేవిధంగా చేయాలి. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలి. సార్వజనీన సామాజిక భద్రతా విధానాన్ని తేవాలి. యూనియన్లను ప్రోత్సహించే విధంగా ఉండాలి. కార్మికుల విద్య, వృత్తి నైపుణ్యం పెంపొందించే విధానాలను అమలు చేయాలి.

2) సామాజిక సంస్థల, ట్రేడ్ యూనియన్ల స్వయం ప్రతిపత్తిని గౌరవించాలి.

3) సంఘటితమైన, రాజకీయ చైతన్యంగల ప్రజల అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. అలా గుర్తిస్తేనే వారు కూడా వారసత్వంగా, సాంప్రదాయకంగా వచ్చిన బూర్జువా అధికార యంత్రాంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా ఒత్తిడి తేగలుగుతారు. మార్పుకి తోడ్పడగల సానుకూల అంశాలను ముందుకు తీసుకెళ్ళగలుగుతారు.

4. ప్రజలు చెప్పేది వింటారా? వారిని మాట్లాడనిస్తారా? ప్రజలమీద నమ్మకముంచితేనే ఈ సామాజిక మార్పులో వచ్చే తప్పిదాలు, పొరబాట్లు, అవాంతరాలను అధిగమించగలమని వారు అర్థం చేసుకున్నారా? గుర్తించారా?

5) ప్రజలకు కావాల్సిన వనరులను అందిస్తున్నారా? అలా అందించి ఈ మార్పుకి కావాల్సిన సామాజిక బాధ్యత, నిర్ణయాత్మకతకు వారినీ బాధ్యులుగా చేస్తున్నారా?

ముగింపుగా, అంతిమ లక్ష్యం చేరుకొనే దశలోలానే ఒక నిర్మాతగా, ఒక హీరోగా, క్రియాశీలక పాత్ర పోషించాలనే బాధ్యతను ప్రజలలో కల్పించటానికి ప్రభుత్వమే తనవంతు పాత్ర పోషించి, ఈ ప్రజారంజక విధానాన్ని పెద్దఎత్తున ప్రచారం చేయాలి.

**అనువాదం : ఎల్.ఎన్. భారవి**

# బానిస వ్యాపారం రద్దు రాజకీయాలు

జేమ్స్ వాల్విన్

బ్రిటన్‌లో 1807వ సంవత్సరంలో రద్దు చేయబడిన బానిస వ్యాపారం రెండు వందల సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న ఈ తరుణం, ప్రజా సంబంధాలలో ఓ సుహృద్భావ వాతావరణాన్ని కలుగజేయడానికి మంచి అవకాశం. నరజాతిలోని భిన్న తెగల మధ్యనున్న వైరుధ్యాలకు, మతపరమైన దౌర్జన్యాలకు స్వస్తిపలికి, చట్టబద్ధంగా బానిస వ్యవస్థను నిర్మూలించడమనేది ప్రపంచానికో శుభ పరిణామం. 1807వ సంవత్సరానికి ముందు అమెరికాలో చెట్లు పెంచడానికి ఆఫ్రికన్లను పంపడంలో బ్రిటన్ ఆధిపత్యం వహించేది. 1807వ సంవత్సరం తర్వాత రాయల్ నేవీ ప్రపంచవ్యాప్తంగా బానిన వ్యాపారాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. 18వ శతాబ్దంలో చట్టవిరుద్ధంగా బానిసలను తరలించడంలో (ముప్ఫై లక్షల మంది ఆఫ్రికన్ బానిస లను బ్రిటీష్ నౌకలు రవాణా చేశాయి) అందె వేసిన చేయిగా ఉన్న బ్రిటన్ 19వ శతాబ్దానికి వచ్చేసరికి స్వీయ కాపలాదారుగా మారి మరెవ్వరినీ ప్రవేశించనీయలేదు. చట్టబద్ధంగా తాను చేసినదానికి భిన్నంగా వ్యూహాత్మకంగా వ్యవహరించింది. 1807వ సంవత్సరానికి విస్తృతంగా శోధించినట్లయితే బానిస విధానం రద్దు సమస్యలతో కూడి కనిపిస్తుంది. అంతర్లీనంగా చారిత్రికమైన, నైతికమైన చిక్కు ప్రశ్నలు చాలా కనిపిస్తాయి.

బానిస వ్యాపారం రద్దుకు పూర్వం అమెరికాలోని వివిధ ప్రాంతాలలో ఆధిపత్యం కోసం జాతిపరమైన బానిసత్వం భారీస్థాయిలో యూరోపియన్ల ఆధీనంలో ఉండేది. అమెరికాలో మొక్కల పెంపకానికి భారీస్థాయిలో మనుషుల అవసరం ఉండటం వలన, లక్షల మంది ఆఫ్రికన్లు బానిసలుగా సముద్ర మార్గంలో రవాణా చేయబడేవారు. క్రమానుగతంగా ఎలాంటి సిద్ధాంతపరమైన, తాత్త్వికపరమైన కారణాలు లేకుండానే యూరోపియన్లు అమెరికాలో బానిసలుగా మారిపోయారు (అప్పటికి యూరప్‌లో బానిస విధానాన్ని రద్దుచేశారు.) వివిధ ప్రాంతాలలో విస్తృతంగా మొక్కలు నాటడానికి, పెంచడానికి కూలీల అవసరం ఎక్కువయ్యింది. అయితే ఆఫ్రికన్లే ఎందుకు? బానిసలే ఎందుకు? ('బానిస' అన్న పదాన్ని చరిత్రకారులు ఉపయోగించడానికిష్టపడటం లేదు. క్లిష్టమైన అర్థమైనప్పటికీ 'దాసులు' అన్న పదాన్నే ఇష్టపడుతున్నారు)

తొలిరోజుల్లో యూరోపియన్ నావికులు, సాహసికులు, వ్యాపారవేత్తలు కేవలం నాణ్యతగల వ్యాపార వస్తువులు, మరీ ముఖ్యంగా పశ్చిమాఫ్రికాలో లభించే "బంగారం" కోసం మాత్రమే వెళ్ళేవారు తప్ప, బానిసల కోసం కాదు. సాంప్రదాయ వ్యాపార పద్ధతుల నుండీ క్రమంగా ఆఫ్రికన్లను బానిసలుగా కొనడం, అమ్మడం ప్రారంభమైంది. పోర్చుగల్, స్పెయిన్ వరకూ ఆఫ్రికన్లను నౌకల్లో తీసుకొచ్చి, వారిని అట్లాంటిక్ ద్వీపాలకు చేర్చి, శక్తి సామర్థ్యాల కనుగుణంగా విభజించి, ఒక్కొక్కరికీ ఒక్కో సంఖ్యను కేటాయించి, అధీకృత బానిసలుగా మార్చడం ఆరంభమైంది. 15వ శతాబ్దం మధ్యంతరానికి ఎనిమిది వందల మంది ఆఫ్రికన్లు బానిసలుగా పోర్చుగల్ చేరారు. బంగారం, సుగంధ ద్రవ్యాల రవాణాపై యూరోపియన్లకు మక్కువ ఏమాత్రం తగ్గకపోయినప్పటికీ, చెరకు పంట పెంచడంతో పరిస్థితి మొత్తం మారిపోయింది.

మెడిటరేనియన్ తీరం నుండి తరలించి అట్లాంటిక్ ద్వీపాలలో చెరకు పంటను పండించడం ప్రారంభమైంది. ఆఫ్రికన్ తీర ప్రాంతాలలోని ద్వీపాల్లో సైతం చెరకు పండించటం ప్రారంభించారు. యూరోపియన్ మార్కెట్‌లోకి కాఫీ, టీలు అప్పుడే ప్రవేశించాయి. రెండు ద్రవాలు చేదుగానే ఉండటం వలన, వాటిలో కలుపుకోవడానికి మార్కెట్‌లో ఎక్కువ మోతాదులో పంచదార అవసరమైంది. చెరకు పంట ఎంత ఎక్కువగా పండిస్తే అంత ఎక్కువగా ఆఫ్రికన్ కూలీల అవసరం కూడా ఏర్పడింది. బానిసలతో వ్యాపారం చేస్తున్న యూరోపియన్‌లకు ఇది లాభదాయకంగా మారింది. కారణం, ఒకచోట బానిస వ్యాపారంతో సమస్యలెదురైనా, మరోచోట వారి అవసరం ఉండటం విస్తారమైన ఆఫ్రికా తీరప్రాంతం వ్యాపారస్తులకు లాభించింది. అట్లాంటిక్ తీర ప్రాంతాల్లో జరిగిన అనేకానేక ఘటనల వలన, క్లిష్టమైన మూలాల్లో నుంచీ బానిసల వ్యాపారం విస్తారంగా పెరిగి శతాబ్దాలు కొనసాగింది.

ప్లాంటేషన్ కార్మికులకు సంబంధించిన నిబంధనలకు కట్టుబడి ఉండటానికి ఇండియన్స్ సార్వత్రికంగా వ్యతిరేకించటంతో స్థానికంగా స్థిరపడిన కూలీలతో చెరకు పండించాలన్న ప్రయత్నాలు విఫలమవ్వటం ప్రధాన కారణం కాగా, అంతుబట్టని రోగాలు, వ్యాధుల బారిన పడిన కూలీలు మరో కారణం. వలస వెళ్ళిన యూరోపియన్లు తగు మొత్తంలో లేకపోవడం, అదృశ్యమవుతున్న, మరణిస్తున్న కూలీల వలన అప్పటికే స్థిరపడిన వారు స్పెయిన్, పోర్చుగల్, అట్లాంటిక్ ద్వీపాల్లోని బానిస వ్యాపారంపై అనివార్యంగా ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడింది. 1600వ సంవత్సరానికి విస్తరిస్తున్న బ్రెజిల్ చెరకు పరిశ్రమ, ఆఫ్రికన్ బానిసల వలన పొందుతున్న లాభాన్ని నిరూపించింది. కానీ అది లాభాల విషయంలో ఆఫ్రికన్లకు ఏమాత్రం సహకరించలేదు. ఫ్రెంచి వారితో కలిసి ఆలస్యంగా వచ్చిన బ్రిటీష్ వారు సైతం 1620లో కరేబియన్ ద్వీపాలను ఆక్రమించిన తర్వాత ఆ దిశగా అత్యుత్సాహంతో తమ దృష్టి మళ్ళించారు.

నూతనంగా వచ్చిన ఈ వ్యాపార పద్ధతి మూడు ఖండాల ప్రజల ఆర్థిక స్థితిగతులకు అత్యంత సన్నిహితంగా అల్లుకుపోయింది. యూరోపియన్లు తమ ప్రాంతంలో, తర్వాత ఆసియాలో ఉత్పత్తి అయిన సరుకుతో ఆఫ్రికా తీర ప్రాంతానికి వచ్చి ఆఫ్రికన్లకు వస్తు మారకం చేసేవారు. ఆ ప్రాంతంలోని మొక్కలను, ఆఫ్రికన్ బానిసలను తమ శక్త్యానుసారం యూరోపియన్లు నౌకల నిండుగా తీసుకొని వెళ్ళేవారు. వ్యవసాయాధారిత పరిశ్రమల వృద్ధి విజయవంతంగా ఆరంభమైంది. ఉదా:- చెరకు పంటకు, చక్కెర కర్మాగారాలు హృదయంగా మారాయి. ఇదే విధానం మిగిలిన ప్రాంతాలకు, పంటలకు సైతం సులభంగా వ్యాపించింది. చేసాపీక్‌లో పొగాకు, కాలిఫోర్నియాలో బియ్యం, ఎత్తైన ప్రాంతాలలో కాఫీ, 19వ శతాబ్దానికల్లా యునైటెడ్ స్టేట్స్‌లో ప్రత్తి మొదలగునవి. సాంస్కృతిక, ఆర్థిక మార్పులు అనతికాలంలోనే విస్తృతమయ్యాయి. ప్రతిచోటా ఆఫ్రికన్ల ఆధారంగానే వ్యవస్థ అధీకృతమైపోయింది.

అధిక శాతం ఆఫ్రికన్ల అవసరం ఏర్పడింది. అధికారిక లెక్కల ప్రకారం 35 వేల మంది బానిసలు రవాణా చేయబడ్డట్లు చెప్పినా, 1860 సంవత్సరం వరకూ అట్లాంటిక్

> **"మొదటగా పెద్ద సంఖ్యలో నమోదైన బానిసల కేసులు ఇంగ్లాండ్‌లో బానిసత్వం చట్ట బద్ధతపై చర్చను ముందుకు తెచ్చాయి. గ్రాన్‌విల్లెషార్ప్' అనే ప్రచారకర్త ఇంగ్లాండ్‌లోని చట్టబద్ధత లేని బానిసత్వంపై 1760వ సంవత్సరం నుండి పోరాటం ప్రారంభించాడు."**

వ్యాపారం సుమారు 40 వేల మందితో జరిగింది. కోటి ఇరవై లక్షల మంది ఆఫ్రికన్లు బానిసల నౌకల్లో పంపబడగా, దాదాపు కోటి మంది అమెరికా నలుచెరగులా వ్యాపించారు. ముఖ్యంగా బ్రెజిల్, కరేబియన్ ప్రాంతంలో (మొత్తం పంపకంలో ఉత్తర అమెరికాకు 10 శాతం కన్నా ఎక్కువే దక్కారు) 70 శాతం మంది ఆఫ్రికన్లు చక్కెర పరిశ్రమలున్న ప్రాంతాలకు తరలించబడ్డారు.

వ్యాపారం విస్తృతమవుతున్న కొలదీ ఆర్థిక, సామాజిక అంశాలు విస్తరిస్తూ, కొద్దో గొప్పో ఉన్న ప్రతికూలతను అణగద్రొక్కి, వ్యాపారం లాభదాయకంగా మారింది. దాదాపు శతాబ్దంన్నర కాలం బానిస వ్యాపారానికి సంబం ధించిన చట్టాల విషయంలో పార్లమెంటు సైతం సహకరించింది. బానిసల కాలనీలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పింది. బానిసల ఆధారం గా వృద్ధిచెందే ఆర్థిక విధానాలను అభివృద్ధి చేసింది. మతపరమైన, నైతికపరమైన సమస్యలను అణగద్రొక్కింది.

మొదటి నుంచీ బానిస బంధనాలు తెంచుకోవడానికి, దాస్యాన్ని ఉపశమింప చేసుకోవడానికి జరిగిన యత్నాలు సరిగ్గా ఫలించలేదు. అట్లాంటిక్ తీరాన్ని దాటి మొక్కల పెంపకానికి బానిసలుగా వెళ్ళేవారు, బానిసత్వంతో బాధలు పడుతున్న వారందరూ తమ అభ్యంతరాలను వెలిబుచ్చారు. దాదాపు 10 శాతం బానిస నౌకలు ఏదో ఒక తిరుగుబాటు ధోరణిని చవిచూశాయి. ఈ తిరుగుబాటు చూసిన బానిసల వ్యాపారస్థులు శాశ్వత భయానికి లోనయ్యారు. తోటల యజమానులు సైతం తమవద్ద పనిచేసే బానిసల వలన ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. బానిసల ఆగ్రహం సర్వవ్యాపకమైనప్పుడే మొక్కల పెంపకం కూలీల ఆగ్రహం అందరికీ అర్థమైంది. అయినప్పటికీ ఎవ్వరెంత విమర్శించినా శతాబ్దాల తరబడి బానిసత్వం కొనసాగింది.

ఆ తర్వాత అతి కొద్ది కాలానికే బానిస సామ్రాజ్యం కూలడం ఆరంభించింది. ప్రధానంగా 'బానిసత్వ వ్యాపారం రద్దు' మూల కారకమైంది.

ఫ్రెంచి, స్కాట్‌లాండ్ సాహిత్యాలలో బానిసత్వానికి వ్యతిరేకంగా మేధోపరమైన రచనలు వెలుగులోకి వచ్చాయి. బ్రిటన్ బానిస విధానం రద్దుకు సంబంధించిన మూలాలు త్వరితగతిన బయటికి వచ్చాయి. మొదటగా పెద్దసంఖ్యలో నమోదైన బానిసల కేసులు ఇంగ్లాండ్‌లో బానిసత్వం చట్టబద్ధతపై చర్చను ముందుకు తెచ్చాయి. గ్రాన్‌విల్లెషార్ప్' అనే ప్రచారకర్త ఇంగ్లాండ్‌లోని చట్టబద్ధత లేని బానిసత్వంపై 1760వ సంవత్సరం నుండి పోరాటం ప్రారంభించాడు. ఆఫ్రికన్లకు ఇష్టం లేకుండా వారిని బానిస కాలనీలకు పంపడాన్ని సైతం వెలుగులోకి తెచ్చాడు. 1722లో లార్డ్ మ్యాన్‌ఫీల్ట్, సోమర్‌సెట్ కేఫ్ విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇంగ్లాండ్‌లో బానిసత్వం బలహీనపడింది. వాస్తవానికి ఇంగ్లాండ్‌లోని నల్లజాతీయులను చట్టపరంగా గెంటివేయకూడదు. కష్టాల్లో, బాధల్లో ఉన్న ఆఫ్రికన్లకు వ్యక్తిగత స్నేహితుడిగా మారిన 'షార్ప్' వారందరి తరపునా అవిశ్రాంత పోరాటం చేసిన ఇంగ్లీష్ హీరో.

1787లో ఏర్పరిచిన బానిసత్వపు రద్దు కమిటీ వలన ఈ పోరాటం ముందుకు సాగింది. కొద్దిమంది చర్చికి సంబంధించిన వారు, ఎక్కువమంది సంఘ సేవకుల( క్వేకర్స్)తో ఏర్పాటైన ఈ కమిటీ బానిసత్వాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని భావించింది. అంతేగాక సాధ్యాసాధ్యాలను, రాజకీయ లక్ష్యాలను సైతం దృష్టిలో ఉంచుకొని బానిస వ్యాపారం రద్దు కోరింది. నిష్పత్తిలో శాతమెంతయినా కమిటీలోని సంఘ సేవకులు కీలక పాత్ర పోషించారు. బానిసత్వం రద్దు వలన ఉత్పన్నమయ్యే అవసరాల కోసం ఉత్తర అమెరికాలోని సంఘ సేవకులతో ఉన్న సంబంధాల వలన ఓ బలమైన జాతీయ స్థాయి సంస్థను నిర్మించారు. విద్యాధికులు, రచయితలు, పబ్లిషర్లు మాత్రమేగాక ప్రజల నుత్తేజపరుస్తూ ప్రసంగించే వక్తల కోసం వసతి కూడా ఏర్పాటు చేశారు. తత్ఫలితంగా జాతీయస్థాయిలో 'రద్దు' త్వరిత గతిన విస్తరించింది. బానిసత్వం నుండి విముక్తులైన వేలమంది బంధనాలు తెంచుకొని అత్యంత సమర్థవంతంగా, కొన్ని వారాల్లోనే బ్రిటన్ నలుచెరగులా వ్యాపించారు. విముక్తి సమయంలో ఓ విశిష్ట పరిశోధకుడు, వక్త, దేశమంతా అవిశ్రాంతంగా కాలినడకతోనే ప్రయాణం చేసి, ఎక్కడకు వెళ్ళినా ప్రజలనుద్దేశించి ప్రసంగం చేస్తూనే, పార్లమెంటుకు సంపూర్ణ నివేదిక అందించిన 'హిల్బర్ ఫోర్స్' గూర్చి థామస్ క్లార్క్‌సన్ రచించిన "అవిశ్రాంత కాల్బల సైనికుడు'లో వివరించాడు. క్రమేపీ రాజకీయ నాయకుడిగా ఎదిగి అత్యంత కీలక పాత్ర వహించిన హిల్బర్ ఫోర్స్‌ను 1807లో ఏర్పడిన చట్టానికి కీలక పాత్రధారిగా ఆనాటి ఎం.పి.లందరూ కీర్తించారు.

1787 తర్వాత బానిసత్వ రద్దు అమలులోకి రావడమేగాక, అతి తక్కువ కాలంలో ఊహించనంత స్థాయిలో ప్రాముఖ్యత సంతరించుకుంది. దేశం నలుమూలల నుండీ, వివిధ సామాజిక వర్గాల నుండీ స్త్రీలు, పురుషులు తమ పేర్లను సైతం చేర్చి, విముక్తి ప్రసాదించాలన్న డిమాండ్ వచ్చింది. విముక్తి సెంటిమెంట్ సంతరించుకున్న ప్రాధాన్యత వలన కార్యక్రమ నిర్వాహకులు ఓ అడుగు వెనక్కి వేసి కొంత సమయం తీసుకున్నారు. భూస్వాములతో నిండి ఉన్న పార్లమెంటులో గెలవాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉంది. 1788 తర్వాత జరిగిన బానిస వ్యాపారం గురించి వివిధ పార్లమెంటరీ కమిటీలు ఆధారాలు స్వీకరించడం ప్రారంభించాయి. థామస్ క్లార్క్‌సన్ సమర్పించిన ఆధారాలు భయానకంగా, ఆశ్చర్యకరంగా ఉన్నాయి. వేలమంది ఆఫ్రికన్లను, వారి సంతానాన్ని బానిస వ్యాపారంలో ఎంత దారుణమైన బాధలకు గురిచేశారో, ఏ విధంగా ఖరీదుకు అమ్మకాలు జరిగాయో వెలువరించిన వాస్తవాలు పార్లమెంటు లోపలా, బయటా ప్రజలను విభ్రాంతికి గురిచేశాయి. బానిసలపై జరిగిన ఈ దారుణం ప్రజలను, పాలకులను విస్మయానికి లోనుచేసింది. వేలాది మంది బానిసలను ఊహించసాధ్యం కాని అసాధారణమైన బాధలకు గురిచేయటం వలననే బానిస వ్యాపారం లాభదాయకమైందని ప్రజలకు స్పష్టమైంది. ఈ విధానం లాభదాయకంగా ఉందని కొందరు అనుమానపడ్డారు, మరికొందరు వాదించారు.

“బానిస వ్యాపారాన్ని దెబ్బకొట్టడం కరేబియన్ ద్వీపాలను ఆక్రమించాలన్న నెపోలియన్ ప్రణాళికలను నీరుగార్చటానికి, బానిస వ్యాపారం రద్దు నైతికంగా, వ్యూహాత్మకంగా ఉపయోగపడింది. 1806లో పరాయి దేశాల కాలనీలలో బానిసల వ్యాపా రాన్ని నిషేధిస్తూ పార్లమెంట్ చేసిన చట్టం, ఫ్రెంచి వారి వ్యాపారాసక్తులపై వేటు వేయడానికే.”

వ్యాపారంలో తలమునకలైన వర్తకులు, దళారీలు, తోటల యజమానులు తమను తాము సమర్థించుకుంటూ వాదనలు చేశారు. ఆర్థిక వైఫల్యం వలన వారు తమ అపజయాన్ని అంగీకరించలేదు. వాస్తవానికి 1787 తర్వాత బానిసల వ్యాపారం విస్తృతమైంది. ఈ దశాబ్దంలోనే మూడు లక్షల పై చిలుకు ఆఫ్రికన్లను వెయ్యి నౌకల్లో అమెరికా తరలించారు. ఆఫ్రికన్ల పట్ల మానవత్వం కలిగిన వారందరూ ఈ వ్యాపారంలో మౌనాన్నే ఆశ్రయించారు. అయినప్పటికీ వ్యాపారానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన బలహీనతలు అప్పటికే ఉన్నాయి. బ్రిటిష్ ద్వీపాల ద్వారా యూరోపియన్ బానిస కాలనీలకు, మరీ ముఖ్యంగా ఫ్రెంచ్ ద్వీపాలకు ఓడల ద్వారా భారీ సంఖ్యలో ఆఫ్రికన్లు తరలించబడ్డారు. క్రమంగా స్థానికంగా బానిసల సంఖ్య పెరగసాగింది. ఫ్రెంచి విప్లవం మొదట బానిసల విముక్తిని ప్రోత్సహించింది. కానీ క్రమంగా ఏర్పడిన గందరగోళ పరిస్థితుల వలన విప్లవం అయోమయంలో పడింది. 1771లో ఉధృతంగా వచ్చిన సెయింట్ డెమిన్ గ్యూ / హైతి బానిస తిరుగుబాటు, తర్వాత 1793లో ఫ్రాన్స్‌తో జరిగిన యుద్ధం బానిస విముక్తినే పట్టాలు తప్పించింది. బానిసల వలన చెలరేగిన హింస, అనుకోకుండా బానిస వర్తకులకు ఉపయోగపడింది. బానిసల గురించి తాము చెప్పిందే సరైనదని వారు వాదించారు. ఇదే సందర్భంగా బానిసత్వ విముక్తిపై పునరాలోచనకి వెళ్ళే విపత్తు సంభవించడం జరిగింది. తొలిరోజు విముక్తిని బలంగా సమర్థించిన “పిట్” సెయింట్ డొమింగ్ విప్లవంలో లాభదాయక పరిస్థితులను చూశాడు. కానీ బ్రిటీష్ వారు చేసిన దాడి వలన భారీ స్థాయిలో మిలిటరీ విపత్తు జరిగి, గాయాలు, వ్యాధులతో, మాజీ బానిసల బృందంతో బ్రిటన్ ఓటమి పాలయ్యింది. బానిస విముక్తి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంది.

నూతన శతాబ్దారంభంలో తిరిగి పునరుద్ధరించ బడింది. బానిసత్వ రద్దుకు అనుకూలురైన ఫాక్స్, గ్రీన్‌విల్లే అధికారాన్ని చేపట్టడం, ఫ్రాన్స్ ద్వీపాలలో బానిసత్వాన్ని తిరిగి పునరుద్ధరించాలన్న నెపోలియన్ ప్రయత్నాలు ఇందుకు కారణమయ్యాయి. బానిస వ్యాపారాన్ని దెబ్బకొట్టడం కరేబియన్ ద్వీపాలను ఆక్రమించాలన్న నెపోలియన్ ప్రణాళికలను నీరుగార్చటానికి, బానిస వ్యాపారం రద్దు నైతికంగా, వ్యూహాత్మకంగా ఉపయోగపడింది. 1806లో పరాయి దేశాల కాలనీలలో బానిసల వ్యాపారాన్ని నిషేధిస్తూ పార్లమెంట్ చేసిన చట్టం, ఫ్రెంచి వారి వ్యాపారాసక్తులపై వేటు వేయడానికే. దీని ద్వారా బ్రిటిష్ వ్యాపారంపై దెబ్బపడింది. 1807వ సంవత్సరంలో బానిసల వ్యాపారాన్ని రద్దు చేస్తూ చేసిన చట్టాన్ని స్మరిస్తూ ఈ సంవత్సరం కార్యక్రమం చేపట్టడమంటే తుదికంటా అరికట్టడమే! పార్లమెంట్‌లో జరిపే ఉత్సవాలు (1807సం॥లో కేవలం 16మంది మాత్రమే వ్యతిరేకంగా ఓటు వేశారు) “విల్బర్ ఫోర్స్” పై కేంద్రీకృతమయ్యాయి. కానీ ఒకే ఒక్కవ్యక్తి ఆధారంగా ప్రారంభమయ్యే రాజకీయ మార్పులు ఆమోద యోగ్యమా? అంతేగాక బ్రిటిష్ వారి స్వలాభం, ఆసక్తి లేకుండా ప్రధానమయిన మార్పు సంభవిస్తుందా? “ఎరిక్ విలియమ్స్ తన తొలి పుస్తకం “పెట్టుబడి దారీ విధానం, బానిసత్వం''లో ఎదుర్కొన్న వారసత్వాన్ని కొనసాగించగలమా? ఎలాంటి ఆర్థిక కారణాలు లేకుండా ఈ కథ నడుస్తుందా? 1807లో జరిగిన బానిసల రద్దు చట్టానికి, ప్రస్తుత ఆర్థిక విధానాలకు ఏమైనా సంబంధముందా? చరిత్రకారులు తమ వాదనను 'విలియమ్' సిద్ధాంత గ్రంథం చుట్టూనే తిప్పుతున్నారు. నా విషయంలో కూడా, క్రమంగా నేను సైతం నా ఆలోచనను మార్చుకున్నాను. ప్రస్తుతం ఈ వాదనను అంతగా ఒప్పించవలసిన అవసరం లేదు. కారణం గతంలో కన్నా విస్తృతంగా అందరూ ఈ సత్యాన్ని అంగీకరించారు. ఈ ఆధారాలేవీ నిజానికి అంత త్వరగా అంగీకరించ బడలేదు. తర్వాత కాలంలో, దాడులు జరిగిన సమయంలో బానిసల వ్యాపారంలో మరింత వృద్ధి జరిగింది. ఆఫ్రికన్ల డిమాండ్ ఎక్కువగా ఉన్న తరుణంలో వ్యాపారం అంతం చేయబడింది. బానిస వ్యాపారం ద్వారా లభించే అధిక లాభాలను నియంత్రించడానికి ఈ ప్రయత్నం జరిగింది. 1807కు ముందు బ్రిటన్ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత నష్టం కలిగించడమే లక్ష్యం అన్నది స్పష్టం కాదని ఎలా త్రోసిపుచ్చ గలం? అవునన్నా కాదన్నా, అట్లాంటిక్‌పై ఆధారపడిన వ్యాపారమంతా ఆర్థిక అభివృద్ధి కోసమూ, ఉన్నతి కోసమే! అయితే ఇది ఆఫ్రికాకు గానీ, ఆఫ్రికన్లకు కానీ లాభించలేదు.

బానిస వ్యాపారం వలన ఆర్థిక విలువ పెరగడం చాలా సుస్పష్టం, కాదనలేని సత్యం. పెద్దపెద్ద నౌకల నిర్మాణం, నిర్మాణానికవసరమైన సామాగ్రిని ఉత్పత్తి చేసే పరిశ్రమల ఆవిర్భావం బానిస వ్యాపారం జరుగుతున్న కాలంలో, అందులో అంతర్భాగంగానే జరిగాయి. వేలమంది బానిసలను తరలించే నౌకల్లో వస్తుసామాగ్రిని సైతం నిండా నింపి పంపేవారు. బ్రిటీష్ కర్మాగారాల్లో తయారవుతున్న వివిధ వస్తువులు ఉదా:- పశ్చిమ ప్రాంతంలో ఉండే దుస్తులు తర్వాత కాలంలో “లాంక్‌షైర్” నుండీ, షెఫ్ఫీల్డ్ నుండి లోహపు వస్తువులు, బర్మింగ్‌హామ్ నుండీ తుపాకులు మొదలగునవి పంపేవారు. అమెరికా కాలనీల్లో నివసించే బానిసలు పెంచే తోటలకు సైతం పై వస్తువుల అవసరం ఉండేది. చెరకు పరిశ్రమలో పనిచేసే ఆఫ్రికన్లు దిగుమతయిన బట్టలు, టోపీలు ధరించేవారు. పొలాల్లో పను లు చేయడానికి పరికరాలు, గొడ్డళ్లు వాడేవారు. జంతువులను దిగుమతి చేసుకున్న తోలుతో నియంత్రించేవారు (బానిసలను దిగుమతైన కొరడాలతో కొట్టేవారు) వ్యవసాయ దారుల ఇళ్లన్నీ బ్రిటీష్ పరిశ్రమలలో ఉత్పత్తి అయిన రకరకాల వస్తువులతో, వంట సామాగ్రితో, పింగాణీ వస్తువులతో టేబుళ్లన్నీ నిండి ఉండగా, అలమారాలన్నీ పుస్తకాలతో నిండి ఉండేవి. ఆఖరుగా బానిసలు పండించిన పంటలతో బ్యారన్‌లు, బేళ్లు నిండిపోయేవి. తిరుగు ప్రయాణంలో నిండుగా వెళ్లే నౌకలు అట్లాంటిక్ ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తుల పంపకానికి, రిటైల్ వ్యాపారానికి సహకరించాయి. సామాన్య ప్రజానికానికి, లక్షల మంది వినియోగదారులకు అందడానికి గానూ షాపులకు చేరకముందే బ్రిస్టోల్, లివర్ పూల్ పరిశ్రమలకు చక్కెర, “చేసపేక్” నుండీ పొగాకు, “గ్లాస్గో”లోని గిడ్డంగులకు సామాగ్రి చేరేవని

> **"బానిస కూలీల శ్రమ ఫలితంగా బ్రిటిష్ పట్టణ జీవితాల్లో మార్పువచ్చింది. భూ ఉపరితలం అందంలోనూ, దుస్తుల విధానం లోనూ స్పష్టమైన మార్పును చూడవచ్చు. గ్లాస్గోలోని పొగాకు గిడ్డంగుల వద్ద నిర్మించిన భవంతులను, వ్యాపారస్థులు నిర్మించుకున్న సుందర హర్మ్యాలను, ముఖ్యగా బ్రిస్టోల్, లివర్‌పూల్ ప్రాంతాల్లో గమనించవచ్చు."**

ఆడమ్ స్మిత్, నెపోలియన్ వ్యాఖ్యానించారు.

బానిస కూలీల శ్రమ ఫలితంగా బ్రిటిష్ పట్టణ జీవితాల్లో మార్పువచ్చింది. భూ ఉపరితలం అందంలోనూ, దుస్తుల విధానం లోనూ స్పష్టమైన మార్పును చూడవచ్చు. గ్లాస్గో లోని పొగాకు గిడ్డంగుల వద్ద నిర్మించిన భవంతులను, వ్యాపారస్థులు నిర్మించుకున్న సుందర హర్మ్యాలను, ముఖ్యగా బ్రిస్టోల్, లివర్‌పూల్ ప్రాంతాల్లో గమనించవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం బానిస కాలనీల నుండీ మంచి ఆదాయం పొందిన ప్రజల కళాత్మక, కనులకింపైన గృహాల్లో కూడా చూడవచ్చు. ఉదా:- యార్క్‌షైర్ లోని హేర్‌వుడ్ హౌస్, బాంగోర్ లోని "పెంహ్రన్" భవనం బ్రిటన్‌లో పద్దెనిమిదో శతాబ్దపు మధ్యంతర కాలాన్ని ఒక్కసారి తట్టితే, అట్టడుగునున్న బానిసత్వం ఉపరితలానికి అలా ఊరుతుంది/ వస్తుంది. ఉదా :- 1780వ సంవత్సరంలో బ్రిస్టోల్ ప్రజల ఆదాయంలో నలభైశాతం బానిసల శ్రమ ఫలితంగా వచ్చింది. లివర్‌పూల్‌లో సైతం ఇదే పరిస్థితి. మిగిలిన ప్రాంతాలలో సైతం ఇంచుమించు ఇదే పరిస్థితి. ఉదాహరణకు " అప్పుల విధానాన్ని" తీసుకుని ఎలా అభివృద్ధి చెందిందో పరిశీలిద్దాం. ఓడ ప్రయాణం 18 నెలలు పడుతుంది కాబట్టి అట్లాంటిక్ వ్యాపార అవసరాల కోసం అప్పులు చేయడం ఆరంభమయ్యింది. ఇది బానిస వ్యవస్థ అవసరాల నుండే ఉద్భవించింది. అదే బ్రిటన్ ప్రాంతంలో కొత్త తరహా బ్యాంకింగ్ విధానానికి కారణమయ్యింది. వీటికి తోడు లండన్ నగరంలో ఉన్న బ్యాంకర్లు, మదుపుదార్ల అభివృద్ధికి మూలం అట్లాంటిక్ బానిసత్వం. సుస్పష్టంగా, క్లుప్తంగా చెప్పాలంటే అట్లాంటిక్ వ్యాపారం, వాణిజ్యం అభివృద్ధికి బానిస వ్యాపారం ప్రధాన కారణం. బానిసల వ్యాపారం ఆధారంగానే అట్లాంటిక్ అభివృద్ధి జరిగింది. ఈ విధానంలో ఆర్థికవృద్ధి ఉందా? అన్న సందేహాలున్నవారికి "నాంచేజ్", న్యూఆర్లేన్స్, మొబైల్ ప్రాంతాల్లోని వ్యాపారస్థుల, వ్యవసాయ క్షేత్రాల యజమానుల ఇళ్లేసాక్ష్యం. జమైకా, బార్బడోస్, బ్రెజిల్, లివర్‌పూల్, బ్రిస్టోల్, గ్లాస్గోలలో మహాభవంతులన్నీ అమెరికాలో ఉన్న ఆఫ్రికన్ బానిసల శ్రమ, కృషి ఫలితమే. సంపద సృష్టికి మూలమైన బానిసల జీవితాలలో పేదరికం, బాధలు అధికస్థాయిలో ఉన్నాయి. ఆఫ్రికన్ల ఆధారంగా అమెరికా పశ్చిమ ప్రాంతం అభివద్ధి చెందినా, తిరిగి వారికేమీ ఇవ్వలేదు. నామమాత్రపు సంపద కూడా బానిసల కందలేదు.

ఇదంతా మనలను మొదటికి తీసుకువెళ్లి తికమక పెడుతుంది. రాజ్యానికి అవసరమున్న సమయంలో అసలు బ్రిటిష్ ప్రభుత్వం బానిసత్వాన్ని ఎందుకు అంతం చేసింది? 1807 తర్వాత 1808లో అమెరికన్లు రాయల్ ఆర్మీ సహకారంతో బానిసత్వాన్ని నిషేధించారు. అయినప్పటికీ 10 లక్షలకు పైగా ఆఫ్రికన్లు అనధికారికంగా క్యూబా, బ్రెజిల్ ప్రాంతాలకు నౌకల్లో తరలించబడ్డారు. బ్రిటిష్ కాలనీలలో 1837-38 వరకూ బానిసత్వం కొనసాగుతూనే ఉంది. ఆఫ్రికాలో బానిస వ్యాపారాన్ని అంతమొందిస్తూనే, అమెరికాలో అంతర్యుద్ధం వరకూ, బ్రెజిల్‌లో 1888 వరకూ ఉత్తరం, తూర్పు, అత్యధిక ఉష్ణ ప్రాంతాల్లో వ్యాపారాన్ని కొనసాగించారు.

1807వ సంవత్సరంలో బ్రిటన్ తన వ్యాపార వ్యూహాన్ని అర్ధంతరంగా మార్చుకుంది. అట్లాంటిక్ బానిసల వ్యవహారానికి కాపలాదారుగా ఉన్న రాయల్ నేవీ, తన పంథా మార్చి బానిస వ్యాపారస్థులకు శాపంగా మారింది. బ్రిటన్‌లోని బానిసల ఆసక్తులను పరిరక్షించే దిశగా చట్టాలు చేయడంలో ఆసక్తి చూపిన పార్లమెంట్, అంతర్జాతీయంగా బానిస విధానం రద్దుపై దృష్టి సారించింది. కాలనీలలో బానిసత్వపు రద్దుతో ఏర్పడిన శూన్యాన్ని ఇండియన్ కూలీలతో నింపే ప్రయత్నం చేసింది. తద్వారా బ్రిటిష్ బానిసత్వపు రద్దు విషయంలో ఎంతో సాధించినట్లుగా గర్వపడింది.

1807వ సంవత్సరంలో బానిసత్వం తప్పు, అనైతికం, క్రైస్తవ వ్యతిరేకమయినట్లయితే, 1707 లో ఎందుకు తప్పు కాలేదు? మారింది బానిసత్వం గానీ, బానిసల వ్యాపారం గాని కానేకాదు. (1707 నుండీ 1807 వరకూ రెండూ అవిచ్ఛిన్నంగా కొనసాగాయి) మారింది బ్రిటన్ వ్యవహారశైలి, ఆలోచనా విధానమే! బ్రిటిష్ జీవన విధానంలో అంతర్గతంగా ఉన్న కఠినత్వాన్ని వదిలించుకుని, ఆలోచనా విధానాన్ని సరళంగా మార్చుకుంది. మతాచరణలో నెలకొన్న మార్పులు, విద్యాధికులు పెరగడం, ప్రజాస్వామ్య ఆలోచనా విధానం ఎదగడం మొదలగు అంశాలన్నీ బానిసత్వపు రద్దుకు కారణాలయ్యాయి. 1807 నాటికి అభిప్రాయాలు అధికమొత్తంలోనే అంగీకరించబడ్డాయి. "ఎడిన్ బర్గ్" తన సమీక్షలో తెలిపినట్లు "దేశం పట్లనున్న భావాలు పాలకులపై ప్రభావం చూపి రద్దుకు కారణమయ్యాయి." ఈనాడు అసలైన సవాలేదయినా ఉంటే అది అట్లాంటిక్ బానిసత్వాన్ని, విస్తృతార్థంలో "రద్దు" నిషేధంతో సమన్వయం చేయడం. "నిషేధంపై పునరాలోచించే అవకాశాన్ని త్వరితగతిలో 2007 ఇవ్వవచ్చు. చారిత్రాత్మకంగా జరిగిన నాటి ఘటనలు బ్రిటిష్ ప్రజలపై ప్రభావం చూపవచ్చు. దూరదృష్టితో ఆ దిశగా సైతం ఆలోచించాలి. ఇవి జరిగేటప్పుడు కొత్త సమస్య లెదురవ్వవచ్చు.

అట్లాంటిక్ బానిసత్వపు కథను విస్తృతమైన విముక్తి కథతో సమ్మిళితం చేయటం ఈరోజు నిజమైన సవాలుగా ఉంది. విముక్తిని గురించి తాత్కాలికంగా ఆలోచన చేయటానికి 2007 అవకాశం కల్పించినప్పటికీ- బ్రిటిష్ ప్రజల చారిత్రకమైన భావనలను ప్రధానమైన ఆ చట్టం ప్రతిబింబిస్తున్నప్పటికీ- దీర్ఘకాలికంగా కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ఆ విధంగా మనం చేస్తున్నపుడు మరింత సమస్యాత్మకమైన పరిస్థితిని ఎదుర్కొంటాం. బానిసత్వానికి పరిహారం చెల్లించటంపై జరుగుతున్న ప్రస్తుత చర్చ( ఇజ్రాయిల్, జర్మని ఉదాహరణల వలెనే 1938లో తోటల యజమానులకు దిగ్భ్రాంతిని గొలిపేలా రెండు కోట్ల పౌండ్లను పరిహారంగా ఇచ్చారు) తరచుగా గందరగోళ పరుస్తుంది. ప్రధానంగా దాన్నొక ఆర్థికాంశంగానే చర్చించటం జరుగుతున్నది. బ్రిటన్ గతాన్ని గురించి జరుగుతున్న చర్చలో భాగంగానే పరిహారం సమస్యను చూడాలి. ఈ చారిత్రక సంఘటనను గురించిన చర్చ బ్రిటిష్ ప్రజలలో పెద్దభాగానికి బాధాకరంగానూ, ఇబ్బందికరంగానూ ఉంటుంది.

**(అనువాదం : డాక్టర్ శమంతకమణి)**

# ఐరిష్ విప్లవ యోధుడు జేమ్స్ కానొల్లి

(2వ పేజీ తరువాయి)

భూస్వాముల ద్వారా, తన ద్రవ్య పెట్టుబడిదారుల ద్వారా, విస్తారంగా వ్యాపించి ఉన్న వాణిజ్య, వ్యక్తిగత సంస్థల ద్వారా ఈ దేశాన్ని పాలిస్తూనే ఉంటుంది".

ఈస్టర్ తిరుగుబాటులో వీరోచితంగా పోరాడిన సాయుధ వలంటీర్లకు కానొల్లి నిజమైన సర్వ సైన్యాధ్యక్షుడు. పోరాటంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. లొంగిపోవాలని తిరుగుబాటు దారులు నిర్ణయించుకున్నపుడు తిరుగుబాటుకు నాయకత్వం వహించిన నాయకులందరితో పాటు కానొల్లి కూడా అరెస్టయాడు. స్వాంతంత్ర్య ప్రకటనపై సంతకం చేసిన ఏడుగురితో పాటు తిరుగుబాటుకు నాయకత్వం వహించిన వారినందరినీ తుపాకులతో కాల్చిచంపాలని బ్రిటిష్ మార్షల్ కోర్టు శిక్ష విధించింది. మే ఐదవ తేది నుండి నాయకులకు విధించిన శిక్షను అమలు జరపటం ప్రారంభించారు. మరణశిక్షను అమలు జరపటానికి కానొల్లిని మే 12వ తేదీన తీసుకొచ్చారు. తీవ్రగాయాల వలన ఆయన ఫైరింగ్ స్కాడ్ ముందు నిలబడలేకపోయాడు. ఆయనను కుర్చీకి కట్టివేసి శిక్షను అమలు జరిపారు. ఆయనకు విధించిన శిక్షను అమలు జరిపిన తీరుపై అన్ని వైపుల నుండి వ్యతిరేకత వ్యక్తమైంది. ఆయన విప్లవ హీరోగా రూపొందాడు.

లెనిన్ తిరుగుబాటును ప్రస్తుతిస్తూనే ఈ విధంగా చెప్పాడు. " ఐరిష్ యొక్క దురదృష్టమేమిటంటే యూరోపియన్ కార్మికుల తిరుగుబాటు పక్వానికి రాకముందే అకాలంగా వారు తిరుగుబాటు చేశారు. తిరుగుబాటులో పాల్గొంటున్న వివిధ విభాగాలు ఎదురుదెబ్బలు, ఓటములు లేకుండా ఒకేవిధంగా ముందుకు పోయే విధంగా పెట్టుబడిదారీ విధానం ఒకే విధంగా నిర్మాణం కాలేదు".

తిరుగుబాటు జరిగినపుడు అది ప్రజామద్దత్తును పొందలేదు. నాయకులను అత్యంత క్రూరంగా చంపటం పెద్ద ఎత్తున సానుభూతి పొందటానికి దారితీసి, జాతీయ చైతన్యాన్ని రగిలించింది. తిరుగుబాటు జరిగిన మూడు సంవత్సరాల తర్వాత స్వాతంత్ర్యం కోసం గెరిల్లా పోరాటం ప్రారంభమై అధినివేశ ప్రతిపత్తితో ఐరిష్ స్వతంత్ర రాజ్యం ఏర్పాటుకు బ్రిటిష్– ఐరిష్ ఒప్పందంతో 1921లో పోరాటం ముగిసింది. 1937లో ఐర్లాండ్ రిపబ్లిక్‌గా అవతరించే వరకు పోరాటం కొనసాగింది.

భారతదేశంలో స్వాతంత్ర్యం కోసం మరింత మిలిటెంట్ పోరాటాలు చేయాలని భావించిన వారిపై ఐరిష్ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటం గణనీయమైన ప్రభావాన్ని కలిగించింది. ఐరిష్ జాతీయవాద నాయకుడైన ఈమాన్ డి వలెరా, సిన్‌ఫీన్‌లు భారతదేశంలోని అనేకమంది విప్లవ జాతీయవాదుల్ని ఉత్తేజపరిచారు. కార్మిక నాయకుడు, తర్వాత భారత రాష్ట్రపతి అయిన వివి గిరి 1913 నుండి 1916 వరకు డబ్లిన్‌లోని యూనివర్సిటి కాలేజీలో చదివాడు. సీన్‌ఫీన్‌తో ప్రభావితం కావటం, ఈస్టర్ తిరుగుబాటు పట్ల సానుభూతితో ఉండటం ఐర్లాండ్ నుండి ఆయనను బహిష్కరించటానికి దారితీసింది. ఈస్టర్ తిరుగుబాటు, తర్వాత జరిగిన గెరిల్లా పోరాటాలు బెంగాల్‌లోని విప్లవ గ్రూపులకు ఉత్తేజం కలిగించాయి. డబ్లిన్‌లోని జనరల్ పోస్టాఫీస్‌ను పట్టుకున్న తర్వాత సూర్యసేన్ నాయకత్వంలో చిట్టగాంగ్ ఆయుధాగారంపై అదే తరహాలో దాడి చేశారు.

జేమ్స్ కానొల్లి కృషి, జీవితం గురించి మనం అధ్యయనం చేయటం, మరింతగా తెలుసుకోవటం చేయాలి. మతం, జాతీయత, వర్గాన్ని గురించిన ఆయన అభిప్రాయాలు భారత మార్క్సిస్టులకు ప్రత్యేకంగా ప్రాధాన్యత కలిగినవి. ఐర్లాండ్ అధినివేశ ప్రతిపత్తిని పొందినపుడు బ్రిటిష్ వారు ఆ దేశాన్ని విభజించారు. 32 కౌంటీలలో ఈశాన్య ప్రాంతంలో ప్రొటెస్టెంట్లు అధికంగా ఉన్న ఆరు కౌటీలను యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఉంచారు. భారత్‌ను విభజించాలన్న బ్రిటిష్ ప్రణాళికకు ఐరిష్ విభజన మార్గదర్శి లాంటిది. మతపరమైన విభజనలను వర్గ రాజకీయాల ద్వారా అధిగమించటానికి, కాథలిక్కులైనా, ప్రొటెస్టెంట్‌లైనా కార్మికులందరిని ఐక్యం చేయటానికి కానొల్లి కష్టపడి పనిచేశాడు. చర్చితో, మత విశ్వాసాలతో కార్మికవర్గ పార్టీ ఏ విధంగా వ్యవహరించాలన్న అంశాలపై ఆయన అభిప్రాయాలు భారతదేశ పరిస్థితులకు వర్తించే విధంగా ఉన్నాయి. అంతర్జాతీయ కార్మికోద్యమ చరిత్రలోనూ, సోషలిజం కోసం జరిగే పోరాటంలోనూ గొప్ప ఐరిష్ విప్లవకారుడుగానూ, ప్రముఖ మార్క్సిస్టు గానూ జేమ్స్ కానొల్లిని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారు.

**(అనువాదం : ఎ. కోటిరెడ్డి)**

# పాఠకుల అభిప్రాయాలు

**అంబేద్కర్ రాజ్యాంగంలో రాజీ బయట రాడికల్** సంపాదకీయం ఆలోచింపచేసింది. మే నెల సంచిక అంబేద్కర్ పై ప్రత్యేకంగా తీసికొని రావడం వలన చాలా విషయాలు తెలిసాయి. దేశం లో 8 శాతం ఉన్న గిరిజనుల కొరకు రాజ్యాంగంలో 5,6 షెడ్యూళ్ళు వ్రాసినప్పటికి వాటిని అమలు చేయు బాధ్యత రాష్ట్రపతి, గవర్నర్‌లకు అప్పగించినప్పటికి వారు అమలు చేయలేదు. భూమి, పరిశ్రమలు జాతీయం కావాలన్నారు, కుల నిర్మూలన జరగాలన్నారు. హిందుత్వ సిద్దాంతాన్ని సమర్ధించలేదు. కాని రాజ్యాంగంలో మతానికి చాలాస్వేచ్ఛ, హక్కులు కల్పించారు. ఆస్తి హక్కు కల్పించారు. ఆర్టికల్ 36 నుండి 51 వరకు ఆదేశిక సూత్రాలలో పొందుపరిచారు. కాని వాటికి చట్ట ప్రతిపత్తి లేదు. ఇప్పటి వరకు పాలకులు వాటిని గుర్తించ లేదు. మనది సెక్యులర్, సోషలిస్టు రిపబ్లిక్‌గా ప్రకటించుకొన్నప్పటికి, ఆచరణలో హిందు రాజ్యాంగంగా ఉన్నది. ప్రభుత్వ కార్యకలాపాలన్ని హిందూ సాంప్రదాయాలతో ప్రారంభించ బడతాయి. అంబేద్కర్‌కు సామాజిక ఆలోచనలో రాడికల్ భావాలున్నా రాజ్యాంగం విషయాలో కొంత రాజీపడినారు. ఆనాటి పరిస్థితులు కొంత కారణం కావచ్చు. ఆయనను భారతదేశపు మార్క్స్‌గా భావించవచ్చు. తక్కువ సమాచారమే ఉన్నా ప్రకాశ్‌కరత్ గారి వ్యాసం ఆలోచింప చేసింది. బి.విరాఘవులు గారి వ్యాసంలో పేర్కొన్నట్లు "దళిత మేధావుల్లో ఒక భాగం మార్క్సిజంపై వ్యతిరేకతను విడువలేని ఆశక్తతలో కూరుకుపోయారు". సమాజంలో ఉన్న దోపిడిని గుర్తించకపోవడం, పాలక వర్గాలకు భజన చేయడం, గుడ్డిగా కమ్యూనిజంపై వ్యతిరేకత, మార్క్సిజాన్ని అధ్యయనం చేయకపోవడమే కారణం అని భావిస్తూ, మార్పు వస్తుందని ఆశిస్తున్నాను.

**– తుంపాల శ్రీరామమూర్తి,** గాజువాక, విశాఖపట్నం

## వ్యాస హెడ్డింగు సంబంధ వివరణ లేదు

మే నెల మార్క్సిస్టులో తిప్పసముద్రం రమణగారి వ్యాసం హెడ్డింగు "నేను కమ్యూనిస్టును... కాకపోతినే" అనే దానిని గూర్చి మొదటి వాక్యం (పేరా)లోనే ఇవ్వబడింది. హెడ్డింగు చూడగానే అంబేద్కర్‌గారు కమ్యూనిస్టు పార్టీలో చేరాలనుకున్నట్లు, కమ్యూనిస్టును కాకపోతినే అని ఆలోచించినట్లు భావన కలుగుతున్నది. కానీ వ్యాసం మొత్తంలో అంబేద్కర్ కమ్యూనిస్టుపార్టీలో చేరాలనుకున్నాడనే విషయమై ఏమాత్రం వివరణ లేదు. మరింత వివరణ ఇచ్చిఉంటే బాగుండేది?

**– తుమ్మల మోహనరావు,** కూకట్‌పల్లి

# ఐక్యసంఘటన ద్వారానే విజయం సాధించగలం



## – డెంగ్ జియావో పింగ్

“ఐక్యసంఘటన పనిని అభివృద్ధి చేసుకోవాలని పార్టీ కేంద్రకమిటి, ఛైర్మన్ మావో వివిధ సందర్భాలలో చాలా స్పష్టంగా నొక్కి చెబుతూ వచ్చారు. విప్లవంలో మన విజయం మనం చేసిన ఐక్యసంఘటన కృషితో విడదీయరాని విధంగా ముడిపడి ఉంది. ఐక్యసంఘటన లేకుండా మనం ఇంత విజయవంతంగా పోరాటాలు చేయగలిగే వారం కాదు. మనం విజయం సాధించినప్పటికీ ఇప్పటికీ ఐక్యసంఘటన లేకుండా మన బాగా పని చేయలేము. ఐనప్పటికీ మన కామ్రేడ్స్ అంతా దాని ప్రాధాన్యతను గుర్తించలేదు. కాబట్టే పార్టీ కేంద్రకమిటి, ఛైర్మన్ మావోలు ఈ అంశాన్ని తిరిగి ముందుకు తెచ్చి, దానిపై ప్రత్యేకమైన నిర్దేశాన్నిచ్చారు.

“ఐక్యసంఘటన పనిని తప్పనిసరిగా అభివృద్ధి చేసుకోవాలని మనం చెబుతున్నాము. ఎందుకని అభివృద్ధి చేసుకోవాలి? మొదటగా దాని ప్రాధాన్యతను, సూత్రాలను తప్పనిసరిగా అర్థం చేసుకోవాలి. మనం ఎందుకు పోరాడుతున్నాం, ఎవరితో పోరాడుతున్నాం, ఎవరితో మనం కలవాలి. ఎవరితో పోరాడాలి అనే అంశాలను మనం తప్పని సరిగా తెలుసుకోవాలి. ఇప్పటి వరకు కొద్దిమంది కామ్రేడ్స్ మాత్రమే ఐక్యసంఘటన పనికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎక్కువ మంది కామ్రేడ్స్ దాని ప్రాధాన్యతను, దానికి సంబంధించిన సూత్రాలను వాస్తవంగా అర్థం చేసుకోలేకుండా ఉన్నారు. నైరుతి ప్రాంతంలోని మన కామ్రేడ్స్ చాలామంది ఐక్యసంఘటన పనిలో మంచి ఫలితాలను సాధించారు. అయినప్పటికీ మిగతా కొందరు కామ్రేడ్స్ ఈ పనిని చైతన్యపూరితంగా చేయటం లేదు. ఆ పనిపైకి నెట్టినపుడు మాత్రమే చేస్తున్నారు. గత సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల తర్వాత ఈ ప్రాంతంలో బందిపోట్ల సమస్య తీవ్రంగా మారింది. ధరలు పెరిగాయి. మన దళాలు, స్థానికంగా ఉన్న కార్యకర్తలు అన్నిచోట్లకు వెళ్ళి పారిశ్రామిక, వాణిజ్య, ఇతర రంగాలలో గుర్తింపు ఉన్నవారిని, చైతన్యవంతులైన పెద్దలను కలిసి బందిపోట్లను అణచివేయ్యటం, ప్రజల నుండి ధాన్యాన్ని సేకరించటం కోసం మద్దత్తు ఇవ్వమని కోరాం. ఐక్యసంఘటన కార్యక్రమాలను చేయటంలో ఇదొక భాగం. బందిపోట్లను ఏకాకులను చేసిన తర్వాత, ధాన్యాన్ని సేకరించిన తర్వాత వారు ఈ పనిని చేయటం ఆపివేశారు. లేదా చాలా పరిమితంగా చేస్తున్నారు. బందిపోట్లను అణచివెయ్యటానికి, ధాన్యాన్ని పోగుచెయ్యటానికి సాధ్యమైనంత ఎక్కువ మందితో మనం ఎందుకు కలవాల్సి వచ్చింది? ఇదితెలియజేసే వాస్తవమేమంటే కష్ట సమయాలలో మనతో కలిసి పనిచేయటానికి వారి సహకారాన్ని కోరుతున్నాం. దీని అర్థం ఏమిటంటే వారులేకుండా ఆ పనిని మనం చేయలేం. మన మిత్రులందరిని కూడగట్టుకోవటం, శత్రువును ఒంటరిని చేయటమే విప్లవంలో మనం విజయం సాధించటానికి కారణం. “మన విజయం తుపాకి గొట్టం ద్వారానే సాధ్యమైందని భావించే కామ్రేడ్స్ మన సైనికదళాలలో కొందరు ఉన్నారు. ఇది పూర్తి వాస్తవ చిత్రణ కాదు. అనేక సంవత్సరాల నుండి పార్టీ కేంద్రకమిటి, ఛైర్మన్ మావో ఐక్యసంఘటన పనికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, అతి జాగరూకతతో అమలు చేశారు. ఒకవైపున మన విజయం తుపాకి గొట్టంపై ఆధారపడి ఉడగా, మరోవైపున దానిని మనం చేసిన ఐక్యసంఘటన కృషితో విడదీయలేము. లాంగ్‌మార్చ్ తర్వాత మనం ఉత్తర షాంగ్జి ప్రాంతానికి వచ్చినపుడు ఎర్రసైన్యం ఫస్ట్ ఫ్రంట్ ఆర్మీలో ఆరువేలమంది మాత్రమే ఉన్నారు. ఉత్తర షాంగ్జిలోని ఎర్రసైన్యం 25వ, 26వ దళాలతో కలిపి మొత్తం పదివేల మందికి కొంచం ఎక్కువగా ఉన్నారు. మనం లక్షమందికి పైగా శత్రుసైన్యంతో చుట్టుముట్టబడి ఉన్నాం. కాబట్టి చాలా చెడు పరిస్థితులలో ఉన్నాం. పార్టీ తనకున్న కామేడ్స్‌లో అత్యున్నతమైన వారిని ఐక్యసంఘటన కృషి చేయటానికి, ఇతర రంగాలలో పనిచేయటానికి పంపటం వలన 1936 డిసెంబరు 12 సంఘటన తర్వాత జపాన్‌ను ఎదిరించటానికి, దేశాన్ని కాపాడుకోవటానికి అవకాశాలు కలిగాయి. విముక్తి యుద్ధం జరుగుతున్నపుడు ఐక్యసంఘటన విధానం, పనికి సంబంధించి ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాం. ఫలితంగా అన్ని ప్రజాస్వామిక పార్టీలను మనవైపుకు తెచ్చుకోగలిగాం. చాంగ్‌కై షేక్ కూడా వారిని సమీకరించటానికి ప్రయత్నించాడు. కాని మనం విజయం సాధించాం. “ఐక్యసంఘటన అవసరాన్ని మనం మరింతగా ప్రచారం చేసి, పార్టీలో దీని అవసరాన్ని గుర్తించిన వారి సంఖ్యను ప్రస్తుతం ఉన్న మైనారిటి నుండి మెజారిటీకి పెంచాలి. ఐక్యసంఘటన పనిని అభివృద్ధి చేయటం మనపార్టీ దీర్ఘకాలిక కర్తవ్యాలలో ఒకటి. ఇది కేవలం ఐక్యసంఘటన విభాగంలో పనిచేసే కార్యకర్తల కర్తవ్యం మాత్రమే కాక, అన్ని రంగాలలో పనిచేసేవారు ఈ కృషి చేయాలి. అన్ని విభాగాలలో ఐక్యసంఘటన కృషిచేయాలి. ఉదాహరణకు పారిశ్రామిక విభాగాన్ని తీసుకోండి. ఇంజనీర్లు, ఉద్యోగులందరు పార్టీ సభ్యులు కాదు. ప్రభుత్వ డిపార్టుమెంట్లలో పార్టీ సభ్యులు కానివారున్నారు. సాంస్కృతిక రంగంలో కార్యకర్తలు, ఉపాధ్యాయులు, డాక్టర్లు, సాంకేతిక నిపుణులలో ఎక్కువ మంది పార్టీసభ్యులు కాదు. కాబట్టి మనం వారితో కలిసి, వారిని చైతన్యవంతులుగా చేయాలి. ఆ విధంగా మనమందరం సోషలిస్టు మార్గంలో పయనించాలి. పార్టీలోని అన్ని విభాగాలు ఐక్యసంఘటన కృషిని చేయాలి. ఈ అంశాన్ని ప్రతి పార్టీసభ్యుడు, ప్రతి కార్యకర్త అర్థం చేసుకొనే విధంగా చెప్పకపోతే మన పనిలో విజయాన్ని సాధించలేము.”

**(చైనా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఐక్యసంఘటన పనిపై 1951, మార్చి 26న జరిగిన నైరుతి బ్యూరో మొదటి కాన్ఫరెన్స్‌లో డెంగ్ జియావో పింగ్ చేసిన ప్రసంగం నుండి ఈ భాగం గ్రహించబడింది)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Hyderabad Prajasakti Printing Press, Plot Not. 21/1, Azamabad, Hyderabad-20. Phone : 040-27673787. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.11, No.2. Published on June 1, 2016